Pubilshed from Tirupathi

PRGI NO : APTEL/25/A2316

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



తిరుపతి TIRUPATHI | సంపుటి : 02 | సంచిక : 90 | ఆదివారం | నవంబర్ 15, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 02 | Issue No : 90 | Sunday | 15 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



డిప్యూటీ మేయర్ పదవి ఎవరికి దక్కేనో..?

(నందం రామారావు)

మచిలీపట్నం నగర పాలక సంస్థకు ఊహించినట్లుగానే కూటమి అధికారంలోకొచ్చింది. మేయర్ పదవికి జరిగిన ప్రత్యక్ష ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన అబ్దుల్ అబీద అత్యధిక మెజారిటీతో విజయం సాధించింది. కూటమికి చెందిన తెలుగుదేశం, జనసేన, బీజేపీకి చెందిన కార్పొరేటర్లు 48 మంది గెలిచారు. టీడీపీకి చెందినవారు 34 మంది, జనసేనకు చెందిన వారు 13 మంది, బీజేపీకి చెందిన వారు ఒక్కరు గెలిచారు.

2 పేజీలో..

నగర పాలక సంస్థకు 60 మంది కార్పొరేటర్లలో కూటమికి చెందిన వారు 48 మంది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు 9 మంది, స్వతంత్రులు ముగ్గురు మొత్తం 60 మంది కార్పొరేటర్లు మచిలీపట్నం నగర పాలక సంస్థ అభివృద్ధికి మేయర్ కూడ పూర్తిగా పనిచేయవలసి వుంటుంది. ఈ నేపథ్యంలో మేయర్‌తోపాటు కార్పొరేటర్లు డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవలసివుంది. ఇప్పుడు డిప్యూటీ మేయర్ పదవికోసం కూటమిలోని పలువురు సీనియర్ కార్పొరేటర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ



10, 16 ఏళ్ల పిల్లలకు ప్రత్యేక టీకాలు

» డిసెంబరు 3 నుంచి 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం

» 28 జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో నిర్వహణ

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :

డిఫ్తీరియా, ధనుర్వాతం వ్యాధుల నుంచి పిల్లలకు అదనపు రక్షణ కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. డిసెంబరు 3 నుంచి 5వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో 10, 16 ఏళ్లు పూర్తి చేసుకున్న పిల్లలకు టీడీ టీకాలు వేయనున్నారు. ఈ వయసు పిల్లల్లో టీకాల కవరేజీని 95 శాతానికి మించి సాధించాలని వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యంగా నిర్దేశించింది.

- మిగతా 2లో..

గిగ్ వర్కర్లు దేశానికి పునాదులు..

» గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా.. రూ.10 లక్షల ఆరోగ్య బీమా » గిగ్ వర్కర్లు బానిసలనేది బీజేపీ భావజాలం... భాగస్వాములనేది కాంగ్రెస్ భావజాలం

» తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత- సంక్షేమ పథకం ప్రారంభోత్సవంలో విపక్ష నేత రాహుల్ గాంధీ



ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్: 21వ శతాబ్దం డేటా శతాబ్దం. ప్రపంచవ్యాప్తంగా డేటాపైనే చర్చ సాగుతోంది. డేటా సెంటర్లు నిర్మిస్తున్నారు. గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఉబర్ వంటి కంపెనీలు డేటా ఆధారంగానే నడుస్తున్నాయి. కానీ భారత దేశంలో గిగ్ వర్కర్లకు వారి డేటా నేటికీ అందుబాటులో లేదు. గిగ్ వర్కర్ తన డేటాను తానే చూసుకోలేడు. వారు ఏం పని చేశారు, ఎన్ని డెలివరీలు చేశారు, ఎంత సమయం పట్టింది, ఎంత డబ్బు వచ్చింది, ఎప్పుడు వచ్చింది? ఈ సమాచారం వారికి అందేది కాదు.

2 పేజీలో..



అనకాపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

» మృతుల కుటుంబాలను పరామర్శించిన అనిత

» అనకాపల్లి జిల్లా కొత్త పోలవరం వద్ద అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

» ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి నలుగురికి తీవ్ర గాయాలు

» విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనిత

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం మండలంలో శనివారం విషాదం చోటుచేసుకుంది.

- మిగతా 2లో..

రాజకీయాల్లో పోటీ.. అభివృద్ధిలో సహకారం

మోదీతో సాన్నిహిత్యంపై డీకే శివకుమార్

» అభివృద్ధి పనుల విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామన్న డీకే శివకుమార్

» మోదీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న చర్చలపై స్పందన

» రాజకీయాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని వ్యాఖ్య

» పలు కార్యక్రమాల్లో మోదీతో శివకుమార్ సరదాగా మాట్లాడటంతో రాజకీయ వర్గాల్లో చర్చ

» రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ప్రస్తావించానని వెల్లడి



కర్ణాటక : రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకు సత్సం బంధాలు ఉన్నాయం టూ జరుగుతున్న చర్చలపై స్పందిస్తూ.. రాజకీ యాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని వ్యాఖ్యానిం చారు. "రాజకీ యాల్లో పోటీ పడతాం.. అభివృద్ధిలో సహకరిం చుకుంటాం"

2 శేషజ్యోతి

ని పేర్కొన్నారు.బెంగళూరులో శుక్రవారం పింక్‌లైన్ మెట్రో ప్రారంభోత్సవం సహా పలు కార్యక్రమాల్లో మోదీతో శివకుమార్ సరదాగా మాట్లాడటం, సన్నిహితంగా మెలగడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీనిపై శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఆ సందర్భాలను ఎవరికి నచ్చినట్లు వారు అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రజాప్రతినిధిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన



అయ్యో పాపం అనే రోజులు పోయాయి.. చుక్కలు చూపిస్తాం


బొత్స సత్యనారాయణ

» కక్షపూరిత రాజకీయాలు చేసే వారికి భవిష్యత్తులో గట్టిగా బుద్ధి చెబుతామని బొత్స హెచ్చరిక » రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఈక్వాలిటీ రాజకీయాలు పనిచేయవని వ్యాఖ్య

» పార్టీ శ్రేణుల ఆలోచనా విధానం మారాలని జగన్‌కు వివరించినట్లు వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, విజయనగరం : విజయనగరం జిల్లాలో నిర్వహించిన వైసీపీ సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో కక్షపూరిత రాజకీయాలు చేసే వారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని, చుక్కలు చూపిస్తామని గట్టిగా హెచ్చరించారు.

- మిగతా 2లో..



ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు తప్పనిసరిగా బరిలో ఉండాలి

గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి స్థానంలో గట్టి పోటీ ఇవ్వాలి

» పార్టీ శ్రేణులంతా సమన్వయంతో బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలి » అధికార పార్టీ బెదిరింపులు, ప్రలోభాలు, అక్రమాలను ధైర్యంగా ఎదుర్కోవాలి » నామినేషన్ల అడ్డగింతలు, పోలీసుల దౌర్జన్యాలపై వీడియో ఆధారాలు సేకరించాలి » ఎన్నికల అక్రమాలపై తక్షణమే ఫిర్యాదులు చేసి న్యాయపోరాటానికి సిద్ధంగా ఉండాలి » క్షేత్రస్థాయిలో పరిశీలకులు క్రియాశీలకంగా వ్యవహరించాలి » పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులతో టెలికాన్ఫరెన్స్‌లో వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి : రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఒక్క సర్పంచ్, వార్డు స్థానం కూడా పోటీ లేకుండా వదిలిపెట్టరాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు.

2 లో

పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులతో శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, ప్రతి గ్రామంలో పార్టీ మద్దతుదారులు తప్పనిసరిగా పోటీలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని వైయస్ జగన్ శనివారం ఉదయం కూడా ప్రత్యేకంగా ఫోన్ చేసి, పార్టీ శ్రేణులందరికీ స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారని చెప్పారు.ఇటీవల జరిగిన మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కేవలం రాజకీయ

కాకినాడ మేయర్ పీఠంపై ఉత్కంఠ..

» వైసీపీ అభ్యర్థి ఖరారు.. కూటమిలో కసరత్తు!

» కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలపై పెరిగిన రాజకీయ వేడి

» మేయర్ అభ్యర్థిగా కాద సత్యశ్రీని ప్రకటించిన వైసీపీ

» పాత్తులో భాగంగా జనసేనకు దక్కిన కాకినాడ మేయర్ సీటు

» అభ్యర్థి ఎంపికపై జనసేనలో కొనసాగుతున్న కసరత్తు

» ఇరు పక్షాలకూ ప్రతిష్ఠాత్మకంగా మారిన ఎన్నికల పోరు



ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ : రాష్ట్రంలో స్థానిక ఎన్నికల సందడి కొనసాగుతుండగా, అందరి దృష్టి ఇప్పుడు కాకినాడ కార్పొరేషన్‌పై కేంద్రీకృతమైంది. ఈ నెల 26న పోలింగ్ జరగనున్న ఈ ఎన్నికలు అధికార, ప్రతిపక్షాలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఓవైపు వైసీపీ వ్యూహాత్మకంగా తమ మేయర్ అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలోకి దూకాలని చూస్తుండగా, మరోవైపు కూటమిలో భాగమైన

2 పేజీలో..

రాజకీయాల్లో పోటీ.. అభివృద్ధిలో సహకారం

అంశాలను ప్రస్తావించానని తెలిపారు.మేకెదాటు ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు ఇప్పించాలని మోదీని కోరినట్లు శివకుమార్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు అఖిలపక్ష బృందంతో ఢిల్లీ వెళ్లేందుకు అంగీకరించాయని చెప్పారు. అటవీ, పర్యావరణ అనుమతులు సహా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. కస్తూరిరంగన్ నివేదికను తిరస్కరించాలని, మెట్రో ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి సాంకేతిక కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మెట్రో ప్రాజెక్టు వ్యయంలో రాష్ట్రానికి సమాన వాటా ఇవ్వాలని, బెంగళూరులో 500 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాల లక్ష్యాన్ని చేరుకునేందుకు పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని కోరినట్లు వివరించారు.డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ల నిర్మాణంపైనా మోదీతో చర్చించినట్లు చెప్పారు. బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రి కృష్ణ బైరేగౌడతో కలిసి నగర అవసరాలను ప్రధానికి వివరించామన్నారు. ఇతర ప్రాంతాల్లో రహదారులు 18-20 శాతం మేర ఉంటే బెంగళూరులో ఆ వాటా 8 శాతమేనని తెలిపారు. భూసేకరణకు చదరపు అడుగుకు సుమారు రూ.50 వేల పరిహారం చెల్లించాల్సి వస్తోందని, అయినా ఫ్లైఓవర్ల నిర్మాణ వ్యయంలో రాష్ట్రం వాటా భరించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. రాష్ట్ర డిమాండ్లపై అఖిలపక్ష బృందంతో ఢిల్లీకి వెళతానని పునరుద్ఘాటించారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై పూర్తి నివేదిక తీసుకున్న తర్వాత స్పందిస్తానని చెప్పారు. బెలగావిలోని సువర్ణ విధానసౌధ విద్యుత్ బిల్లుల బకాయిలపై మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ అందుకుంటున్న రైతుల బిల్లులూ పెరిగాయని వివరించారు. వాటి మొత్తం రూ.20 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు చేరిందన్నారు. కరవు కారణంగా రైతులు నీటి ట్యాంకులు నింపేందుకు ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నారని, పరిస్థితిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అయ్యో పాపం అనే రోజులు పోయాయి..

చుక్కలు చూపిస్తాం

గతంలో మాదిరిగా రాజకీయ ప్రత్యర్థులపై అనవసర సానుభూతి చూపిస్తూ 'అయ్యో పాపం' అని వదిలేసే పరిస్థితులు ఇకపై ఉండబోవని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను గమనిస్తుంటే, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఆలోచనా విధానాన్ని (మైండ్ సెట్) మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఏర్పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అందరినీ సమానంగా చూసే రాజకీయాలు ప్రస్తుత వాతావరణంలో ఇకపై పని చేయవేమోనని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర రాజకీయాల్లో ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితులు, పార్టీ వర్గాలు అనుసరించాల్సిన వైఖరిపై తన మనసులోని అభిప్రాయాలను ఇప్పటికే పార్టీ అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు బొత్స వెల్లడించారు. కక్షసాధింపు చర్యలను ఇకపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

అనకాపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

కొత్త పోలవరం గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడి విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు.పోలీసుల సమాచారం ప్రకారం... ఎస్. రాయవరం మండలం గుర్రంపేట గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు కారులో పోలవరం వెళ్లారు. సరదాగా గడిపి తిరిగి వస్తుండగా, కొత్త పోలవరం వద్ద కారు అతివేగం కారణంగా అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ తీవ్ర ప్రమాదంలో కురందాసు శ్రీను, కోర్ని శ్రీను అనే ఇద్దరు యువకులు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో కురందాసు ప్రసాద్, బొట్టా సురేంద్ర, కురందాసు శివ, కురందాసు అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో నలుగురినీ అత్యవసర చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న హోం మంత్రి వంగలపూడి అనిత ఈరోజు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎలాంటి లోటు లేకుండా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్యులకు, అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం కొత్త పోలవరంకు వెళ్లి ఘటనా స్థలిని పరిశీలించారు. ఈ తర్వాత నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కాకినాడ మేయర్ పీఠంపై ఉత్కంఠ..

జనసేన పార్టీలో అభ్యర్థి ఎంపికపై తీవ్ర కసరత్తు జరుగుతోంది. ఈ పరిణామాలు కాకినాడ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. కాకినాడ మేయర్ పీఠాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీ, ఆ దిశగా వేగంగా పావులు కదిపింది. నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ కాద వెంకటరమణ తన కుటుంబంతో సహా మాజీ ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో పార్టీలో చేరారు.
ఇదే అదనుగా, ఆయన కుటుంబానికి చెందిన కాద సత్యశ్రీని కాకినాడ వైసీపీ మేయర్ అభ్యర్థిగా జగన్ ప్రకటించారు. నగరంలో మంచి పేరున్న వైద్యుల కుటుంబం కావడం, సామాజిక సమీకరణాల్లో భాగంగా బలమైన శెట్టి బలిజ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వడంతో వైసీపీ కొత్త రాజకీయ లెక్కలకు తెరతీసింది. దీంతో వార్డు అభ్యర్థులు కూడా నామినేషన్లకు సిద్ధమవుతున్నారు.
మరోవైపు, కూటమి పొత్తుల్లో భాగంగా కాకినాడ మేయర్ స్థానం జనసేన పార్టీకి దక్కింది. అయితే, పార్టీ నుంచి ఎవరు బరిలోకి దిగుతారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం జనసేన తరఫున గుత్తుల వెంకట శుభ, చొల్లంగి సుబ్బలక్ష్మి, కదలి ఈశ్వరి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే, కాకినాడ మేయర్ పదవిని తీసుకోవాలా? లేక దానికి బదులుగా తూర్పు గోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి మారాలా? అనే దానిపై జనసేన పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. కాకినాడను తమ కంచుకోటగా భావించే జనసేన, ఈ ఎన్నికల్లో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది. తొలి విడత మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో, కాకినాడ కార్పొరేషన్‌ను గెలవడం వైసీపీకి అత్యంత కీలకంగా మారింది. అదే సమయంలో తమ పట్టు నిలుపుకోవాలని కూటమి భావిస్తోంది. ఇటీవల కార్పొరేషన్‌లో విలీనమైన ఆరు కొత్త పంచాయతీల ఓటర్లు ఈ ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నారు. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వ్యూహ ప్రతివ్యూహాలతో కాకినాడ మేయర్ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది.

డిప్యూటీ మేయర్ పదవి ఎవరికి దక్కేనో..?

మొదటి పేజీ తరువాయి

హయాంలో మచిలీపట్నం నగర పాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభంజనాన్ని ఎదిరించి గెలిచిన వారిలో కూటమికి చెందిన వారు పినిశెట్టి ఛాయాదేవి, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, సమతా కీర్తి వున్నారు. ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో కూడా వారు విజయం సాధించారు.
ఈ నేపథ్యంలో డిప్యూటీ మేయర్ పదవికోసం సీనియర్లు అయిన కొట్టే వెంకట్రావు (జనసేన), పినిశెట్టి ఛాయాదేవి (జనసేన), గీత్‌చరణ్ (జనసేన – మొదటిసారి ఎన్నిక), తెలుగుదేశం పార్టీకి చెందిన అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, సమతా కీర్తి, బీజేపీకి చెందిన ఏకైక మహిళ పంతం వెంకట మహాలక్ష్మి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.తెలుగుదేశం పార్టీకి చెందిన అబ్దుల్ అబీద మేయర్‌గా ఎన్నికయ్యారు గనుక, డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ ఎన్నికల్లో జనసేనకు చెందినవారు 17 మంది పోటీ చేయగా 13 మంది విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన అబీద మేయర్‌గా వున్నారు గనుక జనసేనకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆ రీత్యా తమ పార్టీకి చెందిన వారిలో ఒకరికి తప్పనిసరిగా డిప్యూటీ మేయర్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ విషయంలో మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ జనసేన శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, డిసిఎం ఛైర్మన్ బండి రామకృష్ణలు తమ పలుకుబడిని ఉపయోగించి డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు ఇప్పించాలని కోరుతున్నారు.
ఇక బీజేపీకి చెందిన పంతం వెంకట మహాలక్ష్మికి డిప్యూటీ మేయర్ ఇవ్వాలని ఆ పార్టీలోని జిల్లా నాయకులు పట్టుబడుతున్నారు. కూటమిలో తమ భాగస్వామ్యం వున్నా తమ పార్టీకి తగిన గుర్తింపు ఇవ్వటంలేదని, ఇప్పుడు అవకాశం వచ్చింది గనుక ఇవ్వాలని పట్టుబడుతున్నారు. వాస్తవంగా చెప్పుకోవాలంటే కేంద్ర ప్రభుత్వం కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు ముగ్గురుకయినా కేంద్ర ప్రభుత్వంలో చిన్న పదవి కూడా ఇవ్వలేదని, పార్టీని నమ్ముకుని సంవత్సరాల తరబడి నిస్వార్థంగా పని చేస్తున్న సీనియర్లను కూడా పరిగణనలోకి తీసుకోలేదని అసంతృప్తి జిల్లాకు చెందిన బీజేపీ నాయకుల్లో వుంది.
మచిలీపట్నం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ పదవిని తెలుగుదేశం పార్టీకే దక్కేవిధంగా ఆ పార్టీలోని సీనియర్లు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మహిళకు కేటాయించినట్లయితే సమతా కీర్తికి ఇవ్వాలని, మగవారికిచ్చే పక్షంలో దింటకుర్తి సుధాకర్ లేదా అన్నం ఆనంద్ కు ఇవ్వాలని మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ సామాజిక వర్గానికి చెందిన దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్‌కు ఆ పదవి ఇవ్వాలని తన ప్రయత్నాల్లో వున్నట్లు తెలుస్తున్నది.
ఒకే పార్టీకి (తెలుగుదేశం) చెందిన మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల్లో వుంటే పరిపాలన, నగర అభివృద్ధి త్వరితంగా జరుగుతుందన్న వాదన ఆ పార్టీలోని వారు తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఇదే గనుక నిజమయితే ఇది వితండవాదనే!
భాగస్వామ్య పార్టీగా జనసేన వుంది గనుక, ఆ పార్టీని గౌరవించుకోవలసిన అవసరం వుందన్న అభిప్రాయం ఆ పార్టీలోని వారికి వుంది. ఏది ఎలా వున్నా మేయర్ పదవి మైనార్టీకి దక్కింది గనుక డిప్యూటీ మేయర్ పదవి ఓ.సికి గానీ ఎస్సీలకు గానీ కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

10, 16 ఏళ్ల పిల్లలకు ప్రత్యేక టీకాలు

మొదటి పేజీ తరువాయి

చిన్నతనంలో ప్రాథమిక టీకాల కార్యక్రమంలో భాగంగా వేసిన పెంటావాలెంట్ టీకాల ద్వారా లభించిన రక్షణను మరింత పెంచేందుకు ఈ అదనపు టీకాలు వేస్తారు. డిఫ్తీరియా, ధనుర్వాతం తీవ్రమైన అనారోగ్యానికి, ప్రాణాపాయానికి దారితీసే అంటువ్యాధులు కావడంతో యుక్తవయసులోనూ రక్షణ కల్పించడం అవసరమని శాఖ పేర్కొంది.ప్రతి ఏఎన్ఎం తన పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల జాబితాను సిద్ధం చేసి, టీకా తీసుకోవాల్సిన పిల్లల వివరాలను సేకరించాలి. ఇప్పటికే యూవిన్ పోర్టల్‌లో నమోదు కాని అర్హుల వివరాలను నమోదు చేయాలి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లని పిల్లలను కూడా గుర్తించి జాబితాలో చేర్చాలి. 10 ఏళ్లు పూర్తి చేసుకున్న పిల్లలకు టీడీ 10, 16 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి టీడీ 16 టీకా వేయాలి. సాధారణ టీకాల కార్యక్రమంలో ఇప్పటికే సంబంధిత టీకా తీసుకున్న పిల్లలకు మరోసారి వేయకూడదు.టీకా కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ఏఎన్ఎంలు సూక్ష్మ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. ఇందులో పాఠశాల లేదా కళాశాల పేరు, గ్రామం, ఏఎన్ఎం, పిల్లలను సమీకరించే సిబ్బంది పేర్లు, అవసరమైన టీకాలు, వైద్య సామగ్రి, టీకాల పంపిణీ విధానం వివరాలు ఉండాలి. కార్యక్రమం కోసం యూవిన్ పోర్టల్‌లో అదనపు టీకా కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి సమయాలను ముందుగానే నిర్ణయించాలి. టీకాల ప్రాధాన్యంపై వైద్యాధికారులు, పర్యవేక్షకులు, మధ్యస్థాయి ఆరోగ్య ప్రదాతలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించాలి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా టీకా అధికారులు, వైద్యాధికారులు మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, పురపాలక శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలి. జిల్లా టీకాల కార్యాచరణ బృందం, మండల స్థాయి కార్యాచరణ బృందాల సమావేశాల ద్వారా సంబంధిత శాఖల సహకారం తీసుకోవాలి. ప్రతి టీకా కేంద్రంలో అవసరమైన టీకాలు, వైద్య సామగ్రి తగినంత పరిమాణంలో అందుబాటులో ఉండాలి. టీకా అనంతరం తీవ్రమైన అలర్జీ వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైతే చికిత్స అందించేందుకు అన్‌ఫైలాక్సిస్ కిట్ తప్పనిసరిగా ఉంచాలి. ప్రతి టీకా కేంద్రాన్ని సమీపంలోని టీకా అనంతర ప్రతికూల ప్రభావాల నిర్వహణ కేంద్రంతో అనుసంధానించాలి.ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జిల్లా స్థాయి పరిశీలకులను నియమించాలి. జిల్లా టీకా అధికారులు, వైద్యాధికారులు, పర్యవేక్షకులు ప్రత్యేక టీకా కేంద్రాలను పరిశీలించి, నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలి. టీకాలు తీసుకున్న పిల్లల వివరాలను 24 గంటల్లోగా యూవిన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. వారందరికీ డిజిటల్ టీకా ధ్రువపత్రాలు జారీ చేయాలి. ఆర్‌సీహెచ్, హెచ్‌ఎంఐఎస్ పోర్టళ్లలోనూ వివరాలను నమోదు చేయాలి. జిల్లాల వారీగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో రోజువారీ టీకా కవరేజీ నివేదికలను సేకరించి రాష్ట్ర టీకా అధికారికి పంపించాలి. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఈ ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే పిల్లలతో పాటు వాటికి వెళ్లని అర్హులైన పిల్లలందరికీ టీకాలు అందేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా టీకా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, జాతీయ ఆరోగ్య మిషన్ సంచాలకుడు కె.వి.ఎన్. చక్రధర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

గిగ్ వర్కర్లు దేశానికి పునాదులు..

కష్టం వారిదే, కానీ వారి డేటాను వారే చూసుకోలేకపోయేవారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన చట్టం డేటాపై వారికి హక్కును కల్పించబోతోంది. వారు చేసే పని, పూర్తి చేసే రైడ్లు, డెలివరీలు, ప్రతి రైడ్ లేదా లావాదేవీకి ఎంత డబ్బు చెల్లిస్తున్నారో పూర్తి సమాచారం వారి చేతిలో ఉంటుంది. ప్రభుత్వం గిగ్ వర్కర్లకు గ్యారెంటీ ఇస్తోంది.
ఈ సమాచారం వారి మొబైల్ ఫోన్‌లో అందుబాటులో ఉంటుంది, దాన్ని వారి చూసుకోవచ్చని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత మరియు సంక్షేమ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ప్రసంగించారు.
కొంతకాలం క్రితం నేను తెలంగాణలోని గిగ్ వర్కర్లతో సమావేశమయ్యాను. ఆ సమయంలో వారి బాధలను, కష్టాలను నాకు చెప్పారు. నేను, కాంగ్రెస్ పార్టీ, మా ముఖ్యమంత్రి వారికి సహాయం చేయడంతో పాటు భద్రత, రక్షణ కల్పించడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చాం. ఆ హామీని, వాగ్దానాన్ని ఈ రోజు మేం నెరవేర్చుతున్నాం.
తెలంగాణ నగరాల్లో గిగ్ వర్కర్లు రోజంతా ఎండలో స్కూటర్ నడుపుతూ డెలివరీలు చేస్తారు, కానీ వారు విశ్రాంతి తీసుకోవడానికి ప్రత్యేకమైన స్థలం లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం వై-ఫై సౌకర్యంతో కూడిన విశ్రాంతి కేంద్రాలు (రెస్ట్ జోన్లు) నిర్మిస్తోంది. అక్కడ వారు విశ్రాంతి తీసుకోవచ్చు, వారి వాహనాన్ని నిలుపుకోవచ్చు. కాసేపు కూర్చోవచ్చు, అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకోవచ్చు. తెలంగాణ ప్రభుత్వం ఇలాంటి రెస్ట్ జోన్లను హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని నగరాల్లో నిర్మించబోతోంది.
ఏదైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అనారోగ్యానికి గురైనా గిగ్ వర్కర్లు తీవ్రంగా నష్టపోతారు. పని చేయలేని పరిస్థితి ఏర్పడటంతో వారి కుటుంబం మొత్తం సంక్షోభానికి గురవుతుంది. అందుకే తెలంగాణ ప్రభుత్వం ప్రతి గిగ్ వర్కర్‌కు రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందించడానికి గ్యారెంటీ ఇస్తోంది.
గిగ్ వర్కర్లకూ పింఛను రావాలి, వారికీ సామాజిక భద్రత ఉండాలి. వారి భవిష్యత్తు కోసం డబ్బు ఆదా కావాలి. అందుకే ప్రతి లావాదేవీలో, వారు డెలివరీ చేసిన ప్రతి సారి, ఉబర్ రైడ్ పూర్తి చేసిన ప్రతి సారి, అది బ్లింకిట్ డెలివరీ అయినా లేదా మరే ఇతర సేవ అయినా, ప్రతి లావాదేవీ, ప్రతి డెలివరీపై 1 శాతం మొత్తం నేరుగా వారి భవిష్యత్తు, భద్రతకు జమ అవుతుంది. కంపెనీలు ప్రతి లావాదేవీపై ఈ మొత్తాన్ని తెలంగాణ గిగ్ వర్కర్స్ బోర్డులో జమ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత బోర్డు ద్వారా ఈ డబ్బు నేరుగా గిగ్ వర్కర్ల బ్యాంక్ ఖాతాలకు చేరుతుంది.

రెండు భావజాలాలు...

21వ శతాబ్దంలో రెండు రకాల భావజాలాలు ఉన్నాయి. ఒక భావజాలం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లది. వారు గిగ్ వర్కర్లను వెట్టి చాకిరీ చేసే కూలీలుగా మార్చాలని కోరుకుంటున్నారు. వారు 24 గంటలు పని చేయాలని, వారి రక్తం, చెమట చిందించాలని, ప్రమాదాల్లో గాయపడాలని, దెబ్బలు తినాలని, చనిపోవాలని, అణచివేయబడాలని వారు కోరుకుంటున్నారు, కానీ పూర్తి లాభం మాత్రం బిలియనీర్లకు దక్కాలి. అంబానీ-అదానీలకు దక్కాలి, ఉబర్-ఓలాలకు దక్కాలి, వారి కష్టానికి తగిన ఫలితం, ప్రయోజనం వారికి దక్కకూడదు అని వారు అనుకుంటున్నారు.
రెండో భావజాలం కాంగ్రెస్ పార్టీది, నా భావజాలం. గిగ్ వర్కర్లు ఈ దేశానికి పునాది. కార్మికులు ఈ దేశానికి పునాది, ఆధారం. ఇది ఒక భాగస్వామ్యం. గిగ్ వర్కర్లను భాగస్వాములుగా చేయాలని, వారిని రక్షించాలని మేం కోరుకుంటున్నాం. వారికి భద్రత, రక్షణ కల్పించాలని మేం భావిస్తున్నాం. ఇవే ఆ రెండు భావజాలాలు. ఒకవైపు గిగ్ వర్కర్లకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీ వారికి బీమా ఇస్తోంది, ప్రతి లావాదేవీలో వారి కోసం డబ్బును ఖాయం చేస్త...

ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు

తప్పనిసరిగా బరిలో ఉండాలి

ప్రత్యర్థులతోనే కాకుండా అధికార యంత్రాంగంతోనూ పోరాడాల్సి వచ్చిందని సజ్జల పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు పోలీసులను, అధికారులను అడ్డుపెట్టుకుని బెదిరింపులు, ప్రలోభాలు, నామినేషన్ల తిరస్కరణ, పోలింగ్, కౌంటింగ్, ఫలితాల ప్రకటన వరకు అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అయినప్పటికీ పార్టీ అధ్యక్షుడు ఇచ్చిన స్ఫూర్తితో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధైర్యంగా నిలబడి గట్టి పోటీ ఇచ్చాయని అభినందించారు.
పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగకపోయినా, రాజకీయ పార్టీలకు గ్రామస్థాయిలో బలమైన పునాది ఏర్పడేది ఈ ఎన్నికల ద్వారానేనని వివరించారు. రాబోయే ఎన్నికలకు ఇవి సన్నాహక పరీక్షల వంటివని, బూత్ స్థాయిలో పార్టీ బలాబలాలను అంచనా వేసుకోవడానికి, సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసుకోవడానికి ఉపయోగపడతాయని చెప్పారు. ఈ ఎన్నికల్లోనూ అధికార పార్టీ మొత్తం అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తోందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో వేలంపాటలను తలపించేలా ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం వస్తోందన్నారు.

ప్రతి గ్రామంలో బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలి : గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు, స్థానిక సామాజిక సమీకరణలు, అభ్యర్థుల ప్రజాబలం, నాయకత్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న వనరులను పరిగణనలోకి తీసుకుని బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, స్థానిక నాయకులు, గ్రామ కమిటీలు సమిష్టిగా నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైతే పార్టీ గ్రామ, మండల, అనుబంధ విభాగాల కమిటీల్లోని సమర్థులైన నాయకులను పోటీలో నిలపాలన్నారు. అభ్యర్థుల ఎంపికలో ఆర్థిక స్థోమత ఒక్కటే ప్రామాణికం కాకూడదని, ప్రజల్లో ఉన్న ఆదరణ, పోరాడే సత్తాకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. గెలుపు కోసం ప్రయత్నించడం ఎంత ముఖ్యమో, ముందుగా పోటీలో నిలబడటం అంతకంటే ముఖ్యమని పేర్కొన్నారు. పోటీలో ఉంటేనే ప్రజల్లోకి వెళ్లి పార్టీ విధానాలను వివరించే అవకాశం ఉంటుందన్నారు. ఏ గ్రామంలోనైనా వైఎస్సార్‌సీపీ పోటీలో లేకపోతే అక్కడ పార్టీ ఉనికే లేదనే భావన కలిగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్థానికంగా కొందరు నాయకులు ఒత్తిళ్లకు తలొగ్గినా, పోటీకి సిద్ధంగా ఉన్న పార్టీ శ్రేణులను ప్రోత్సహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా వెనక్కి తగ్గే పరిస్థితి రాకూడదన్నారు.

అక్రమాలపై ఆధారాలు సేకరించి న్యాయపోరాటం చేయాలి : నామినేషన్ల దాఖలును అడ్డుకోవడం, అక్రమంగా తిరస్కరించడం, అభ్యర్థులను బెదిరించడం, పోలీసుల అధికార దుర్వినియోగం వంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే వీడియోలు, ఫొటోలు తదితర ఆధారాలను సేకరించాలని ఆదేశించారు. వాటిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేయడంతో పాటు న్యాయస్థానాల్లో సవాల్ చేసేందుకు అవసరమైన ఆధారాలను భద్రపరచాలని సూచించారు. ఇందుకోసం మండల స్థాయిలో ఇద్దరు చొప్పున న్యాయపరమైన అంశాలను సమన్వయం చేసే బాధ్యులను ఏర్పాటు చేయాలని ఇప్పటికే సూచించినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీకి బలమైన సంస్థాగత వ్యవస్థ ఉందని, అనుబంధ విభాగాలు, సోషల్ మీడియా విభాగాలతో కలిపి సుమారు 1.14 లక్షల మంది కార్యకర్తలకు పార్టీ అధ్యక్షుడి సందేశాన్ని చేరవేశామని చెప్పారు. గ్రామ, మండల కమిటీలతో పాటు మీడియా, సోషల్ మీడియా వ్యవస్థలను సమర్థంగా వినియోగించుకుని ఎన్నికల అక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. హింసాత్మక ఘటనలు, పోలీసుల దౌర్జన్యాలు, ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఆధారాలను సేకరించి జాతీయస్థాయిలోనూ ప్రస్తావించేందుకు, అవసరమైతే ఢిల్లీలో వాటిని వెల్లడించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

క్షేత్రస్థాయిలో పరిశీలకులు పూర్తి బాధ్యత తీసుకోవాలి : పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించాలని సజ్జల ఆదేశించారు. ఎక్కడైనా పోటీ లేకుండా స్థానాలు మిగిలిపోయే పరిస్థితి ఉంటే వెంటనే స్థానిక నాయకులను అప్రమత్తం చేయాలన్నారు. సమస్యలను ముందుగా నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, రీజినల్ కోఆర్డినేటర్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, అక్కడ పరిష్కారం కాని అంశాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించాలని సూచించారు.
ఇప్పటికే గ్రామ, మండల కమిటీలు, అనుబంధ విభాగాల నాయకులకు పార్టీ అధ్యక్షుడి ఆదేశాలను తెలియజేశామని, వాటిని క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలు చేయించే బాధ్యత పరిశీలకులపై ఉందన్నారు. నియోజకవర్గ స్థాయిలో సమన్వయ లోపాలు తలెత్తకుండా చూడటంతో పాటు పార్టీ అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలన్నారు.

ఎన్నికలపై పరిశీలకుల నుంచి ప్రత్యేక నివేదికలు : గత మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పరిశీలకులు నిర్వహించిన బాధ్యతలు, క్షేత్రస్థాయిలో గుర్తించిన అంశాలు, ఎదురైన సమస్యలపై సంక్షిప్త నివేదికలు సమర్పించాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేక ఈమెయిల్ చిరునామాను అందిస్తామని, ఆ నివేదికలు నేరుగా తన పరిశీలనకు వస్తాయని తెలిపారు. అలాగే ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల నుంచి ఫలితాల వరకు చోటుచేసుకునే పరిణామాలు, పార్టీ పనితీరు, ఎదురైన ఇబ్బందులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడంతో పాటు ఎన్నికల అనంతరం సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. నివేదికల్లోని అంశాలను అవసరమైతే పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ దృష్టికి తీసుకెళ్తామని, భవిష్యత్తులో పార్టీ నిర్ణయాలకు కూడా వాటిని పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
ఆదివారం, నవంబర్ 15, 2026

నామినేషన్ల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

❖జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ❖గుడివాడలో పారదర్శకంగా నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు ❖నామినేషన్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ❖తగిన పోలీసు బందోబస్తు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః నామినేషన్ల ప్రక్రియను నిబంధనల మేరకు నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.కృష్ణా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా గుడివాడ పురపాలక సంఘంలోని 48 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ గుడివాడలోని నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా గుడివాడ పురపాలక సంఘం కార్యాలయంలో 48 వార్డులకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించి, అక్కడ చేపట్టిన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాల యంలో చైర్‌పర్సన్ ఎన్నికకు సంబం ధించి ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రా న్ని కూడా పరిశీలించారు.ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నామి నేషన్ల స్వీకరణ ప్రక్రియను స్వేచ్ఛ గా, నిష్పక్షపా తంగా, పారదర్శకంగా నిర్వహించేం దుకు అన్ని అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి నామినేషన్ ఛాంబర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా తగిన పోలీసు బందోబస్తు కల్పించామని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ విధులు నిర్వహించే ఎన్నికల అధికారులందరికీ నిబంధనలు, విధివిధానాలపై సమగ్ర శిక్షణ అందించామని తెలిపారు. ఎన్ని కల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రతి నామినేషన్‌ను నిష్పక్ష పాతంగా స్వీకరించాలని అధికారులకు సూచిం చారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అభ్యర్థులకు లేదా ఇతరులకు ఏవైనా సమస్యలు, సందేహాలు ఎదు రైతే నేరుగా మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించాలని, వాటిని పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు, పక్షపాతానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిం చాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, మున్సి పల్ కమిషనర్ మనోహర్ రావు, ఎన్నికల సంబంధిత అధికారులు ఉన్నారు.



కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
తుపాను కారణంగా దెబ్బతిన్న మచిలీపట్నం1వ డివిజన్‌లోని విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. ప్రజలకు ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా, త్వరితగతిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు 1వ డివిజన్ కార్పొరేటర్ వంపుగడవల గీత్‌చరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత అన్నారు. వార్డులో సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



రిజిస్ట్రేషన్ చలానా వివరాలతో ప్రతి కార్యాలయంలో నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడంతో పాటు, రిజిస్ట్రేషన్లకు సంబం ధించిన చలానా వివ రా లను ప్రజలకు స్ప ష్టంగా తెలియజేసేలా ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో ప్రత్యేక నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం ఆధ్వ ర్యంలో సంఘ నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలకు చెల్లించాల్సిన రుసుములు, ప్రభుత్వానికి సంబం ధించిన చలానా వివరాలు, రిజిస్ట్రేషన్ ఫీజులు తదితర అంశాలపై పూర్తి అవగాహన ఉండేలా నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.ప్రతి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రజలకు కనిపించే విధంగా చలానా వివరాలను ప్రదర్శించడం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై స్పష్టత ఏర్పడుతుందని, ప్రజలు ముం దుగానే చెల్లించాల్సిన మొత్తాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ప్రభుత్వం నిర్ణ యించిన రుసుముల వివరాలను బహిరంగంగా ప్రదర్శించడం ద్వారా ప్రజల్లో అవగాహన పెరగ డంతో పాటు రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పారదర్శకతకు అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రజల ఇబ్బం దులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో చలానా వివరాల నోటీసు బోర్డులు ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో బి. సి సంక్షేమ సంఘ నాయకులు జోగి శివ, బెల్లంకొండ రవి, భోగిరెడ్డి సుభాని, నిక్కు రాధ కృష్ణ, బోడవుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఉచిత మధుమేహ పరీక్షలు - అవగాహన కార్యక్రమం





మధుమేహాన్ని ముందుగానే గుర్తించండి –ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించండి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:
ప్రపంచ మధుమేహ దినోత్సవం (నవంబర్ 14) సందర్భంగా మచిలీపట్నంలోని మున్సిపల్ పార్క్ మరియు యర్రా నాగేశ్వరరావు (వైఎన్ఆర్) పార్క్‌లలో ఎంజి హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు మరియు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పార్కులకు వచ్చిన ప్రజలకు రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించి, మధుమేహం, దాని వల్ల కలిగే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, నివారణ చర్యలు మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ బోలెం తేజ నవీన్, ఎండి, (జనరల్ మెడిసిన్) మాట్లాడుతూ, మధుమేహాన్ని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా గుండె, మూత్రపిండాలు, కళ్ళు మరియు నరాలకు కలిగే నష్టాన్ని చాలావరకు నివారించవచ్చని తెలిపారు. క్రమం తప్పకుండా మధుమేహ పరీక్షలు చేయించుకోవడం, సమతుల ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం మరియు వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందడం ఎంతో ముఖ్యమని వివరించారు.డాక్టర్ కేశన ప్రవల్లిక, లైఫ్ స్టైల్ ఫిజీషియన్ మాట్లాడుతూ, మధుమేహ నియంత్రణలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ, తగినంత నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటి జీవనశైలి మార్పులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంజి హెల్త్ క్లినిక్ వైద్యులు మరియు సిబ్బంది పాల్గొని ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించారు.



బాల్యంలో నేర్పిన పాఠమే జీవితాంతం గుర్తుంటుంది

8వ డివిజన్ కార్పొరేటర్ పిన్నిశెట్టి ఛాయాదేవి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
గురువుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన ద్వారా రేపటి సమాజానికి ఉత్తమ పౌరులను అందించవచ్చని మచిలీపట్నం 8వ డివిజన్ కార్పొరేటర్ పిన్నిశెట్టి ఛాయాదేవి అన్నారు.భారత తొలి ప్రధాని, బాలల ప్రియతమ నాయకుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవ వేడుకలను స్థానిక వలందపాలెంలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో వీవీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ పిన్నిశెట్టి ఛాయాదేవి, సీనియర్ జర్నలిస్ట్, వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులకు కేకులు, మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఛాయా దేవి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు క్రమశిక్షణ, నైతిక విలువలు, నాణ్యమైన విద్య ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించిప్రోత్సహించినప్పుడే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు.ఫౌండేషన్ నిర్వాహకులు వేమూరి రమేష్ మాట్లా డుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలు, దేశాభివృద్ధి పట్ల ఆయన చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, భద్రత, సమాన అవకా శాలు కల్పించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్పొరేటర్ ఛాయాదేవి స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించి, చిన్నారులతో ఆప్యా యంగా ముచ్చటిస్తూ వారిలో ఆనందోత్సాహాలు నింపారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యా యుల కొరతను పాఠశాల సిబ్బంది కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఛాయాదేవి సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పిన్నిశెట్టి వేణు, చిన్నం సురేష్, ఎం. కోటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీ ధరల ధరణి బియ్యాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలి

❖26 కిలోల బస్తా రూ.1,300.. ❖ప్రజలకు పోషక విలువలతో కూడిన బియ్యం.... డీఎస్ఓ టి. శివరామ ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ధరణి బ్రాండ్ పేరుతో ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గన్నవరం రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ధరణి రైస్ కౌంటర్‌లో బియ్యం నిల్వలు, నాణ్యత, విక్రయాలను జిల్లా పౌరసరఫరాల అధికారి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి టి. శివరామ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ధరణి బియ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. 26 కిలోల బస్తా కేవలం రూ.1,300కే అందిస్తున్నట్లు తెలిపారు. రైతుబజార్లలో బియ్యం ధరలు అందుబాటులో ఉండటంతో పాటు, రేషన్ కార్డుదారులు తమకు అవసరమైన బియ్యాన్ని కొనుగోలు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి ప్రత్యేక ప్యాకింగ్ ద్వారా 26 కిలోల బియ్యం బస్తాలను అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 2,790 మంది వినియోగదారులకు కేవన్ఎం రకం బియ్యం 679.12 క్వింటాళ్లు, బీపీటీ రకం బియ్యం 68.90 క్వింటాళ్లు విక్రయించగా, మొత్తం 748.02 క్వింటాళ్ల బియ్యం అమ్మకాలు జరిగినట్లు వెల్లడించారు.ధరణి బియ్యంలో ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్ బి-12 వంటి పోషకాలు సమృద్ధిగా ఉన్నాయని, ఇవి గర్భిణులు, పిల్లలకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఐరన్ రక్తహీనతను తగ్గించేందుకు, విటమిన్ బి-12 నరాల ఆరోగ్యానికి, ఫోలిక్ యాసిడ్ శరీర ఎదుగుదలకు ఉపయోగపడతాయని వివరించారు. ఈ బియ్యం వినియోగం వల్ల రక్తహీనత, నీరసం వంటి సమస్యలను తగ్గించుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కాబట్టి పేద కుటుంబాలన్నీ ప్రభుత్వ రాయితీ ధరలకు అందిస్తున్న ధరణి బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రైతుబజార్లలో ధరణి బియ్యం విక్రయాలను నిరంతరం పర్యవేక్షించాలని, బియ్యం నిల్వలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

గిరిబాబు మరణం తెలుగు సినీ రంగానికి తీరనిలోటు.. మచిలీపట్నం సాహితీ మిత్రులు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః
తెలుగు సినీ రంగంలో ఏడు వందలకు పైగా చలనచిత్రాలు నటించి తెలుగువారి మనసులలో సుస్థిర స్థానం ఏర్పరచుకున్న ప్రముఖ నటుడు గిరిబాబు మరణం సినీ రంగానికి తీరని లోటు అని మచిలీపట్నం సాహితీ మిత్రులు అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. జగమే మాయ, చిత్రం ద్వారా తెలుగు సినీ రంగానికి పరిచయమై ఎక్కువ పాత్రలు విభిన్నంగా నటించి మంచి గుర్తింపు పొంది అంచలంచలుగా ప్రేక్షకులు మన్ననలు పొందిన మంచి నటుడు గిరిబాబు అని అన్నారు.

ముఖ్యంగా ఆయన కరుణామయుడు, కురుక్షేత్రం వంటి చిత్రాలలో పాత్రలో నటించిన తెలుగు సినీ రంగంలో గిరిబాబు తనకంటూ ఒక పేజీని ఏర్పాటు చేసుకున్నారని బాలాజీ అన్నారు. సినీ జగత్తులో ఎందరో జూనియర్ పేద కళాకారులను ప్రోత్సహించి సేవా కార్యక్రమాలు చేయడంలో గిరిబాబుకు పెట్టింది పేరు అని అన్నారు. వివాదాలకు తావు లేకుండా చిన్నా పెద్దా నటులతో కలిసి తన జీవితకాలం కొనసాగించిన గిరిబాబు అందరికీ ఆదర్శప్రాయుడని లంకిశెట్టి బాలాజీ అన్నారు. గిరిబాబు మరణం సాహిత్య కళా రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు.



నిర్మల హైస్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్స హించాలి: నగర మేయర్ అబీదా

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:



మచిలీపట్నంలోని నిర్మల హై స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. విద్యార్థుల ఉత్సా హం, ఆటపాటలు, సాంస్కృతిక కార్య క్రమాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్ర మానికి మచిలీపట్నం నగర మేయర్ అబ్దుల్ అబీదా ముఖ్య అతిథిగా హాజరుకాగా, డాక్టర్ హసీం బేగ్, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ తేజస్వి విశిష్ట అతి థులుగా పాల్గొన్నారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమ తులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా మేయర్ అబీదా మాట్లా డుతూ, విద్యార్థుల జీవితంలో బాల్యం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాం స్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ సందడి చేశారు. ఉపాధ్యాయుల ఉత్సాహభరిత ప్రదర్శనలకు విద్యార్థులు కేరింతలు కొడుతూ ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. పాఠ శాలలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో నిర్మల హైస్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక అభివృద్ధికి నెహ్రూ పాలనలో బలమైన పునాది

జనసేన పార్టీ నియోజక వర్గ నాయకులు మండలి వెంకట్రామ్



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
స్వతంత్ర భారతదేశ తొలి ప్రధా నిగా జవహర్ లాల్ నెహ్రూ దేశ ఆర్థిక అభివృద్ధికి బలమైన పునాది వేశారని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు మండలి వెంక ట్రామ్ అన్నారు. శనివారం అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వ ర్యంలో నెహ్రూ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ విగ్రహానికి వెంకట్రామ్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘ కాలం పోరాడిన నెహ్రూ దేశ తొలి ప్రధానిగా భారత ప్రణాళికా సంఘ స్థాపన, మొదటి పంచవర్ష ప్రణాళికలతో ఆర్థికంగా దేశానికి పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. భూ పునఃపంపిణీ విధానం, నీటి కాలువలు త్రవ్వించడం, ఆనకట్టల నిర్మాణం, వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలతో సాగు రంగాన్ని సుస్థిరం చేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు అనే విశ్వాసంతో పనిచేసిన నెహ్రూ రైతాంగానికి చేసిన మేలు మరువలేనిది అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గుడివాక శేషుబాబు, మత్తి రాజీవ్, మాజీ ఎంపీటీసీ కటికల బాలాజీ, జనసేన పార్టీ మండల నాయకులు బచ్చు శ్రీహరి, టౌన్ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు, టీడీపీ లక్ష్మీపురం అధ్యక్షులు గొరిపర్తి సుబ్బారావు, జనసేన కే.కొత్తపాలెం గ్రామ అధ్యక్షులు మత్తి వంశీకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు (చిన్నా), యర్రంశెట్టి సుబ్బారావు, దివినీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, నీటి సంఘం అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, మాజీ ఉప సర్పంచ్ అడపా శ్రీను, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక భారత నిర్మాణంలో నెహ్రూ పాత్ర మరువలేనిది: విక్కుర్తి



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
భారత తొలి ప్రధానమంత్రి, స్వాతం త్ర్య సమరయోధుడు పండిట్ జవహ ర్‌లాల్ నెహ్రూ జయం తిని పురస్క రించుకుని శనివారం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యా లయంలో నెహ్రూ చిత్రపటా నికి అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా విక్కుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో జవహర్‌లాల్ నెహ్రూ కీలక పాత్ర పోషించారని, స్వాతంత్ర్యం అనంతరం దేశ తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆధునిక భారతదేశ నిర్మాణానికి విశేష కృషి చేశారని కొనియాడారు. దేశంలో పారిశ్రామిక, విద్యా, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పిల్లలంటే ఎంతో ప్రేమ కలిగిన నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు దేశం అందిస్తున్న గౌరవానికి నిదర్శనమన్నారు.దేశాభివృద్ధికి నెహ్రూ చేసిన సేవలు, ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని విక్కుర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

ఆదివారం 15 నవంబర్ 2026



శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో

ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాభూమి ఏలూరు

శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ జి. చందర్రావు, వైస్ ప్రిన్సిపాల్ వి.సుభాష్ రావు, లైబ్రేరియన్ రామ్ గణేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.పుస్తకాలు ఆలోచనా శక్తిని,వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.వైస్ ప్రిన్సిపాల్ విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షలకు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకోవాలని అన్నారు.లైబ్రేరియన్ రామ్ గణేష్ గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు.కళాశాల చైర్మన్ నల్లమెల్లి శేషారెడ్డి, సెక్రటరీ డా.ఎన్.సుగుణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా. బి.వి.ఎల్. నాయుడు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,అధ్యాపకులు, బోధన,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు యూకే ఎస్ సి చే మైక్ సెట్ బహుకరణ



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

నవంబర్ 14వ తేదీన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని జరుపుకునే బాలల దినోత్సవంసందర్భంగా,యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ పాలకొల్లు ఆధ్వర్యంలో స్థానిక బంగారు వారి చెరువుగట్టు వద్ద ఉన్న ఎస్ కేపీ ఉ టీవీర్ మున్సిపల్ హైస్కూల్ నందు క్లిబ్ అధ్యక్షులు డాక్టర్ సంగినీడి వెంకట రంగారావు అధ్యక్షతన యూ కె ఎ స్సీ గవర్నర్ పెనుమాక రామ మోహారావు ముఖ్య అతిధిగా బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్కూల్ కి క్లబ్ తరఫున రూ. 11,000/- విలువైన మైక్ సెట్ అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధానకార్యదర్శి గంధం యేసుపాదం, కోశాధికారి శిరిగినీడి రాంబాబు, యూ కెఎ స్సీ అసిస్టెంట్ గవర్నర్ జక్కంపూడి మదన్ మోహన్, చేగొండి ప్రభాకర్, స్కూల్ప్రధానోపాధ్యాయులు యేసుబాబు, దీపిక, ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థిని విద్యార్థుల పాల్గొన్నారు.

నెహ్రూ ఆకాంక్షలకు అనువుగా చిన్నారులు ఎదగాలి

- ఐటిడిఎ పివో కె. రాములు నాయక్

ప్రజాభూమి,బుట్టాయగూడెం



భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆకాంక్షలకు అణువుగా చిన్నారులు దేశభక్తితో ఎదగాలని కోట రామచంద్రపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ అన్నారు. మండలంలోని కోట రామచంద్రపురం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కె. రాములు నాయక్ భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతి సందర్భంగా శనివారం జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జవహర్‌లాల్ నెహ్రూ 1889 నవంబర్ 14వ తేదీన జన్మించారని, ఆయనకు పిల్లలంటే ఎంతో ప్రేమ అని తెలిపారు. పిల్లలందరూ ఆయనను ప్రేమగా చాచా నెహ్రూ అని పిలిచేవారని, ఆయన జయంతి రోజైన నవంబర్ 14వ తేదీని మన దేశంలో బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. నేటి బాలలే రేపటి భారతదేశానికి నాయకులవుతారని, విద్య, క్రమశిక్షణ, నిజాయితీ, దేశభక్తి, సేవాభావం వంటి విలువలను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని నెహ్రూ ఆకాంక్షించేవారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐ.టి.డి.ఏ. అధికారులు, సిబ్బంది పాల్గొని జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళులర్పించారు.

ఆధునిక భారత నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల కాజ లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ పీర్ సాహెబ్ మాట్లాడుతూ మొదటి భారత ప్రధాన మంత్రి గా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆధునిక భారత నిర్మాణానికి చేసిన కృషిని వివరించి ఆయన సేవలను కొనియాడారు. పండిట్ నెహ్రూ ఎంతటి ప్రాముఖ్యత కలిగిన కార్యక్రమాల్లో తలమునకలై ఉన్నా బాలల కోసం కొంత సమయాన్ని వెచ్చించే వారని అన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు కనుక ప్రతి విద్యార్థి చిన్నతనం నుండీ మంచి అలవాట్లు అలవర్చుకోవాలని కోరారు కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వి. హరీష్ కుమారి, కే.మాధవి, కే. వినాయక్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు.

మురుసు తుఫానుతో దెబ్బతిన్న చెరువులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

- రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్న జడ్పీటీసీ సూరమ్మ

ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

మురుసు తుఫాను ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న చెరువుల ను, కాలువ గట్లను నూతనంగా ఎన్నికైన జీలుగుమిల్లి జడ్పీ టీసీ కోర్స సూరమ్మ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు పి.అంకంపాలెం మాజీ సర్పంచ్ డైనమి క్ లీడర్ కోర్స వెంకటేశ్వరరావు చెరువులను బాగు చేయిస్తు న్నారు. రానున్న యాసవికాలం దృష్టిలో పెట్టుకొని కనీసం పశువుల కోసం అయినా చెరువులో నీళ్లు నిలబడటం కోసం సొరవ తీసుకొని ఇరిగేషన్ అధికారుల సహాకారంతో మురసు తుపాన్ కారణంగా పి. అంకంపాలెం గ్రామానికి చెందిన



చింతల చెరువు వరద తాకిడి వాళ్ళ చెరువు కట్ట తెగిపోయింది దానిని బాగు చేయిస్తున్నారు.

అక్కడక్కడా భారీ గండ్లు పడ్డవి రాబోయే ఖరీఫ్. రభి. సీజన్ గమనించి ముందు చూపుతో వ్యవసాయానికి సాగునీరు అందించే విధంగా రైతు పక్ష పాతిగా ఆలోచించి గండ్లు పుడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జీలుగుమిల్లి మండలంలో ప్రతి పంచాయితీలో మురసు తుపాన్ కారణంగా గండ్లు పడిన చెరువులు ఉంటే ఎంపీటీసీలు గ్రామస్థులు వై ఎస్ ఆర్ సీపీ కార్యకర్తలు మా దృష్టికి తీసుకు వస్తే జడ్పీటీసీ వాటినన్నిటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వర్షపు నీరు వృధాగా పోకుండా ఖరీప్. రభి సీజన్ కి చెరువులు నిండు కుండల తలపించే విధంగా రైతులకు అందుబాటులో సాగునీరు ఉంటుందని ఆమె తెలియజేసారు.

దూసుకొస్తున్న ఆక్వాన్ తుఫాను

- కోస్తా జిల్లాలకు పొంచి ఉన్న ముప్పు.
- తాజా హెచ్చరికలు

ప్రజాభూమి బ్యూరో ఏలూరు

ఏపీకి మరో తుఫాను ముప్పు ముంచుకొస్తోంది. బంగాళాఖా తంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి ఈనెల 15న వాయుగుండగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ తాజా హెచ్చరికలు జారీ చేసింది. ఇది ఉత్తర-వాయవ్య దిశగా పయనిస్తూ, నవంబర్ 16వ తేదీ సాయంత్రానికి మధ్య బంగాళాఖాతంలో తుఫాన్‌గా తీవ్రతరం కావచ్చునని వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది. ఇప్పటికే ఈ తుఫానుకు ఆక్వాన్ గా పేరు ఖరారు చేసారు. దీంతో.. అధికారులు కీలక సూచనలు చేసారు. ఏపీకి ఆక్వాన్ తుఫాను ముప్పు పొంచి ఉంది. ఆర్నాబ్ తుఫాను తరహాలో విరుచుకు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరో 48 గంటల్లో వాయుగుండంగా మారనుంది. ఈ నెల 16వ తేదీ సాయంత్రానికి బంగాళాఖాతంలో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ ప్రభావం తో 150 కిమీ వేగంతో గాలులు వీస్తాయని.. 19 లేదా 20న తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ తుఫాను కోస్తాంధ్ర వైపు దూసుకొస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీంతో, రానున్న మూడు రోజుల్లో కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మత్స్య కారులు వేటకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దట్టమైన పొగమంచుకు అవకాశం ఉన్నందున వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. నవంబర్ 14, 15 తేదీల్లో అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో గంటకు



40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. దీంతో.. తుఫాను కదలికలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం అవుతోంది.

కోస్తా జిల్లాల రైతాంగం తీవ్ర ఆందోళనలి

పొంచి ఉన్న ఆక్వాన్ తుఫాన్ దృశ్య రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోస్తా జిల్లాల్లో ఉన్న వరి పంట చేతికి అందుతున్న తరుణంలో పొంచి ఉన్న తుఫాను వల్ల ఎటువంటి నష్టం చవిచూడాల్సి వస్తుందోనని రైతుల ఆవేదన చెందుతున్నారు. ఎలినోవా ప్రభావంతో వర్ష భావం లేకపోవడం వల్ల కృష్ణ డేటా ఆయా కట్టు ప్రాంతంలో ఉన్న రైతులు అనేక కష్టాలను ఎదుర్కొని వరి పంటలు సాగు చేశారు. కొంతమంది మీరు అందన ప్రాంతాల్లో పంట పొలాలను ఖాళీగా ఉంచారు. పంట పండించిన రైతులు చేతికి పంట వచ్చే సమయానికి తుఫాన్ పొంచి ఉండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రానున్న తుఫాను రైతులకు ఎలాంటి ప్రభావం చూపనున్నదో??

కూటమిలో క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదు..

- రెబల్స్‌గా బరిలో దిగితే పార్టీ వేటు తప్పదు!
- సర్పంచ్ ఎన్నికల్లో మూడు పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

రానున్న సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బర్రింకలపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీలుగుమిల్లి మండలానికి చెందిన కూటమి ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని అన్నారు. కూటమిలో అంతర్గత విభేదాలు, వివాదాలు కొనసాగితే అవి ప్రతిపక్షాలకు విజయావకాశాలుగా మారుతాయని హెచ్చరించారు. రానున్న సర్పంచ్ ఎన్నికల్లో గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా మూడు పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ అధిష్టానాల నిర్ణయాలను గౌరవించకుండా రెబల్ అభ్యర్థులుగా బరిలో నిలిచే వారిపై పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తప్పవని కూటమి నాయకులు స్పష్టం చేశారు. మూడు పార్టీల నాయకులు కూటమి పొత్తు ధర్మాన్ని పాటిస్తూ, పరస్పర సహకారంతో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. జీలుగుమిల్లి మండలంలోని 12



పంచాయతీలకు కూటమి పార్టీల అభ్యర్థుల కేటాయింపు ఖరారు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. జీలుగుమిల్లి మండలంలో జనసేన పార్టీకి 5, తెలుగుదేశం పార్టీకి 6, బీజేపీకి 1 పంచాయతీ స్థానాన్ని కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మూడు పార్టీల నాయకులు సమష్టిగా పనిచేసి కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, బీజేపీ మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, కూటమి నాయకులు బండారు అనిల్, రూపా సత్యనారాయణ, సూరిశెట్టి మహేష్, గుడపాటి పుల్లయ్య, అజయ్, గారపాటి శ్రీను, ప్రభాకర్, కోలా మధు, శేఖర్, కుంజా రమేష్, పద్దం వెంకటకృష్ణ, యాండ్రా శేఖర్, కూరం వెంకటేష్, జాస్తి సత్యనారాయణ, సిరిబత్తుల స్వామి, గూడెల్లి లక్ష్మీనారాయణ, శొంఠి రామకృష్ణ, కొప్పుల శ్రీకాంత్, సరియం ముత్యాలరావు, జీలుగుల శివ, బండారు సత్యనారాయణ, నెలటూరు మోహన్, నాలి శ్రీను, తోట బాలు, సంకుల రామకృష్ణ, బుద్దా నాగరాజు, సంకురుడు తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు మున్సిపల్ కూటమి చైర్పర్సన్ అభ్యర్థినిగా ఉషారాణి?

- ఇండిపెండెంట్గా రోజారమణి ప్రచారం ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మున్సిపల్ కూటమి చైర్పర్సన్ అభ్యర్థినిగా పాలకొల్లు పట్టణ టిడిపి అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు(జి వి) సతీమణి ఆబోతుల ఉషారాణి పేరును ఖరారు చేస్తూ మంత్రి నిమ్మల రామానాయుడు నిర్ణయించినట్లు తెలిసింది. ఉషారాణి ఉపాధ్యాయురాలుగా పాలకొల్లు మండలం అగర్రు జడ్పీ హై స్కూల్ లో పనిచేస్తున్నప్పటికీ రిజైన్ చేయించి నట్లు తెలిసింది.19 83 నుంచి టిడిపిలో సేవలందిస్తూ, మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడిగా సేవలందించిన తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన జీవి సతీమణికి చైర్పర్సన్ అభ్యర్థిని గా మంత్రి నిమ్మల నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఇంకా నామినేషన్లు వేయాల్సి ఉంది.

అలక వహించి ఇండిపెండెంట్గా మాజీ వైస్ చైర్పర్సన్ రోజా రమణి ఎన్నికల ప్రచారం:

టిడిపి ఆవిర్భావం నుంచి కూడా తూర్పు కాపు సామాజిక వర్గంకే చెందిన కర్నెన గౌరు నాయుడు జిల్లా బీసీ టీడీపీ అధ్య క్షుడిగా సేవలందిస్తుండగా, ఆయన సతీమణి రోజారమణి కూడా టిడిపిలో కౌన్సిలర్ స్థాయి నుంచి వైస్ చైర్ పర్సన్ గా సేవలందించారు. ప్రస్తుతం రాష్ట్ర టిడిపి మహిళ ఉపాధ్యక్షురా లుగా కూడా సేవలందిస్తున్నారు. ఈసారి చైర్ పర్సన్ అభ్యర్థి అవకాశం కూటమి పార్టీ నుండి తమకే వస్తుందని ఆశిం చినప్పటికీ ఆశాభంగం కలగడంతో మనస్థాపనకు గురై రోజా రమణి గౌరు నాయుడు ఇండిపెండెంట్గా చైర్పర్సన్ పదవికి పోటీ చేయాలని నిర్ణయించి, నామినేషన్ వేయకుండానే శనివారం ఉదయం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చైర్పర్సన్ అభ్యర్థినిగా కూ టమి తరఫున మండేట్ వస్తే సైకిల్ గుర్తుకేయాలని, లేనిపక్షంలో మాండేట్టు రాకపోతే కనుక ఇండిపెండెంట్గా చైర్ పర్సన్‌గా గెలిపించాలని కోరుతూ ప్రచారం ప్రారంభించారు. పాలకొల్లు నియోజకవర్గంలో మంత్రి నిమ్మల రామానాయుడు నేతృత్వంలో పురపాలక సంఘ కూటమి అభ్యర్థిని జీవి సతీమణి గండేటి ఉషారాణి అని ఎంపిక చేశారు. అయితే ఈ ఎంపిక పట్ల వసంతృప్తితో ఉన్న రోజా రమణి గౌరు నాయుడు ఇండిపెండెంట్గా వేస్తామని వెళ్లిపోయి ఎన్నికల ప్రచారం ప్రారంభించేశారు. దీంతో రోజా రమణి గౌరు నాయుడులను కూ టమి పార్టీ రెబల్ కాండిడేట్లుగా ప్రకటించి టిడిపి నుంచి సస్పెండ్ చేసి వేటు వేస్తారా అనే చర్చ కూడా టిడిపిలో, కూటమి పార్టీలో జోరుగా సాగుతోంది. పాలకొల్లు పురపాలక సంఘం చైర్పర్సన్ కూటమి అభ్యర్థిని ఎంపికపై వివాదం తల ఎత్తడంతో ఐ విఆర్ఎస్ కాల్స్ ప్రారంభమయ్యాయి.కూటమి చైర్ పర్సన్ అభ్యర్థి ని ఎంపిక చేయడం లో అభ్యంతరాలు రావడంతో ఈ విషయంమై రాష్ట్ర టిడిపి కమిటీకి చేరగా సీఎం చంద్రబాబు సూచనలతో ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా కూడా ప్రయత్నించమని అన్నట్లు తెలిసింది. దీంతో అభ్యర్థి ని ఎంపిక విషయం పై ఐ వి ఆర్ఎస్ కాల్స్ కూడా ప్రారంభమయ్యాయి. చివరకు ఎవరిని కూటమి అభ్యర్థి నిగా ఎంపిక చేస్తారనేది, కర్నెన రోజా రమణి, గవురు నాయుడు ల పై ఏమైనా చర్యలు ఉంటాయా ఉండవా అనేది తెలియాలి అంటే వేచి చూడాల్సిందే మరి.

గ్రామ పంచాయతీ ఎన్నికల తొలిదశ ప్రక్రియకు ఆరు కేంద్రాలు ఏర్పాటు

- ఎంపీడీవో వెంకటలక్ష్మి

ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండలంలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్ని కలు-2026కు సంబంధించి తొలిదశ ఎన్నికల ప్రక్రియ నిర్వ హణ కోసం మండలంలోని గ్రామ పంచాయతీలను ఆరు గ్రూ పులుగా విభజించి, ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మం డల పరిషత్ అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాలలో సంబంధిత స్టేజ్-× రిటర్నింగ్ అధికారులు తమకు కేటాయించిన రెండు గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారు. ఎన్నికల నోటీసు ప్రచురణ, నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, గుర్తుల కేటాయింపు తదితర కార్యక్రమాలు ఆయా కేంద్రాల్లో నిర్వహించబడతాయి.

1. అంకన్నగూడెం కేంద్రం: అంకన్నగూడెం, రాచన్నగూడెం గ్రామ పంచాయతీలకు స్టేజ్-× ప్రధాన కేంద్రంగా అంకన్నగూడెం నిర్ణయించబడింది. నామినేషన్ల స్వీకరణ అంకన్నగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతుంది.

2. దర్భగూడెం కేంద్రం: దర్భగూడెం, స్వర్ణవారిగూడెం గ్రామ పంచాయతీలకు స్టేజ్--× ప్రధాన కేంద్రంగా దర్భగూడెం నిర్ణయించబడింది. నామినేషన్ల స్వీకరణ దర్భగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతుంది.

3. జీలుగుమిల్లి కేంద్రం: జీలుగుమిల్లి, పాలచర్లరాజవరం గ్రామ పంచాయతీలకు స్టేజ్--× ప్రధాన కేంద్రంగా జీలుగుమిల్లి నిర్ణయించబడింది. నామినేషన్ల స్వీకరణ జీలుగుమిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతుంది.

4. ములగలంపల్లి కేంద్రం: ములగలంపల్లి, టి. గంగన్నగూడెం గ్రామ పంచాయతీలకు స్టేజ్--× ప్రధాన కేంద్రంగా ములగలంపల్లి నిర్ణయించబడింది. నామినేషన్ల స్వీకరణ ములగలంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతుంది.

5. పి. అంకంపాలెం కేంద్రం: పి. అంకంపాలెం, కామయ్యపాలెం గ్రామ పంచాయతీలకు స్టేజ్--× ప్రధాన కేంద్రంగా పి. అంకంపాలెం నిర్ణయించబడింది. నామినేషన్ల స్వీకరణ పి. అంకంపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతుంది.



6. తాటియాకులగూడెం కేంద్రం: తాటియా కుల గూడెం, వంకావారి గూడెం గ్రామ పంచాయ తీలకు స్టేజ్--× ప్రధాన కేంద్రంగా తాటియా కులగూడెం నిర్ణయించ బడింది. నామినేషన్ల స్వీ కరణ తాటియాకుల గూడెం గ్రామ పంచా యతీ కార్యాలయంలో జరుగుతుంది. కావున, ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన అభ్యర్థులు 15. నుండి 17 వరకు సంబంధిత నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో తమ నామినేషన్లను దాఖలు చేయాలని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాల కోసం కేటాయించిన కేంద్రాలను సంప్రదించాలని తెలియజేయడమైనది. రాజకీయ నాయకులు ఎన్నికలకు సహకరించాలని కోరారు.

ప్రజాభూమి

కోనసీమ 5

ఆదివారం 15 నవంబర్ 2026

కత్తిపూడిలో వైసీపీ అభ్యర్థిని ఏకగ్రీవం చేస్తే రూ.2 కోట్లు ఇస్తాం!

- ఇతర పార్టీలు అంతకంటే ఎక్కువ నిధులు ఇస్తే పోటీ నుంచి తప్పుకుంటాం
- వైసీపీ జిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు గౌతు స్వామి ప్రకటన



ప్రజాభూమి, ప్రత్తిపాడు (శంఖవరం)

కత్తిపూడి గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ.2 కోట్లు అందజేస్తామని వైసీపీ జిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు గౌతు స్వామి ప్రకటించారు. శనివారం కత్తిపూడిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ సంచలన ప్రకటన చేశారు. ఈ సందర్భంగా గౌతు స్వామి మాట్లాడుతూ.. ఈ ప్రతిపాదనను అన్ని రాజకీయ పార్టీల నాయకుల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇతర పార్టీలు రూ.2 కోట్లకు మించి గ్రామాభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు ముందుకు వస్తే తాము పోటీ నుంచి తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. గ్రామంలో రాజకీయ పోటీల కంటే అభివృద్ధికే ప్రాధాన్యత ఇవ్వాలన్న ఉద్దేశంతో ఈ ప్రతిపాదన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నిక ఏకగ్రీవమైతే ప్రభుత్వం అందించే ప్రోత్సాహక నిధులు కూడా గ్రామానికి అందుతాయని, వాటిని వినియోగించి కత్తిపూడిని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. ఈ మీడియా సమావేశంలో వైసీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు గౌతు వాసు, వైసీపీ నాయకులు గాబు కృష్ణమూర్తి, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి పెయ్యల రాజా తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా నెహ్రూ జయంతి

ప్రజా భూమి ప్రతినిధి – చాట్రాయి

భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రు జయంతిని శనివారం తుమ్మ గూడెంఎంపీపీ ఎస్ ఉర్దూ పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి ఆయనకు ఎంతో ఇష్టమైన గులాబీ పువ్వులతో అలంకరించి విద్యార్థులు ఉపాధ్యాయులు నివాళులుఅర్పించడం జరిగింది .అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంప వెంకట్రావు మాట్లాడుతూచిన్నపిల్లలు అంటే అమితమైన ప్రేమ అని ఆయనకు ఇష్టమైన గులాబీ పూల తో ఆయనను ఘనంగా సత్కరించడం జరిగింది అని అన్నారు. ఆయన పుట్టినరోజును బాలల దినోత్సవం గా సంతోషంగా జరుపుకునే వారిని దేశ ప్రధానిగా ఆయన ఎన్నో సేవలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు , ఎండీ ఈసా పాల్గొన్నారు.

ఛాంబర్స్ కళాశాల ప్రాంగణంలో

ఘనంగా బాలల దినోత్సవం

- బాలలసర్వతోముఖాభివృద్ధి సామాజిక బాధ్యత
- కె.వి.ఆర్ నరసింహారావు



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

ఛాంబర్స్ కళాశాలలో ఘనంగా బాలల దినోత్సవం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ కె.వి.ఆర్ నరసింహారావు విచ్చేసినారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి ముఖ్య అతిథి కె.వి.ఆర్ నరసింహారావు మరియు కళాశాల యాజమాన్య సభ్యులు పూలమాలంకృతం గావించినారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు మాట్లాడుతూ మానవ జీవితంలో బాల్యం అత్యంత విశిష్టతతో కూడినదని, నేటి బాలలు రేపటి ఉత్తమ పౌరులు ఎదగాలంటే వారికి రాజ్యాంగబద్ధంగా లభించిన హక్కులు ఎటువంటి అడ్డంకులు లేకుండా అమలు జరిగేటట్లు చూడాలని, వారి శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికా హారం నాణ్యమైన విద్య, వేధింపులు లేకుండా చూడడం, చెడు వ్యసనాల వైపుకు మరలకుండా చూడడం, వారి స్వేచ్ఛ, శ్రేయస్సుకు వారి అమ్మానాన్నలతో పాటుగా సమాజం, ప్రభుత్వాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ ఎబివిఎస్ మూర్తి గారు మాట్లాడుతూ నెహ్రూ దేశానికి చేసిన పలు సేవ కార్యక్రమాలు అనగా పారిశ్రామిక, అంతర్జాతీయ సంబంధాలు, ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, ఎన్ఐటీలు నిర్మించడం, బహుళార్థక ప్రాజెక్టులు నిర్మాణం లాంటి నెహ్రూ చేసిన పలు సేవలు గురించి కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరం బాలల దినోత్సవాన్ని "మై డే, మై రైట్స్, మై ఫ్యూచర్ అనే అంశాన్ని థీమ్ గా నిర్ణయించడం జరిగింది. బాల్యంలో మంచి ప్రవర్తన నైతికత సాంకేతికత ఆత్మవిశ్వాసం మంచి క్రమశిక్షణ విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవాటు చేయాలని తద్వారా భావి భారత పౌరులుగా దేశం సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు బాలల దినోత్సవం సందర్భంగా తమ భావాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు తదుపరి బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ మెడల్స్ తో కళాశాల యజమాన్యం అభినందించినది.

ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కేవీసీతారామరాజు, అడిషనల్ చైర్మన్ టి. కృష్ణమూర్తి, ట్రెజరర్ ఆర్ ప్రవీణ్ భాను, అకాడమిక్ అడ్వైజర్ ఏబీఎస్ మూర్తి గారు అండ్ సీతారామరావు అధ్యాపకులు ఎన్ రవికుమార్, జానకి రామయ్య, విజయలక్ష్మి, రాధా మాధవి, రాము,రాంబాబు, లింగరాజు, ఆదినారాయణ, డేనియలు తదితరులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ప్రజాభూమి దెందులూరు

దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఈరోజు ఉదయం నిర్వహించిన నిత్య ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను నియోజకవర్గానికి చెందిన పలువురు కూటమి నాయకులు, ప్రజలు మర్యాద పూర్వకంగా కలిశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, గ్రామీణ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేశారు.ప్రజల నుంచి వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు

కూటమి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి ఏలూరు

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, తమ కాళ్లపై తాము నిలబడేలా కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.ఏలూరు వన్‌టౌన్‌లోని శ్రీకృష్ణదేవరాయ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా సాయిబాబా స్వయం సహాయక సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన గో గ్లామ్ ఫ్యామిలీ సెలూన్, బ్యూటీ పార్లర్‌ను ఎమ్మెల్యే బడేటి చంటి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యూటీ పార్లర్ ఏర్పాటుకు సంఘ సభ్యులకు రూ.12 లక్షల రుణం అందించామని, వారు సొంతంగా రూ.5 లక్షలు వెచ్చించి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఇటువంటి వ్యాపారాలను ప్రజలు ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి,కార్పొరేటర్లు మారం అను,చోడే బాలు, మెప్మా పీడీ ఎం. రాజాబాబు,మహాలక్ష్మి, ఝాన్సీ పాల్గొన్నారు.

ఘనంగా 59వ

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



ప్రజాభూమి ప్రతినిధి పెదపాడు

ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం శనివారం శనివారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పంగా వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తకాలు ఆలోచనా శక్తిని,వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షలకు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకోవాలని అన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డివివి ఫణికుమార్, లైబ్రేరియన్ పుప్పాల వీరభద్రరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె, హరిబాబు, కల్చరల్ కోఆర్డినేటర్ పి, సౌభాగ్యలక్ష్మి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంకంపాలెంలో టీడీపీలోకి 23 కుటుంబాలు

- వైసీపీని వీడి పసుపు కండువా కప్పుకున్న నాయకులు, కార్యకర్తలు.
- కూటమి పాలనలో గ్రామాల్లో అభివృద్ధి వేగవంతం పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులదే విజయమంటున్న ఎమ్మెల్యే బండారు



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 23 కుటుంబాలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. సెంట్రల్ డెల్టా వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో వీరంతా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీ నాయకులు, కార్యకర్తలు సైతం కూటమి వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. కూటమికి ప్రజల్లో ఉన్న ఆదరణకు ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. పల్లెలు ప్రగతి పథంలో పయనించాలంటే కూటమి బలపరిచిన అభ్యర్థులను పంచాయతీ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీలతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారంతా రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు సూచించారు.

ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



ప్రజాభూమి ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తుగ నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలూరు మేయర్ రెడ్డి అప్పలనాయుడు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులను అభినందించి, శాలువాలతో సత్కరించారు.గండికోట రాజేష్ బృందం ప్రదర్శించిన స్వాగత నృత్యం ఆకట్టుకుంది. అనంతరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు, కార్పొరేటర్ మోతుకూరి సీతా నాగేశ్వరరావు, కె. సోమ్లా నాయక్, చలసాని వెంకట సురేంద్ర, ఎ.సుబ్బారావు, ఎం.జె. సుజయ్ కృష్ణ, మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గెలిచిన వారు ప్రజల నమ్మకం నిలబెట్టాలి

- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

విజయవాడ తాడిగడప మంత్రివర్యులు క్యాంపు కార్యాలయంలో శనివారం పోలవరం నియోజకవర్గంలో గెలుపొందిన జడ్పీటీసీ, ఎంపీటీసీలు సభ్యులు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు. గెలుపొందిన జడ్పీటీసీ, ఎంపీటీసీలు సభ్యులను ప్రతి ఒక్కరిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గెలుపొందిన అభ్యర్థులు ప్రజలు నమ్మకం నిలబెడుతూ, అందుబాటులో ఉండాలని అన్నారు. గ్రామాలు సమగ్ర అభివృద్ధికి కృషిచేయ్యాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చొరవ చూపాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని సమస్యలు పరిష్కారానికి, మౌళిక వసతులు కల్పనకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం గెలుపొందిన అభ్యర్థులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- సీఐ రామ శేషయ్య

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు టౌన్ బిఆర్ఎంవి హైస్కూల్‌లో పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు మరియు సైకోట్రోపిక్ పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 220 మంది విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, అలాగే పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాలకొల్లు ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ సి.ఐ. ఏం రామశేషయ్య మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక మరియు సామాజిక దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు



వివరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు స్నేహాలు మరియు మాదకద్రవ్యాల వినియోగానికి దారితీసే అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవితం మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని వివరించారు. మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, క్రీడలు, విద్య మరియు సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు.

అలాగే, మాదకద్రవ్యాల విక్రయం, అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రధాన ఉపాధ్యాయురాలు, ఇతర బోధన మరియు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ సర్పంచ్ అభ్యర్థుల రెండో జాబితా విడుదల

ప్రజాభూమి దెందులూరు

నియోజకవర్గంలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచే సర్పంచ్ అభ్యర్థుల రెండో జాబితాను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త కొఠారు అబ్బయ్య చౌదరి ప్రకటించారు. ఈ జాబితాలో మొత్తం 8 గ్రామాల అభ్యర్థులకు ఖరారు చేశారు.పెదపాడు మండలం వాట్లూరులో ఆళ్ళ శివ రామకృష్ణ,వసంతవాడలో సంపంగి శివకుమారి--శ్రవణ్, సత్యవోలులో వైకుంఠపు ధనుంజయ,ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో కోడిచుక్కల నాగశేషు,కోటేశ్వర దుర్గాపురంలో వర్రి నారాయణరావు, కోమటిలంకలో కడిమే అమ్ములు ఆనందరావు, దెందులూరు మండలం సోమవారపాడులో వేమూరి శ్వేత జితేంద్ర, పెదవేగి మండలం భోగాపురంలో మండపాక సునీత--ప్రభాకర్‌లను అభ్యర్థులుగా ప్రకటించారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభ్యర్థులకు అండగా నిలిచి, వారి విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మిగిలిన గ్రామాల అభ్యర్థుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
ఆదివారం 15 నవంబరు 2026

59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం
జవహర్ లాల్ నెహ్రూ జయంతి- బాలల దినోత్సవం

ప్రజాభూమి, పుట్టూరు.

59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా(14-11-2026 నుండి 20-11-2026 వరకు) శనివారం పుట్టూరు శాఖ గ్రంథాలయం నందు జవహర్ లాల్ నెహ్రూ జయంతి (బాలల దినోత్సవం) సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడ మయినది . గ్రంథాలయ వారోత్సవాలు 14 తేదీన గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం , 15 తేదీన పుస్తక ప్రదర్శన , 16 గ్రంథాలయ ఉద్యమ కారుల గురించి ప్రసంగాలు, 17 న కవి సమ్మేళన 18 న పాఠశాల విద్యార్థిని విద్యార్థులు కు డ్రాయింగ్ , క్విజ్ , వ్యాస రచన మొదలగు పోటీల ను నిర్వహించబడును . 19 న మహిళా దినోత్సవం 20 తేదీన వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందని గ్రంథాలయ అధికారి ప్రకాష్ రెడ్డి తెలిపారు . ఈ కార్య క్రమంలో లైబ్రేరియన్ ప్రకాష్ రెడ్డి , పెద్ద నారాయణ రెడ్డి , రాజశేఖర్ , లక్ష్మి రెడ్డి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పి ఓ ఎస్ లకు శిక్షణ కార్యక్రమం

ప్రజాభూమి, పుట్టూరు.

పుట్టూరు మండలంలో జరగబోయే రెండవ సాధారణ గ్రామపంచాయతీఎన్నికలుసర్పంచులు మరియు వార్డు మెంబర్ల ఎన్నికల కు సంబంధించి నేడు మండల కేంద్రంలోని వెలుగు ఆఫీస్ నందు ఉదయం 10 గంటలకు పి ఓ ఎస్ కు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందనీ ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు, సిబ్బందికి అవసరమైన విధివిధానాలు బాధ్యతలు మరియు విధుల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొని శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది.

నార్పల శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం
బాలల దినోత్సవంతో వారోత్సవాలకు శ్రీకారం..
నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు



ప్రజా భూమి నార్పల

నార్పల శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశులు, ఉపాధ్యాయులు రాము పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా గ్రంథాలయాల ప్రాధాన్యత, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం, పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భోజనంలో రాజీ పడొద్దు
-దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి
-కస్తూర్బా బాలికల పాఠశాలలో తనిఖీ



ప్రజాభూమి,
హిందూపురం టౌన్

విద్యార్థులకు భోజన విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడవద్దని అదనపు జిల్లా జడ్జి వి.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన నిత్యవసరాలు, పాలు, తరగతి గదులు తదితర వాటిని తనిఖీ చేశారు. విద్యార్థులకు సంబంధించి ఆహార పదార్థాలను వండేందుకు అవసరమైన నిత్యావసరాలను ఎలా కొనుగోలు చేస్తున్నారు, నీటి సరఫరా, విద్యాభ్యాసం తదితర అంశాలను ప్రిన్సిపాల్ మాధవితో అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం తయారు చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా నిత్యవసరాలను సైతం న్యాయమూర్తి పరిశీలించారు. దీనికి తోడు విద్యార్థులు ఉండే గదుల్లో దోమల బెడద ఉన్నట్లు తెలుసుకున్న న్యాయమూర్తి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల నుండి విద్యార్థినిలు రక్షణ పొందేందుకు కిటికీలకు మెష్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి విద్యార్థులకు సంబంధించి శుచి, రుచికరమైన ఆహార పదార్థాలను తయారుచేసి వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, ఏపీపీ అనంత గోపాలకృష్ణ, న్యాయవాది ఆశ తదితరులు పాల్గొన్నారు.

59వ జాతీయ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు...



యల్లనూరు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ పెద్దలు మరియు పాఠకుల నెహ్రూ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు పలువురు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాలల దినోత్సవం జరుపుకోవడం మన అదృష్ట మని మన దేశ మొట్ట మొదటి ప్రధాని నెహ్రూ ఆయన జయంతి వేడుకలు ఇవాళ జరుపుకోవడం అందులోనూ ఆయనకు చిన్న పిల్లలు అంటే చాలా ఇష్టం కూడా కావడంతో పిల్లల చే గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవడం చాలా మంచిది స్కూల్ పిల్లలందరూ వచ్చి గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం అలవాటు చేసుకుని జ్ఞానం పెంపొందించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది కావున వారోత్సవాలు నవంబర్ 14 నుంచి 20 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది ప్రతి ఒక్క విద్యార్థి ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరుకుంటూ చివరి 20వ తేదీన గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయటం జరుగుతుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియ జేస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జయ రాములు తెలియజేశారు.

విద్యార్థి దశ నిర్ణయాలే భవిష్యత్తుకు పునాది

-లక్ష్యసాధనకు పట్టుదలతో శ్రమించాలి -అదనపు జిల్లా జడ్జి వి. వెంకటేశ్వరరావు





ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థి దశ నిర్ణయాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయని అదనపు జిల్లా జడ్జి వి. వెంకటేశ్వరరావు సూచించారు. మంచి నిర్ణయాలు తీసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. సురక్షిత్ బచ్ పన్ అభియాన్ లో భాగంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థి దశ లో మంచి నిర్ణయాలు తీసుకుని మంచి వ్యక్తులతో స్నేహం చేయడం వల్ల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు ఎంతో ఉన్నత ఆశయంతో పాఠశాలలకు విద్యాభ్యాసం నిమిత్తం పంపిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత ఆశయంతో చదివి నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి విద్యార్థికి లక్ష్యం అవసరమన్నారు. అదే విధంగా 14 సంవత్సరాల లోపు బాలికలకు ఎక్కడైనా వివాహాలు జరుగుతుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. చట్టరీత్యా బాల్య వివాహాలను నిషేధించడం జరిగిందన్నారు. దీనికి తోడు 14 సంవత్సరాల లోపు బాల బాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లోనే ఉంటూ చదువుకోవాలన్నారు. ఎక్కడైనా విద్యార్థుల పట్ల లైంగిక వేధింపులు ఉంటే వెంటనే తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని న్యాయమూర్తి సూచించారు. విద్యార్థి దశలో ఆకర్షణలకు లోను కాకుండా మంచి ఆలోచనలతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. అనంతరం బాలల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. కాగా కస్తూరిబా పాఠశాలకు అవసరమైన మైక్ ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వితరణ చేయనున్నట్లు అధ్యక్షులు సుదర్శన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, ఏపీపీ గోపాలకృష్ణ, న్యాయవాది ఆశ, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, పారా లీగల్ వాలంటీర్లు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం మాత్రమే కాదు ప్రజలకు సాయంలోనూ ముందున్నాం

37వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

మరోసారి ఔదార్యం చాటుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి - ఖాజా నగర్ కి చెందిన రాముకు వీల్ చైర్ అందజేత





ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరంలోని శనివారం కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమం మాత్రమే కాకుండా ప్రజలకు ఆపద సమయంలో సాయం అందించడంలో కూడా ముందున్నామని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన నేడు 37వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 7 మంది లబ్ధిదారులకు 10 లక్షల 55 వేల 863 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారని అన్నారు. ఆపద సమయంలో ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్సలు పొందిన పేదలను సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నారన్నారు. తాజాగా 37వ విడతతో కలిపి ఇప్పటివరకు మొత్తం 759 మందికి 7,51 కోట్ల రూపాయల సహాయం అందించినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో కోటి రూపాయలు కూడా అందించలేదన్నారు. ఓవైపు ప్రజల ఆరోగ్యంతో పాటు సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నారన్నారు. గత ఐదేళ్లలో జగన్ రెడ్డి 10 లక్షల కోట్లు అప్పులు పెట్టి పోతే.. కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు అందిస్తున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ చొరవతో 20లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. పుట్టపర్తి వంటి ప్రాంతానికి యుద్ధ విమానాలు తయారు చేసే పరిశ్రమ వచ్చిందన్నారు. ప్రస్తుతం సీఐఐ సదస్సులో పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వలనే జరుగుతున్నాయని.. రానున్న రోజుల్లో ఏపీని దేశంలోనే నెంబర్-1 స్థానంలో నిలుపుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. రాము కుటుంబ సభ్యులు శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ని కలిసి రాము ఆరోగ్య పరిస్థితిని వివరించి, వీల్ చైర్ అందించాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రాముకు వీల్ చైర్‌ను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని పరిస్థితిలో ఉన్న రాముకు వీల్ చైర్ అందించడం ద్వారా ఆయనకు కొంత ఉపశమనం కల్పించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలున్తూ, తమ దృష్టికి వచ్చిన నమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కి రాము కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని సర్పంచ్ స్థానాల్లో టిడిపి మద్దతు ధరలు గెలవాలి

- **ఎంపీటీసీల గెలుపు స్ఫూర్తితో ముందుకు సాగాలి**
- **ఎమ్మెల్యే బాలకృష్ణకు మరోమారువిజయ కానుకగా ఇద్దాం..**
- **అభినందన సభలో టీడీపీ నాయకుల పిలుపు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయాలతో రూరల్ మండలంలో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. జడ్పీటీసీ స్థానంతో పాటు 15 ఎంపీటీసీ స్థానాలకు గాను 14 స్థానాలను కైవసం చేసుకోవడంతో ఇదే విజయ పరంపరను రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పార్టీ నాయకులు నిర్ణయించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయాన్ని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు మరోమారు కానుకగా అందించాలని ఆకాంక్షించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద శనివారం స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన రూరల్ మండల జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు అభినందన, సన్మాన సభ నిర్వహించారు. ఈ నందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తల సేవలను కొనియాడారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, రూరల్ మండలం తెలుగుదేశం పార్టీకి ఎప్పటి నుంచో ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందన్నారు. ఎన్నికలు ఏవైనా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల పరిధిలోని ఒక జడ్పీటీసీ, 15 ఎంపీటీసీ స్థానాలకు గాను 14 స్థానాలను గెలుచుకోవడం పార్టీ శ్రేణుల ఐక్యతకు నిదర్శనమన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని బాధ్యతగా తీసుకుని నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల నమయంలో పార్టీ కోనం వనిచేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తను కలుపుకొని ముందుకు సాగాలని తెలిపారు. వ్యక్తిగత అభిప్రాయాలు, విభేదాలకు తావివ్వకుండా పార్టీ ప్రయోజనాలే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే స్ఫూర్తిని రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సాధించిన ఫలితాలతో సరిపెట్టుకోకుండా సర్పంచ్ ఎన్నికల్లోనూ అన్ని స్థానాల్లో విజయం సాధించే దిశగా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ ప్రజలతో మమేకం కావాలని నూచించారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఉంటే ఎన్నికల్లో సమష్టి కృషికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హిందూపురం నియోజకవర్గంలో రూరల్ మండలం రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన ఫలితాలు ఆ విషయాన్ని మరోసారి చాటిచెప్పాయని నాయకులు అన్నారు. ఇదే ఐక్యత, క్రమశిక్షణ, సమష్టి పోరాటంతో రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ అన్ని సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు మరోమారు విజయ కానుకగా అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, రూరల్ మండల అధ్యక్షులు హెచ్.ఎన్. రాము, మార్కెట్ యార్డు చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, నూతన జడ్పీటీసీ సభ్యురాలు భాగ్యలక్ష్మి అరుణాచలరెడ్డి, ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షులు శంకరప్ప, ఎంపీటీసీ పూలకుంట మంజునాథ్, నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు, రూరల్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవి కంటే బాధ్యతే ముఖ్యం.. ప్రజల చెంతకు స్వాతిలత, ప్రసన్న కుమారి!

ప్రతి గడపకు ఆత్మీయ పలకరింపు.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందడుగు



ప్రజా భూమి -- నార్పల

నార్పల మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీపీ అభ్యర్థి స్వాతిలతా రెడ్డి ప్రజలతో మమేకమవుతూ ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె సోదరి, నార్పల 4వ ఎంపీటీసీ ప్రసన్న కుమారి కూడా భాగస్వామిగా ఉంటూ ప్రజలకు ఆత్మీయ పలకరింపులు అందిస్తున్నారు. అధికారం సంపాదించడం కంటే ప్రజల నమ్మకాన్ని పొందడం, వారికి బాధ్యతగా సేవ చేయడమే ముఖ్యమనే భావనతో స్వాతిలతా రెడ్డి ముందుకు సాగుతున్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, చిరునవ్వుతో వారి యోగక్షేమాలను తెలుసుకుంటున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా వింటూ, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇస్తున్నారు. సోదరీమణులైన స్వాతిలతా రెడ్డి, ప్రసన్న కుమారి కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమవుతూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతున్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా భవిష్యత్తులోనూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని, నార్పల మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని హామీ ఇస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ సాగుతున్న ఈ ఆత్మీయ పలకరింపులు ప్రజల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
ఆదివారం 15 నవంబరు 2026

మహోన్నత వ్యక్తి జవహర్ లాల్ నెహ్రూ

పండిత నెహ్రూ సేవలు మరువలేనివి. ఏఐఎఫ్ఇటిఓ జాతీయకార్యదర్శి పి.రమణారెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల :
భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆధునిక భారతదేశ నిర్మాణానికి పునాదులు వేసిన మహానేత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్ఇటిఓ) జాతీయకార్యదర్శి పి.రమణారెడ్డి,ఎస్టీయు రాష్ట్ర కమిటీ కన్వీనర్ వాకా చంద్రశేఖర్ పేర్కొన్నారు. బాలల దినోత్సవం మరియు నెహ్రూ జయంతి సందర్భంగా పోరుమామిళ్లలోని ఎస్టీయు భవన్ నందు రీజనల్ కన్వీనర్ వి.వి.క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమణారెడ్డి,చంద్రశేఖర్ తదితర ఎస్టీయు నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్య సమరయోధునిగా దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో విశేష కృషి చేయడంతో పాటు,మొదటి ప్రధానమంత్రిగా దేశ అభివృద్ధితో పాటు విద్య,విజ్ఞానశాస్త్రం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు.ముఖ్యంగా చిన్నారులంటే ఆయనకు ఎంతో ప్రేమాభిమానాలు ఉండేవని, అందుకే ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని నమ్మిన నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. శాస్త్రీయ దృక్పథం,ప్రజాస్వామ్య విలువలు,లౌకిక భావాలు, సమానత్వ స్ఫూర్తిని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ ఓ.చంద్రహాసరెడ్డి,రీజనల్ కో కన్వీనర్ ఆర్ రమణ ఆఫీస్ ఇంచార్జి కస్తూరి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు బి.బాలరాజు, బి.సుబ్బారెడ్డి, వి.జనార్దన్ శెట్టి, బి శ్రీనివాసులు, ఎం.నారాయణరెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు ఆర్.గురయ్య, జి.శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, మండల శాఖల ప్రధాన బాధ్యులు వి.వి.నారాయణ, జయరామిరెడ్డి,అబ్దుల్ హుస్సేన్, ప్రదీప్, నాగ సుబ్బారెడ్డి, ఎస్.శ్రీనివాసులు, ఆనంద్,డి.ఎల్.చంద్రశేఖర్, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకు సగం ధరకే సన్న బియ్యం

మార్కెట్ యార్డులో క్యూ కట్టిన జనం - ప్రభుత్వానికే పేదల సంక్షేమం పెద్దపీట - బీటెక్ రవి

ప్రజాభూమి,పులివెందుల
పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, పేద ప్రజలకు సగం ధరకే సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్ణయించిందని పులివెందుల తెలుగుదేశం నియోజకవర్గ బాధ్యులు బీటెక్ రవి అన్నారు.శనివారం పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న మార్కెట్ యార్డులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఉప జిల్లా అధికారి చిన్నయ్య , అమలు విభాగ ఉప తహసీల్దార్ సుధీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పులివెందుల తెలుగుదేశం నియోజకవర్గ బాధ్యులు బీటెక్ రవి , పులివెందుల మార్కెట్ యార్డు అధ్యక్షులు గడ్డం అమర్నాథ్, లింగాల మండల తెలుగుదేశం అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి పాల్గొని రిబ్బన్ కట్ చేసి పేద ప్రజలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బీటెక్ రవి గారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా బహిరంగ మార్కెట్ లో సుమారు రెండు వేల ఐదు వందల రూపాయల వరకు పెరిగిన ఇరవై ఆరు కిలోల సన్న బియ్యం



మూటను, కూటమి ప్రభుత్వం సగం ధరకే అంటే కేవలం వెయ్యి రెండు వందల డెబ్భై నాలుగు రూపాయలకే అందిస్తోందని తెలిపారు.పులివెందుల మార్కెట్ యార్డుతో పాటు వేంపల్లెలో కూడా ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆధార్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ నెలకు ఒక మూట చొప్పున తీసుకువెళ్ళవచ్చన్నారు.ఒకవేళ ప్రస్తుతం బియ్యం నిల్వ తక్కువగా ఉండి రద్దీ ఎక్కువగా ఉంటే క్యూలలో నిలబడి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పేర్లు నమోదు చేసుకుంటే మరుసటి రోజుల్లో అదనపు నిల్వ తెప్పించి అందరికీ నెలవారీ కోటా అందేలా స్థానిక ఉప జిల్లా అధికారి, ప్రభుత్వం



బాధ్యత తీసుకుంటా యని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు.మార్కెట్ లో బియ్యం ధరలు తిరిగి సాధారణ స్థితికి వచ్చే వరకు ఈ పథకం కొనసాగుతుందని, ఆర్థికంగా స్తోమత ఉన్న ధనవంతులు రాకుండా కేవలం నిరుపేద, మధ్యతరగతి ప్రజలు మాత్రమే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఎల్ నినో ప్రభావం దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న ముందస్తు చర్యలను పొరుగు రాష్ట్రంలోని ప్రతివక్ష నేతలు సైతం ప్రశంసిస్తున్నారని ఆయన తెలిపారు. శ్రీశైలం, అవుకు, గండికోట, చిత్రావతి మరియు పైడిపాలెం జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు ఉన్నందున, పులివెందుల ప్రాంతంలో తాగునీటికి గానీ, సాగునీటికి గానీ ఎలాంటి కొరత రాకుండా చూసుకుంటామని బీటెక్ రవి స్పష్టం చేశారు.

డిసెంబరు 6న కడపలో భగవద్గీత కంఠస్థ పోటీలు



ప్రజాభూమి పోరుమామిళ్ల :
తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకుని టిటిడి జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ టి. గోపి బాబు కడపలో డిసెంబర్ 6వ తేదీ ఆదివారం నాడు నిర్వహించే గీతా శ్లోకాల పోటీలలో కడప జిల్లా వాసులందరూ పాల్గొనవచ్చని కడప జిల్లా టీటీడీ హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు తుపాకుల శ్రీనివాసులు తెలిపారు. పోరుమామిళ్లలో విలేకరులతో మాట్లాడుతూ కడప నగరంలోని శంకరాపురం టిటిడి కళ్యాణ మండపం నందు ఆరవ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి మూడు విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. మొదటి విభాగంలో 6 ,7, 8, 9 తరగతుల విద్యార్థులకు భగవద్గీత ఆరవ అధ్యాయం ఆత్మ సంయమ యోగం నందు, రెండవ విభాగంలో టెన్త్ ,ఇంటర్ విద్యార్థులకు చివరిదైన 18వఅధ్యాయం మోక్ష సన్యాస యోగం నందు, మూడవ విభాగంలో 18 నుండి 45 సం”ల మధ్య వయస్సుగల వారు” నిత్య జీవితంలో భగవద్గీత”భావ విశ్లేషణ చేయాల్సి ఉంటుందన్నారు ప్రతి విభాగమునకు ప్రథమ, ద్వితీయ ,తృతీయ బహుమతులుగా 1116రూ, 816రూ, 516రూ”లతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు కనుక కడప జిల్లాలోని వివిధ యాజమాన్యాలు, సంస్థలు, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ,విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని వారు తెలిపారు. ఇతర వివరములకు 9110779066 లేక 9652104655 నంబర్లను సంప్రదించాలన్నారు.

మధుమేహంపై ముందస్తు చర్యలు

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా డీ.ఎం.హెచ్.ఓ. కార్యాలయ సిబ్బందికి మధుమేహ పరీక్షలు

డీఎంహెచ్ఓ డాక్టర్ పి యుగంధర్

ప్రజా భూమి, కడప సిటీ :
నవంబర్ 14 ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ కడపజిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో శనివారం ప్రత్యేక మధుమే హ స్క్రీనింగ్ కార్యక్రమం ని ర్వహించారు.జిల్లా వైద్య ఆ రోగ్యశాఖ అధికారి డా. పి. యుగంధర్ ఆధ్వర్యంలో కా ర్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించారు.ఈ ఏడాది ప్రపంచ మధుమేహ దినోత్సవ సందేశమైన మధ మేహంపై ముందస్తు చర్య లు అనే స్ఫూర్తితో ఈ కార్య క్రమాన్ని చేపట్టారు. ఆరోగ్య సిబ్బంది నుంచి ప్రారంభించి ప్రజలందరిలో మధుమేహ నివారణ,ముందస్తు గుర్తిం పు, సకాలంలో చికిత్స, ని యంత్రణపై అవగాహన పెంపే పొందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా డా. పి. యుగంధర్ మాట్లా డుతూ,మధుమేహాన్ని ప్రార భ దశలోనే గుర్తించడం ఎం తో అవసరమని అన్నారు. క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించ కోవడం, సమతుల ఆహారం తీసుకోవడం,నిత్యం వ్యా యామం చేయడం, వైద్యుల సూచనలు పాటించడం ద్వా రా మధుమేహాన్ని సమర్థవ శేతంగా నియంత్రించవచ్చని తెలిపారు.మధుమేహం ఉన వారు క్రమం తప్పకుండా చి కిత్స పొందుతూ కంటి,మూ త్రపిండాలు,గుండె సంబంధి త సమస్యల పట్ల అప్రమ త్తంగా ఉండాలని సూచించ రు.ఈకార్యక్రమములో కమ్ యునిటీ హెల్త్ ఆఫీసర్లు బిందు,చంద్రకళ,ఆశా కార్య కర్త రమణమ్మ కార్యాలయ సిబ్బందికి మధుమేహ స్క్రీ నింగ్ పరీక్షలు నిర్వహించా రు.ఈ కార్యక్రమంలో ఎన్ సి డీ/ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అ ధికారి డా. అరిఫుల్లా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ప్రవీణ్ కుమార్, డీపీఎంఓ డా.మొహమ్మద్ తాహా,కా ర్యాలయ పరిపాలన అధికా రి ఇతర సిబ్బంది పాల్గొన్నా రు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు

- మెగా జాబ్ డ్రైవ్‌లో 12 మంది విద్యార్థుల ఎంపిక
- ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ



ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 12న కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలోనిర్వహించిన మెగా జాబ్ డ్రైవ్‌లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉషశ్రీ తెలిపారు. హ్యుందాయ్ మోబిస్ కంపెనీకి నలుగురు, ఇసుజు కంపెనీకి ఆరుగురు, మొబైల్ తయారీ కంపెనీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉషశ్రీ, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ సయ్యద్ మసూద్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానాభివృద్ధి - జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ప్రజాభూమి,పులివెందుల
పులివెందులలోని ఆహార సాంకేతిక కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం శనివారం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం మాధవ , ఇతర అధ్యాపకులు, విద్యార్థులు గ్రంథాలయ పితామహుడు ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పుష్ప నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం మాధవ అధ్యక్షతన జరిగింది. కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ విమల బీరా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం మాధవ మాట్లాడుతూ పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడం, గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలియజేయడం మరియు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల జీవితంలో గ్రంథాలయానికి ఎంతో ముఖ్యమైన స్థానం ఉందని, తరగతి గదిలో ఉపాధ్యాయులు మనకు పాఠ్యాంశాలను బోధిస్తే, గ్రంథాలయం మనకు అదనపు జ్ఞానాన్ని, కొత్త విషయాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు.కార్యక్రమంలో గ్రంథాలయం యొక్క ప్రాముఖ్యత గురించి గ్రంథాలయ అధికారి డాక్టర్ విమల బీరా వివరించారు. కళాశాలలో వారం రోజులు పాటు జరిగే ఈ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాల గురించి ఇంజినీర్ సజ్మా వివరించారు. గ్రంథాలయం విశిష్టత గురించి గ్రంథాలయ సిబ్బంది కవిత మరియు అధ్యాపకులు డాక్టర్ సాయి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా డాక్టర్ జయమ్మ గారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పజీబ్ అనే కళాశాల విద్యార్థి గ్రంథాలయం యొక్క ప్రాముఖ్యత గురించి మాట్లాడాడు.ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం మాధవ గారు, కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ విమల బీరా గారు, అధ్యాపకులు డాక్టర్ అరుణ గారు, డాక్టర్ జయమ్మ , ఇంజినీర్ సజ్మా గారు, డాక్టర్ సాయి శ్రీనివాస్ గారు, డాక్టర్ జాకీర్ భాషా , కె సుబ్బారెడ్డి, గ్రంథాలయ సిబ్బంది కవిత గారు, సుధారాణి గారు, శారీరక విద్య అధికారి డాక్టర్ రాజశేఖర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకనంద ఆశ్రమంలో అల్పాహారం పండ్లు పంపిణీ



ప్రజాభూమి పోరుమామిళ్ల :
పోరుమామిళ్ల మండలం రంగనముద్రం పంచాయతీ మహబూబ్ నగర్ కాలనీకి చెందిన పల్లంశెట్టి పందరి, అరుణ ద్వితీయ పుత్రిక లక్ష్మీ దీపిక ద్వితీయ వర్ధంతి



సందర్భంగా కాశినాయన మండలం ఓబులాపురం ఏటి ఒడ్డున ఉన్న పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, రామతులసమ్మ దంపతులు నిర్వహిస్తున్న వివేకానంద సేవాశ్రమం నందు అనాధ వృద్ధులకు, వికలాంగులకు టిఫిన్ అల్పాహారం, పండ్లు పంచిపెట్టి వారి నుంచి స్వర్గ లోకంలో ఉన్న లక్ష్మీ దీపిక ఆత్మకు శాంతి చేకూరాలని దైవ ప్రార్థన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేలటూరి జయరాం రెడ్డి, కొరివి పోల్ రెడ్డి, డిస్కో రాజా, వంకదారి జయరాం, నాగేంద్ర, రమణాచారి, శ్రీనివాసులు రెడ్డి, నగిరి రమణయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

22 ఏళ్లకే సర్పంచ్ బరిలో.. ఏపీ రాజకీయాల్లోనే యువ సంచలనం!



ప్రజాభూమి పోరుమామిళ్ల :
రాష్ట్ర రాజకీయాల్లో యువతరం సరికొత్త చరిత్రకు శ్రీకారం చుడుతోంది. కడప జిల్లా పోరుమామిళ్ల మండలం, టేకూరుపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కేవలం 22 ఏళ్ల యువకురాలు నగిరి శివసాహితీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.చిన్న వయసులోనే ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో వస్తున్న ఆమెకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) పూర్తి మద్దతు ప్రకటించింది. శివసాహితీ తండ్రి భైరవ ప్రసాద్ ప్రస్తుతం పోరుమామిళ్ల టీడీపీ మండల అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ, ఉన్నత చదువులతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంపై అవగాహన ఉన్న శివసాహితీ పోటీ చేయడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. సోమవారం స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలతో కలిసి ఆమె తన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిస్తున్న వేళ, 22 ఏళ్ల యువతి సర్పంచ్ పదవికి పోటీ పడటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

శ్రీ మానసా దేవిని దర్శించుకున్న కడప మేయర్ అభ్యర్థి సువర్ణ



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని కనుమలోపల్లి శివారులో వెలసిన శ్రీ మానసా దేవి ఆలయంలో జరుగుతున్న వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం కడప మేయర్ అభ్యర్థి సువర్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు లక్ష్మయ్య ఆమెకు ఘన స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించారు. వార్షికోత్సవాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన పూజలు నిర్వహించడం ఆనందంగా ఉందని సువర్ణ పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లక్ష్మయ్యతో పాటు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాభూమి పోరుమామిళ్ల :
కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో “బాలల దినోత్సవం” ఘనంగా నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా కరస్పాండెంట్ ఆర్. వి. రామ కృష్ణ మన దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటామని వ్యాఖ్యానించారు. అలాగే నెహ్రూజీకి పిల్లలంటే చాలా ప్రాణం. పిల్లలే దేశ భవిష్యత్తు అని ఆయన గట్టిగా నమ్మేవారు. అందుకే ఆయన పుట్టినరోజును పిల్లల పండుగగా ప్రకటించారు. పిల్లలందరూ మంచి విద్యను అభ్యసించాలని, ఆరోగ్యంగా, సంతోషంగా ఎదగాలని ఆయన ఆశించారు. బాలల దినోత్సవం అంటే కేవలం ఆటలు, చాక్లెట్లు మాత్రమే కాదు, ప్రతి బిడ్డకు చదువుకునే హక్కు, మంచి బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేసారు. ఈ సందర్భంగా పాఠశాలలో వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల చేత నృత్యాలు, పాటలు,వివిధ వేషధారణలు మరియు నాటికల ద్వారా పిల్లలను ఆనందింప చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులు అందరూ పాల్గొని ఘనంగా నిర్వహించడం జరిగింది.

కార్తీక మహోత్సవాలకు నిత్యపూజ కోన రహదారి మరమ్మతులు



ప్రజాభూమి, సిద్ధవటం: కార్తీక మహోత్సవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిత్యపూజ కోనకు వెళ్లే రహదారి మరమ్మతు వనులను వేగవంతం చేశారు. మండలంలోని పంతాటివల్లి గ్రామ పరిధిలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి శనివారం పనులు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ జంగిటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా నిత్యపూజ కోన, మూతిరాయి కోన, తాండ్రమాను చెట్టు, పులిగోర్లు, పంచలింగాల గుడి సమీపంలోని సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారి దెబ్బతిన్నదన్నారు. కార్తీక మహోత్సవాల సందర్భంగా భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులను ప్రాధాన్యతతో చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ సన్నిధిలో భక్తులకు మెరుగైన వసతులు, మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 8
ఆదివారం 15 నవంబరు 2026

తొండవాడ సర్పంచ్ కూటమి

అభ్యర్థిగా పులికంటి మోహన్ రెడ్డి ఖరారు:!



ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:
చంద్రగిరి మండలం వరిధిలోని కీలకమైన తొండవాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి శ్రేణులు, గ్రామస్తులు సర్వసన్నద్ధమయ్యారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థిగా తొండవాడ మాజీ సర్పంచ్ తపసి సత్యనారాయణ రెడ్డి అల్లుడు పులికంటి మోహన్ రెడ్డి పేరును ఏకగ్రీవంగా ఖరారు చేసినట్లు స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు అధికారికంగా వెల్లడించారు.

-కష్టపడిన కుటుంబాలకే ఎమ్మెల్యే పులివర్తి నాని పెద్దపీట:
గతంలో తొండవాడ సర్పంచ్‌గా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ నిస్వార్థ ప్రజాసేవ అందించిన తపసి సత్యనారాయణ రెడ్డికి గ్రామంలోని బడుగు, బలహీన వర్గాలలో నేటికీ చెక్కుచెదరని ఆదరణ, అభిమానం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్బంధాలు, అనేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ.. తొండవాడ సీనియర్ నాయకులు కుమార్ రాజా రెడ్డి, గిరిధర్ రెడ్డి గ్రామస్తులను కలుపుకుని సత్యనారాయణ రెడ్డి సతీమణి మల్లీశ్వరిని సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దించి గట్టి పోటీ ఇచ్చారని, ఆ ఎన్నికల్లో ఆమె కేవలం స్వల్ప తేడాతో మాత్రమే పరాజయం పొందారని స్థానిక వర్గాలు గుర్తుచేసుకున్నాయి. నాటి ప్రతికూల పరిస్థితుల్లో పార్టీ జెండా మోసి, ఎన్నికల్లో కష్టపడిన కుటుంబాలకే ఈసారి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సీనియర్ నేత కుమార్ రాజా రెడ్డికి స్పష్టం చేసినట్లు తెలిపారు.

ఐకమత్యమే మన బలం -- కుమార్ రాజా రెడ్డి పిలుపు:
ఈ సందర్భంగాటీడీపీ సీనియర్ నాయకులు కుమార్‌రాజా రెడ్డి మాట్లాడుతూ.. "పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే పులివర్తి నాని ఏ నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి. ఎన్నికల వేళ ఎన్ని అవాంతరాలు ఎదురైనా అందరినీ సమన్వయం చేసుకుంటూ, చిన్నచిన్న అభిప్రాయభేదాలను పక్కనపెట్టి ఒకరికొకరు రాజీపడి ఐకమత్యంతో పులికంటి మోహన్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలి. ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో మనమంతా ఒకే తాటిపై నిలిచి కష్టపడటం వల్లే అత్యధిక మెజారిటీతో విజయం సాధించగలిగాం. ఐకమత్యంతో ఉంటే ఏదైనా సాధించవచ్చు" అని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

గ్రామస్తుల రుణం తీర్చుకుంటా -- పులికంటి మోహన్ రెడ్డి:
సర్పంచ్ అభ్యర్థిగా ఎంపికైన పులికంటి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. "చిన్నప్పటి నుంచీ నాకు మంచిచెడులు నేర్పించి, సమాజంలో ఒక బాధ్యతాయుతమైన వ్యక్తిగా తీర్చిదిద్దింది ఈ తొండవాడ గ్రామ పెద్దలు, స్థానికులే. ఇప్పుడు ఆత్మీయులైన మీ అందరికీ సేవ చేసుకునే గొప్ప భాగ్యాన్ని కల్పించినందుకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గారికి, తొండవాడ గ్రామ పెద్దలకు, కూటమి నాయకులకు, గ్రామస్తులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. అందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను" అని పేర్కొన్నారు.ఈ సమావేశంలో తొండవాడ గ్రామ పెద్దలు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్



పట్టణంలోని భాస్కర్‌పేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, స్కౌటింగ్ వ్యవస్థాపకుడు లార్డ్ బాడెన్ పావెల్ చిత్రపటాలకు రోవర్ స్కౌట్ లీడర్, స్కౌట్ మాస్టర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో వేర్వేరుగా ఉన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థగా రూపుదిద్దుకోవడంలో నెహ్రూ చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోవర్ స్కౌట్ లీడర్ టి. రమేష్ బాబు, స్కౌట్ మాస్టర్లు జి. విజయ్ కుమార్, షేక్ అజారుద్దీన్, పాఠశాల స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఘనంగా కిచెన్ గార్డెన్ ఫెస్టివల్

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి: స్థానిక కసా గార్డెన్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాధవీలత మాట్లాడుతూ ఐదు సెంట్ల స్థలంలో ఐదు రోజుల ముందుగానే భూమిని సిద్ధం చేసి వివిధ రకాల విత్తనాలు నాటినట్లు తెలిపారు. ప్రతిరోజూ విద్యార్థులు మొక్కలకు నీరు పోస్తూ వాటి సంరక్షణ చేపట్టారని వివరించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఆవరణలో పెంచిన ఆకుకూరల మొక్కలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వివేకానందా స్కూల్ కరెస్పాండంట్ జితేంద్ర, జిల్లా అధికారులు రాజు, సాండిల్ కుమార్, ప్రీతి తదితరులు హాజరై విద్యార్థుల కృషిని అభినందించారు. విద్యార్థుల్లో మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ కూరగాయల సాగుపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



శ్రీకాళహస్తిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా,పారదర్శకంగా,

ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్
రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన అభినయ్ రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.శ్రీకాళహస్తిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు ఇటీవల జరిగిన జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల సమయంలో టీడీపీ శ్రేణులు మహిళల చీరలు లాగడం,నామినేషన్లకు వచ్చిన వారిపై దాడులు చేసి తలలు పగలగొట్టడం, కార్లు ధ్వంసం చేయడం, బైకులు కాల్చడం,నామినేషన్ పత్రాలను చించివేసి హింసాత్మక ఘటనలపై ఫిర్యాదు చేశారు. అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నప్పటికీ, స్ర్కూటినీ పేరుతో పత్రాలను చించివేసి అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించడాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్లు వేసేందుకు తగిన భద్రత కల్పించాలని కోరారు. జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్‌లో టీడీపీకి అనుకూలంగా బ్యాలెట్ కట్టలను రిపీట్ చేసి గెలిచినట్లు ప్రకటించడంపై ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశించినప్పటికీ ఆర్డీవో రీకౌంటింగ్ నిర్వహించకపోవడాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. కౌంటింగ్ సమయంలో విద్యుత్ అంతరాయం, జనరేటర్ ఉన్నప్పటికీ ఆన్ చేయకపోవడం, బ్యాలెట్ పత్రాలను కిటికీలో నుంచి బయటకు పడేయడం వంటి ఘటనలను వివరించారు. రాబోయే శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించాలని, అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని ఎన్నికల కమిషనర్‌ను కోరారు. శ్రీకాళహస్తి 44 వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసేలా భద్రత కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన అభినయ్ రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ,రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇటీవల జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సమయంలో టీడీపీ శ్రేణులు మహిళల చీరలు లాగడం, నామినేషన్లకు వచ్చిన వారిపై దాడులు చేసి తలలు పగలగొట్టడం, నామినేషన్ పత్రాలను చించివేయడంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కి ఫిర్యాదు చేశామన్నారు. అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నప్పటికీ, స్ర్కూటినీ పేరుతో పత్రాలను చించివేసి అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించడాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్లు వేసేందుకు తగిన భద్రత కల్పించాలని కోరారు. జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ సమయంలో విద్యుత్ అంతరాయం, జనరేటర్ ఉన్నప్పటికీ ఆన్ చేయకపోవడం, బ్యాలెట్ పత్రాలను కిటికీలో నుంచి బయటకు పడేయడం వంటి ఘటనలను వివరించారు.రాబోయే శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించాలని, అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని ఎన్నికల కమిషనర్‌ను కోరారు.శ్రీకాళహస్తి 44 వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసేలా భద్రత కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. టీడీపీకి స్థానికంగా నాయకులు, కార్యకర్తల బలం లేదని, అందుకే బయటి ప్రాంతాల నుండి రౌడీలను కిరాయికి తీసుకొచ్చి అరాచకాలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.టీడీపీకి స్థానికంగా నాయకులు, కార్యకర్తల బలం లేదని, అందుకే బయటి ప్రాంతాల నుండి రౌడీలను కిరాయికి తీసుకొచ్చి అరాచకాలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో తొట్టంబేడు, రేణిగుంట మండలాల్లో తాము 1,400 ఓట్ల మెజారిటీతో గెలిచినప్పటికీ, కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని అన్నారు. టీడీపీ ఓట్ల ఉన్న కొట్టలనే రెండోసారి తీసుకొచ్చి లెక్కించి అక్రమంగా గెలిపించుకున్నారని ఆరోపించారు. శ్రీకాళహస్తి చరిత్రలో ఎప్పుడు లేని విధంగా తెలుగుదేశం పార్టీ తరఫున మున్సిపల్ కౌన్సిలర్లు అభ్యర్థుల నుండి రూ. 20 లక్షల వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అక్రమాలతో గెలిచినట్లు సంబరాలు చేసుకోవడం సరికాదని,దమ్ముంటే మున్సిపాలిటీ ఎన్నికల్లో ధర్మంగా పోటీ చేసి ప్రజాతీర్పును కోరాలని ఆయన టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు.

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు

నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లలో సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు

అవసరమైతే అదనపు పోలీసు బలగాల తరలింపు : రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,
రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపడుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. శనివారం తిరుపతిలో జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, ఐజీపీ రాజకుమారి, ఎన్నికల పరిశీలకులు ఎం. వరప్రసాద్ తదితర అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష అనంతరం మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు గత నాలుగు నుంచి ఐదు నెలలుగా ప్రణాళికాబద్ధంగా సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్, మున్సిపల్ పరిపాలన శాఖల ఉన్నతాధికారులు, కార్యదర్శులు, కమిషనర్లు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, జెడ్పి సీఈవోలు, డీపీవోలతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. ఓటర్ల జాబితాలను వార్డుల వారీగా ఖరారు చేసి సంబంధిత అధికారులకు అందజేశామని, పోలింగ్ కేంద్రాలను గుర్తించడంతో పాటు సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాలను కూడా ముందుగానే గుర్తించినట్లు తెలిపారు. పోలింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది నియామకాలను సైతం పూర్తి చేసినట్లు వెల్లడించారు. తొలి విడతలో 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 1వ తేదీన ఎన్నికలు నిర్వహించి, నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించినట్లు తెలిపారు. ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో డిప్యూటీ మేయర్, డిప్యూటీ చైర్మన్ ఎన్నికల ప్రక్రియను నవంబర్ 23వ తేదీకి ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించి, నవంబర్ 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించినట్లు తెలిపారు. ఎంపీపీ ఎన్నికలు నవంబర్ 19న, జడ్పీ చైర్మన్ ఎన్నికలు నవంబర్ 20న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొదటి విడతలో ఎన్నికలు పూర్తయిన 100 పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాల ఏర్పాటు నవంబర్ 23న జరగనుందని, ఆ రోజున ప్రమాణ స్వీకారం చేసిన తేదీ నుంచి ఐదేళ్ల పదవీకాలం ప్రారంభమవుతుందని వివరించారు. మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి నవంబర్ 12న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. వీటిలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామని కమిషనర్ తెలిపారు. మొదటి విడత ఎన్నికలకు నవంబర్ 13న నోటిఫికేషన్ విడుదల చేశామని, రెండో విడత నోటిఫికేషన్ నవంబర్ 16న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో శాంతిభద్రతలకు సంబంధించి సమస్యలు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా పోలీసు భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. తిరుపతిలో అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్) మధుసూదన్ రెడ్డి, ఐజీపీ రాజకుమారి, డీఐజీలు, జిల్లా ఎస్పీలతో సమావేశమై ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించినట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ శాతం 63 శాతం కాగా ప్రస్తుతం నిర్వహించిన ఎన్నికల్లో 62 శాతం పోలింగ్ నమోదు అయిందని, అలాగే ఎం పి టి సి/జెడ్ పి టి సి ఎన్నికల పోలింగ్ శాతం గతంలో 60 శాతం కాగా ప్రస్తుతం 70 శాతం పోలింగ్ నమోదు అయిందని వెల్లడించారు. 12 జిల్లాల్లో ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు యంత్రాంగాన్ని సమన్వయంతో పనిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అభ్యర్థులు, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తగిన భద్రత కల్పిస్తామని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి తిరుపతి జిల్లాలో అవసరమైన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీకాళహస్తిలో రెండు కేంద్రాలతో పాటు మున్సిపల్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా కలెక్టర్, సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించవచ్చని సూచించారు. అవసరాన్ని బట్టి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం నుంచి అదనపు పోలీసు బలగాలను పంపించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రతి నామినేషన్ కేంద్రం, పోలింగ్ స్టేషన్, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు వీడియోగ్రఫీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించి అందే ఫిర్యాదులు, పిటిషన్లను ఎప్పటికప్పుడు పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయడమైనదని, ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఓటర్లను కోరారు.

ప్రపంచ మధుమేహ దినోత్సవం పై అవగాహన

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.
పురస్కరించుకుని రేణిగుంట మండల వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు రేణిగుంట లోని వేణుగోపాల పురం ప్రాంత ప్రజలకు మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కామరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14వ తేదీన ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని నిర్వహిస్తారని, మధుమేహ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, నివారణ చర్యలు చేపట్టడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మధుమేహంపై అవగాహనతోనే ఆరోగ్యకరమైన జీవితం" మధుమేహాన్ని ముందుగానే గుర్తించి నియంత్రించుకోవాలని,మధుమేహం అనేది రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా లేదా తక్కువగా ఉండే దీర్ఘకాలిక వ్యాధి అని,అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, కుటుంబంలో మధుమేహ చరిత్ర వంటి అంశాల కారణంగా వ్యాధి ముప్పును పెంచుతాయని వివరించారు. మధుమేహ లక్షణాలైన తరచుగా దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్ర విసర్జన చేయడం,అధిక ఆకలి,కారణం లేకుండా బరువు తగ్గడం,అలసట, చూపు మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి రక్తంలో చక్కెర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మధుమేహ నివారణకు సమతుల్యమైన పోషకాహారం, ఆకుకూరలు, కూరగాయలు,పీచు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవాలని పేర్కొన్నారు.అధిక చక్కెర,ఉప్పు,నూనె పదార్థాలు, వేపుళ్ళు, ఊరగాయలు,జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలన్నారు.ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేస్తూ,శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవాలని పొగాకు, మద్యపానం కూడదని, వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర పరీక్షలు చేయించుకోవాలని, మధుమేహాన్ని నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు కోల్పోవడం, మూత్రపిండాల సమస్యలు,గుండె జబ్బులు,నరాల బలహీనత, పక్షవాతం, పాదాలకు గాయాలు,పుండ్లు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిం చారు.మధుమేహాన్ని ముందుగానే గుర్తించడం -- సరైన చికిత్స పొందడం- ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా మాత్రమే మధుమేహ నియంత్రణ ప్రతి ఒక్కరికి సాధ్యమని కామరాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సరస్వతి, ఎఎన్ఎం లోహిత,ఆశాకార్యకర్తలు లక్ష్మీ ప్రసన్న, శశిరేఖ గ్రామ ప్రజానీకం పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పుల్లయ్య నామినేషన్

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పురపాలక సంఘం చైర్మన్ పదవికి సీపీఎం అభ్యర్థిగా అంగేరి పుల్లయ్య శనివారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సురేంద్ర రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి సీపీఎం నిరంతరం పోరాడుతుందని పుల్లయ్య తెలిపారు. ప్రజలు తమను ఆదరించి గెలిపించాలని కోరారు. శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, దాసరి జనార్దన్, పెనగడం గురవయ్య, రెడ్డిపల్లి సురేష్, వెంకటేష్, చుట్టు గురవయ్య, వెలివేంద్రం, ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
ఆదివారం 15 నవంబరు 2026

నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి - ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి
- విద్యార్థులకు బహుమతుల ప్రదానం - పాఠశాల చైర్మన్ కొట్టె. నారాయణ రెడ్డి





ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పాత గండిరోడ్డులోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ కొట్టె. నారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీసీసీ మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి హాజరయ్యారు. అనంతరం తులసి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించాలని సూచించారు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల చైర్మన్ కొట్టె నారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని అన్నారు. బాలలే భావి భారత పౌరులని, వారి సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ అవసరమని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రాణి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలో మంటలు -గాలిలో ప్రజల ఆరోగ్యం

-39వ వార్డులో ఉదయం నుంచి చెత్త దహనం.. -పొగ, దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఒకవైపు చెత్త కుప్పలు, మరోవైపు వాటి నుంచి వెలువడుతున్న విషపూరిత పొగ, వెదజల్లుతున్న భరించలేని దుర్వాసన ఇదీ హిందూపురం పట్టణంలోని 39వ వార్డులో నెలకొన్న దుస్థితి. పారిశుద్ధ్య నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. వార్డులోని ఓ ఖాళీ ప్రదేశంలో స్థానికులు చెత్త వేస్తుండగా, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో దానిని తొలగించకపోవడంతో రోజురోజుకూ చెత్త పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో సమస్య మరింత తీవ్రమైంది. శనివారం ఉదయం నుంచి చెత్త మండుతుండటంతో ఆ ప్రాంతమంతా పొగ కమ్ముకుని, దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చుట్టుపక్కల నివసించే ప్రజలు తీవ్ర అసహనం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి చెత్త కాలుతుండటంతో వెలువడుతున్న పొగ పరిసర ఇళ్లలోకి చేరుతోంది. భరించలేని దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల తలుపులు, కిటికీలు మూసుకున్నా పొగ, వాసన నుంచి ఉపశమనం లభించడం లేదని వాపోతున్నారు. ఇంటి ఆవరణలో కాసేపు కూర్చోవాలన్నా, పిల్లలను బయట ఆడించాలన్నా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పనులకు వెళ్లేవారు సైతం ఈ పొగ మధ్య నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోందని చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఈ పరిస్థితిని ఎలా తట్టుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలిగించేలా చెత్తను ఇలా తగలబెడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెత్త తొలగించలేరా... సమస్య పరిష్కరించలేరా...

వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యత మున్సిపాలిటీదే అయినప్పటికీ, ఖాళీ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోయే వరకు సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి రోజూ చెత్త సేకరణ, తరలింపు చేపట్టాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని మండిపడుతున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని పేర్కొంటున్నారు. ప్రజలు పన్నులు చెల్లిస్తున్నా కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించలేకపోతే ఎలా అని నిలదీస్తున్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి మండుతున్న చెత్తను పూర్తిగా ఆర్పించి, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆ ప్రాంతంలో మరోసారి చెత్త వేయకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తగలబెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజలు దుర్వాసన మధ్య జీవించాల్సిన దుస్థితికి ముగింపు పలికి, తమకు స్వచ్ఛమైన పరిసరాలు కల్పించాలని 39వ వార్డు వాసులు మున్సిపల్ అధికారులను వేడుకుంటున్నారు.

మానవత్వమే లక్ష్యం -దీనస్థితి వృద్ధుడికి అండగా నిలిచిన అల్-ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ అల్-ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మరోసారి సేవా కార్యక్రమంతో మానవతా హృదయాలను చాటుకున్నారు. అనారోగ్యంతో కాళ్లకు తీవ్ర గాయాలై, కనీసం ఆలనా పాలనా చూసేవారు లేక మూడు రోజులుగా రోడ్డుపక్కన దీనస్థితిలో కాలం వెళ్లదీస్తున్న ఓ వృద్ధుడిని చేరదీసి వైద్య చికిత్స అందించడంతో పాటు ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. హిందూపురం పట్టణంలోని ముక్కడపేట రోడ్డులో బాపన్న (60) అనే వృద్ధుడు గత మూడు రోజులుగా తీవ్ర అనారోగ్యంతో, కాళ్లకు గాయాలై నడవలేని స్థితిలో రోడ్డుపక్కన ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని శనివారం 10వ వార్డు కౌన్సిలర్ అజ్మత్ అల్-ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ట్రస్ట్ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని వృద్ధుడి పరిస్థితిని పరిశీలించారు. కనీన సంరక్షణకు నోచుకోని ఆయనకు ముందుగా క్షౌరం చేయించి, స్నానం చేయించి శుభ్రపరిచారు. అనంతరం అవసరమైన సంరక్షణ అందించి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య చికిత్స అందించిన తర్వాత హిందూపురం హౌసింగ్ బోర్డు సమీపంలోని సహస్ర ప్రణామ్ అనాథ ఆశ్రమంలో చేర్పించి ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.డి.ఎస్. అమన్ మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను ప్రేమతో, గౌరవంతో చూసుకోవాలని కోరారు. వృద్ధాప్యంలో వారికి అండగా నిలవడం పిల్లల కనీన బాధ్యతని, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా జీవితాంతం ఆదరించాలని సూచించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, నిరాశ్రయులకు అండగా నిలవడం తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సేవ చేయడానికి కులమతాలకు అతీతంగా మానవత్వమే ప్రాతిపదిక కావాలని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.డి.ఎస్. అమన్, కార్యదర్శి ఉమర్ ఫరూక్, క్యాషియర్ ఎం.డి. అర్ఫాత్, కౌన్సిలర్ అజ్మత్, రిహాన్, సుల్తాన్, ఫయాజ్, హుజిఫ్, జైద్, అఖిల్, కిరణ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఉత్తమ క్రీడాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి

-పులివెందులలో ఘనంగా అండర్ నైన్టీన్ హాకీ టోర్నమెంట్ ప్రారంభం



ప్రజాభూమి,పులివెందుల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఉత్తమ క్రీడాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అన్నారు.శనివారం పట్టణంలోని ధ్యాన్ చంద్ క్రీడా మైదానంలో డెబ్బైవ పాఠశాల క్రీడల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా అండర్ నైన్టీన్ హాకీ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుల పరిచయ కార్యక్రమం నిర్వహించి వారితో గౌరవ వందనాన్ని అందుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఎటువంటి సహాయ సహకారాలైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. క్రీడాకారుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు ముందంజలో ఉంటారన్నారు. చదువులతోపాటు క్రీడలలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మొన్న జరిగిన ఉపాధ్యాయ నియామక పరీక్షలలో నాలుగు వందల ముప్పై ఏడు మంది క్రీడాకారులు ఉద్యోగాలు పొందారని ఆయన గుర్తు చేశారు. అనంతరం క్రీడలను తిలకించారు.ఈ కార్యక్రమంలో నిర్వహణ కార్యదర్శి ప్రవీణ్ కిరణ్ గారు, సీఐ పురుషోత్తం రాజు గారు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీకాంత్ రెడ్డి , కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల క్రీడల సమాఖ్య అండర్ నైన్టీన్ బాలుర, బాలికల హాకీ టోర్నమెంట్ లో భాగంగా శనివారం నిర్వహించిన మ్యాచ్ ల ఫలితాలు ఇలా ఉన్నాయి. కృష్ణా – శ్రీకాకుళం బాలుర మ్యాచ్ గోల్ లేకుండా డ్రాగా ముగిసింది.ప్రకాశం – శ్రీకాకుళం బాలుర మ్యాచ్‌లో ప్రకాశం జట్టు మూడు – రెండు గోల్స్‌తో విజయం సాధించింది.చిత్తూరు – కర్నూలు బాలికల మ్యాచ్‌లో చిత్తూరు జట్టు ఏడు – సున్నా గోల్స్ తో ఘన విజయం సాధించింది. కడప – కర్నూలు బాలుర మ్యాచ్ లో కడప జట్టు పదిహేడు – సున్నా గోల్స్ తో భారీ విజయం నమోదు చేసింది.– పశ్చిమ గోదావరి – విజయనగరం బాలికల మ్యాచ్ లో పశ్చిమ గోదావరి జట్టు రెండు – సున్నా గోల్స్ తో విజయం సాధించింది. టోర్నమెంట్ లో వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.

పిల్లల భద్రత ఒకరి బాధ్యత మాత్రమే కాదు , సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత

పోక్సో చట్టంపై హాస్టళ్లలో అవగాహన కార్యక్రమాలు



ప్రజాభూమి,పులివెందుల

పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు, దాడులు, లైంగిక దోపిడీ నుంచి రక్షణ కల్పించేందుకు రూపొందించిన పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పులివెందుల కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, చైర్మన్ ఎం. చంద్రశేఖర్ రెడ్డి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అరుణ లు అన్నారు.బాలల దినోత్సవం పురస్కరించుకొని పులివెందుల న్యాయ వ్యాధికార సంస్థ న్యాయ విభాగము ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాను సారంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయ అధికారి రామగోపాల్ ఆదేశానుసా రముగా పట్టణంలోని పాఠశాలల్లో,హాస్టల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో అంటే ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఆఫెన్సెస్ యాక్ట్ అని, ఈ చట్టం 2012లో అమలులోకి వచ్చిందని తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను లైంగిక వేధింపులు, దాడులు, దోపిడీ నుంచి రక్షించేందుకు ఈ చట్టం రూపొందించబడిందన్నారు. పిల్లలపై ఎలాంటి లైంగిక వేధింపులు జరిగినా, భయపెట్టినా, వేధింపులకు గురిచేసినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన వ్యక్తులకు తెలియజేయాలని సూచించారు.తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను ఓపికగా వినాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బాలల హక్కులను కాపాడుతూ సురక్షితమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ హాస్టల్ వార్డెన్ నాగసుబ్బమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ రాజేంద్రప్రసాద్, నగరిగుట్ట గర్ల్స్ హాస్టల్ వార్డెన్ లక్ష్మి పాల్గొన్నారు.

కోడి రమణ ఆధ్వర్యంలోఅయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు

స్వాములకు బిక్ష వడ్డించిన వైఎస్ మనోహర్ రెడ్డి





ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో ఉన్న మిట్ట మల్లేశ్వర స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు కోడి రమణ ఆధ్వర్యంలో బిక్ష ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైకాపా బాధ్యులు వైఎస్ మనోహర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు చిన్నప్ప, పట్టణ అధ్యక్షులు హాల్ గంగాధర్ రెడ్డి హాజరై స్వాములకు కోడి రమణ ఏర్పాటు చేసిన బిక్షను స్వయంగా వడ్డించారు. అంతకు ముందుగా రుద్రా స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసి దుశ్శాలువలతో, పూలహారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేయడం చాలా పుణ్య కార్యక్రమ మన్నారు. అయ్యప్ప స్వాములకు బిక్ష వడ్డించే పుణ్య కార్యక్రమం తమకు లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కనక , అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో భక్తులకు శుభవార్త - శివ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

వులివెందుల డిపో నుంచి సోమవారం నుంచి సేవలు ప్రారంభం - ఆర్టీసీ డిఎం ప్రేమ్ కుమార్

ప్రజాభూమి,పులివెందుల

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శివ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు పులివెందుల ఆర్టీసీ డిపో నుండి వెళ్లనున్నట్లు ఆర్టీసీ డిఎం ప్రేమ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ భానుకోట, సంగమేశ్వర దేవాలయాలు, భైరవేశ్వర కోన, పొలతల కోన ప్రాంతాలకు సోమవారం నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.ఈ బస్సులు పులివెందుల డిపో నుండి ఉదయం ఆరు గంటల నుండి బయలుదేరుతాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలల ప్రతిభను ప్రోత్సహించాలి

-విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యం
-రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ మాధవరెడ్డి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ మాధవరెడ్డి పేర్కొన్నారు. చదువుతో పాటు సృజనాత్మకత, ఆలోచనా శక్తి, వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి చిన్ననాటి నుంచే విద్యార్థులకు తగిన అవకాశాలు కల్పించాలన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హిందూపురం, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ హిందూపురం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాలులో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లోని సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో మొత్తం పది రకాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, సర్వతోముఖ అభివృద్ధికి తోడ్పడటమే ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కేవలం చదువులోనే కాకుండా కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర సృజనాత్మక రంగాల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి లభించిన స్పందన ఎంతో సంతోషాన్ని కలిగించిందని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ నరేంద్రరెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కార్యదర్శి విజయ్ కుమార్, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, కార్యదర్శి స్వాతి విజయ్ తదితర రోటరీ, ఇన్నర్ వీల్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర -జెండా ఊపి ప్రారంభించిన పాదయాత్ర మున్సిపల్ చైర్మన్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

కలియుగ వైకుంఠం తిరుమలకు పాదయాత్రగా వెళ్లడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ పి.ఎన్ మంజునాథ్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్ లో వెలిసిన వెంకటేశ్వర స్వామి దేవాలయం నుండి బయలుదేరిన తిరుమల తిరుపతి పాదయాత్రను మున్సిపల్ చైర్మన్ పిఎస్ మంజునాథ్ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత మున్సిపల్ చైర్మన్ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ భక్తి భావాలు పెంపొందించుకొని సన్మార్గంలో పయనిస్తే సమాజం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో వందలాదిమంది భక్తాదులు కాలినడకన తిరుమలతిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లడం చాలా అభినందనీయమన్నారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ మంజునాథ్ ను ఘనంగా సన్మానం చేశారు. జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించగా పాదయాత్ర బృందం కన్వీనర్ పురుషోత్తం రెడ్డి నేతృత్వంలో భక్తులు గోవిందా గోవిందా అనే నామస్మరణతో తిరుమలకు బయలుదేరింది. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ శేఖర్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు పి.ఆర్.ఆర్ సుబ్రమణ్యం, కార్యదర్శి ఎస్.బి.ఆంజనేయులు, కోశాధికారి ఎంఎస్ఎస్ ప్రసాద్, కమిటీ సభ్యులు నామ్ రవి,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 10

ఆదివారం 15 నవంబరు 2026

బెంగళూరులో ఏఐటీయూసీ 43వ జాతీయ మహాసభలు

- మహాసభలను జయప్రదం చేయాలి
- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బళ్ళారపు రామాంజనేయులు



ప్రజాభూమి, వేంపల్లె

నవంబర్ 22 నుంచి 26వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించనున్న ఏఐటీయూసీ 43వ జాతీయ మహాసభలను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు బళ్ళారపు రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. 44 కార్మిక చట్టాల స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు, ప్రమాద బీమా, పెన్షన్, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అమలు చేయాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు చేయడంతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లకు నెలకు రూ.42 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చలపతి, మండల కార్యదర్శి బాలాజీ, సిద్దయ్య, రమణ, గంగయ్య, రామాంజి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించి, విజ్ఞానాన్ని విస్తరించేందుకు గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని గ్రంథాలయ అధికారి వి. విజయకుమారి పేర్కొన్నారు. హిందూపురం శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకు వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానంతో పాటు ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఆంధ్రరత్న ఎం.సి. గంగాధర్, గ్రంథాలయ అధికారి విజయకుమారి, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో ఐదు నామినేషన్ల కేంద్రాలు



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలో సర్పంచ్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పుట్లూరు మండలంలోని పుట్లూరు,ఎల్లుట్ల, మడ్డిపల్లి, శనగల గూడూరు, అరగటివేముల ఐదు నామినేషన్ల కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందుకు తగ్గ ఏర్పాట్లను సైతం నామినేషన్ పత్రాలను మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు అధికారులు సన్నద్ధం చేస్తున్నారు.

బాలల దినోత్సవం ఘనంగా వేడుకలు
నేటి బాలల ఆలోచనలు రేపటి సమాజానికి పునాదులు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్

మండలం కేంద్రంలోని బివి పురం కాలనీలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో క్రై బెంగళూరు వారి సహకారంతో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలోని పిల్లల చేతుల్లోనే బాలల భవిష్యత్తు ఉంటుందని నేటి బాలల ఆలోచనలు ఆశయాలు విద్యా సంస్కారం రేపటి సమాజానికి పునాదులు వేస్తాయని తెలిపారు బాలల హక్కులు కాపాడుకోవాలని రక్షణ పొందే హక్కు ఉచిత విద్యా హక్కు పాల్గొనే హక్కు అభివృద్ధి చెందే హక్కు గురించి విపులంగా తెలియజేశారు కో కన్వీనర్ రామచంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో బాలల సంఘాలు సమావేశాల్లో పిల్లలు చురుగ్గా పాల్గొని బాలల యొక్క సమస్యలు పెద్దలు దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కోరారు బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని బాల్య వివాహాలు నిర్మూలనకు కృషి చేయాలని బాగా చదువుకొని అభివృద్ధి సాధించాలని కోరారు అనంతరం ప్రగతి సంస్థ బాలలకు ఆట పోటీలు నిర్వహించి ఆట వస్తువులు స్కిప్పింగ్ బాల్స్ రింగులు అందజేసి బహుమతులు అందించారు అనంతరం పిల్లలందరికీ బాలహక్కులు కాపాడుకుందాం అని రక్షించుకుందామని గ్రామంలో ర్యాలీ నిర్వహించి బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలిస్తాం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు



చదువుతోపాటు సంస్కృతి అలవర్చుకోవాలి

-ఘనంగా ఎల్.ఆర్.జి. పబ్లిక్ స్కూల్ బాలోత్సవం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థులకు చదువుతోపాటు మంచి నడవడిక, క్రమశిక్షణ, సాంస్కృతిక విలువలు అలవర్చడం ఎంతో అవసరమని చిన్నపిల్లల వైద్యులు కె.కేశవులు పేర్కొన్నారు. పిల్లలకు బయట లభించే పోషక విలువలు లేని జంక్ ఫుడ్‌ను తినిపించకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు తప్పు చేసినప్పుడు అందుకు పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను నిందించడం సరైన వద్ధతి కాదని, పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని హితవు పలికారు. హిందూపురం పట్టణ సమీపంలోని కిరికెర ఎల్.ఆర్.జి. పబ్లిక్ స్కూల్ (సీబీఎస్ఈ)లో శనివారం బాలోత్సవం, వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె. కేశవులు మాట్లాడుతూ, బాల్యం నుంచే పిల్లల ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పోషకాహారం అందించడం ద్వారా పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడాలని సూచించారు. ఎల్.ఆర్.జి. సంస్థల కార్యదర్శి వి. బాలసుందరం మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తిని బాల్యం నుంచే పెంపొందించాలని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతోపాటు ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.బి. భారతి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాల్లో మార్కులే అన్నింటికీ కొలమానం కాదని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రమశిక్షణ, మంచి నడవడిక, వినయం, విధేయత వంటి లక్షణాలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ విలువలే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడతాయన్నారు. ఎల్.ఆర్.జి. అకాడమీ ఇన్‌చార్జ్ ఇ. ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించే పాఠశాలను ఎంపిక చేసి తమ పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమన్నారు. అనంతరం నర్సరీ నుంచి రెండో తరగతి వరకు చదువుతున్న చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తమ నృత్యాలు, అభినయాలతో చిన్నారులు అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వికసిత్ భారత్ నిర్మాణం కోసం యువత తమ ఆలోచనలను పంచుకోవాలి...

-జేఎన్‌టీయూఏ లో ఘనంగా వికసిత్ భారత్ చాలెంజ్ ట్రాక్ జిల్లా స్థాయి పీపీటీ ప్రెజెంటేషన్ పోటీలు





ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్ – అనంతపురం, ఆన్సెట్ సంయుక్త ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ ఆర్యభట్ట ఆడిటోరియంలో శనివారం వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027లో భాగంగా జిల్లా స్థాయి వికసిత్ భారత్ చాలెంజ్ ట్రాక్ పీపీటీ ప్రెజెంటేషన్ పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా రెవెన్యూ అధికారి ఏ. మాలోల, జేఎన్‌టీయూ ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శన్ రావు, జిల్లా పర్యాటక అధికారి శ్రీ రమణ రెడ్డి, ఆన్సెట్ సీఈఓ శ్రీ ఎన్. రవిశంకర్ రెడ్డి, మేరా యువ భారత్ ప్రతినిధి శ్రీ బిసాతి భరత్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. జి. మమత, ఆన్సెట్ మేనేజర్ శ్రీ సి. శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీ బిసాటి జీవన్ కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత ఆలోచనలు, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మేరా యువ భారత్ పోర్టల్ ద్వారా నిర్వహించిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027 క్విజ్, వ్యాసరచన పోటీలలో అర్హత సాధించిన అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన యువతకు తదుపరి దశగా వికసిత్ భారత్ చాలెంజ్ ట్రాక్‌లో భాగంగా ఈ జిల్లా స్థాయి పీపీటీ ప్రెజెంటేషన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 12 మంది యువతను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన యువతకు జనవరిలో దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027 కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. అక్కడ దేశ ప్రధానమంత్రి సమక్షంలో వికసిత్ భారత్ లక్ష్య సాధనకు సంబంధించిన తమ వినూత్న ఆలోచనలు, సూచనలను దేశ స్థాయిలో పంచుకునే అరుదైన అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయిలో తమ ఆలోచనలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ ఏ. మాలోల, జిల్లా పర్యాటక అధికారి శ్రీ రమణ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. జి. మమత, సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఓ. ప్రణతి, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పి. సత్య సౌమ్య వ్యవహరించారు. కార్యక్రమంలో పాల్గొన్న యువతకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ వాలంటీర్లు బి. అంబరీష్, ఐ. సాయి కార్తిక్, బి. రాము, ప్రవీణ్ నాయక్, డి. వినుత, యాసీర్, ఆన్సెట్ సిబ్బంది, యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులను ఎన్నుకోవాలి

సీపీఐ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలి - సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మురళి పిలుపు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ సమితి సమావేశం వై.ఎస్. మణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి. మురళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పి. మురళి మాట్లాడుతూ, రానున్న మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, వాటి పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, మురుగునీటి కాలువల సమస్యలు, వీధిలైట్ల నిర్వహణ వంటి అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పట్టణంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, మెరుగైన పారిశుద్ధ్యం, రహదారులు, వీధిలైట్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించి గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు స్థానిక సంస్థలు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణాలు, గ్రామాల అభివృద్ధి, పేద ప్రజల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా సీపీఐ నిరంతరం ప్రజల వక్షాన పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. స్థానిక సంస్థల్లో ప్రజల గొంతుకగా నిలిచి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే సీపీఐ అభ్యర్థులకు ప్రజలు అండగా నిలిచి మద్దతు ఇవ్వాలని పి. మురళి కోరారు. ఈ సమావేశంలో సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మండల కార్యదర్శులు వై.ఎస్. మణి, సి.హెచ్. శివ, రూరల్ మండల కార్యదర్శి ఎం. శివకుమార్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి తొండు మల్లికార్జున, మనీ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నరసింగాపురం వృద్ధురాలి అదృశ్యం: ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని కుటుంబ సభ్యుల వేడుకోలు..!



ప్రజాభూమిప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి మండలం నరసింగాపురం గ్రామానికి చెందిన ఎస్. కుమారి (69) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల (నవంబర్) 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదని పేర్కొన్నారు. చివరిసారిగా ఆమె తిరుపతి ఆర్‌సీ రోడ్డులోని రైతు బజార్ పక్కన ఉన్న సందు, సి.కామ్ కాలేజీ లైన్ ప్రాంతంలో కనిపించినట్లు సమాచారం అందుతోందని తెలిపారు. గత పన్నెండు రోజులుగా ఆమె కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎవరికైనా సదరు వృద్ధురాలు కనిపించినా లేదా ఆమెకు సంబంధించిన సమాచారం తెలిసినా తక్షణమే ఎస్. మునికృష్ణయ్య (సెల్: 9866774453) నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రికార్డు విజయంతో రాజకీయ వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు!

-సుగవాసి ప్రసాద్ బాబుకు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా అభినందనలు!

సూర్యప్రతినిధి – మదనపల్లి

గాలివీడు మండల జడ్పీటీసీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయిలోనే రికార్డు స్థాయి అత్యధిక మెజారిటీతో చారిత్రాత్మక విజయం సాధించిన రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు ను మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా తన టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు ఆత్మీయంగా పలకరించుకుని, శాలువాలతో పరస్పరం సత్కరించుకున్నారు. సుగవాసి ప్రసాద్ బాబు సాధించిన చారిత్రాత్మక విజయంపై ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల విశ్వాసమే నాయకుడికి అసలైన బలం! –గాలివీడు మండల ప్రజలు చూపించిన అపారమైన అభిమానం, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి, కూటమి శ్రేణుల ఐక్యతకు ఈ ఘన విజయం నిదర్శనంగా నిలిచిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తన విజయానికి అండగా నిలిచిన గాలివీడు మండల ప్రజలకు, టీడీపీ మరియు కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు సుగవాసి ప్రసాద్ బాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గాలివీడు మండల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.

టీడీపీలోకి 30 కుటుంబాలు చేరిక- ప్రజా సంక్షేమమే కూటమి పాలనకు బలం

- టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ముత్తుకూరు గ్రామంలో టీడీపీలోకి 30 కుటుంబాలు చేరాయి. ముత్తుకూరు గ్రామానికి చెందిన అసోం పవన్ కుమార్ రెడ్డి, తుపాకుల గంగాధర్ రెడ్డి, మాలపాటి గోవర్ధన్ రెడ్డి, శిరిగిరెడ్డి సాయి తులసి రెడ్డి, లింగాల కర్ణాకర్ రెడ్డితో పాటు మొత్తం 30 కుటుంబాల వారు టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి పాలనకు బలమని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అర్హులైన ప్రజలకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. కూటమి పాలనపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసంతోనే ఇతర పార్టీలకు చెందిన వారు టీడీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి (దిల్మాంగే), మహమ్మద్, గౌస్, గంగాధర్ రెడ్డి, పకీర్ రెడ్డి, నారాయణ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రామగంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
పోలవరం
11
ఆదివారం 15 నవంబరు 2026

విలీన మండలాల కోర్టు వ్యవహారంలో భద్రాచలం బార్ జోక్యమెందుకు?

- యటపాకలో కోర్టు ఏర్పాటుపై భద్రాచలం న్యాయవాదుల వైఖరిని ఖండిస్తున్నాం..
- రంపచోడవరం బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మడివి రవితేజ



ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విలీన మండలాలైన చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువ చేసేందుకు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలనే అంశంలో తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం బార్ అసోసియేషన్ జోక్యం చేసుకోవడాన్ని ఖండిస్తున్నామని రంపచోడవరం బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, న్యాయవాది మడివి రవితేజ అన్నారు. శనివారం చింతూరులో ఆయన మాట్లాడుతూ విలీన మండలాల కోర్టు ఏర్పాటు పేరుతో భద్రాచలం బార్ అసోసియేషన్‌కు చెందిన కొంతమంది న్యాయవాదులు స్వార్థ ప్రయోజనాలతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భద్రాచలానికి చెందిన న్యాయవాదులకు అనుకూలంగా ఎటపాక కేంద్రంలో కోర్టు ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజల ప్రయోజనాల కంటే తమ స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ హైకోర్టు న్యాయమూర్తులను కలిసి వినతిపత్రాలు అందిస్తున్నారని విమర్శించారు. నిజంగా గిరిజన కక్షిదారులు, ప్రజల ప్రయోజనాలే లక్ష్యమైతే భద్రాచలంలో గతంలో రద్దు చేసిన మొబైల్ కోర్టు, ఎల్.టి. ఆర్., సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కోర్టుల పునరుద్ధరణ కోసం ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలోని విలీన మండలాల కోర్టు ఏర్పాటు అంశంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన భద్రాచలం బార్ అసోసియేషన్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో స్థానిక రంపచోడవరం బార్ అసోసియేషన్‌తో సంప్రదింపులు జరపకుండా ఏకపక్షంగా ఎలా వ్యవహరిస్తారని నిలదీశారు. ఇతర రాష్ట్రానికి చెందిన బార్ అసోసియేషన్ జోక్యం చేసుకుంటున్న తీరుపై చర్చించేందుకు త్వరలో రంపచోడవరం బార్ అసోసియేషన్ సమావేశం ఏర్పాటు చేస్తామని, అనంతరం హైకోర్టు న్యాయమూర్తులను కలిసి తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలియజేస్తామని మడివి రవితేజ వెల్లడించారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు.. సందడిగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు!

చాచా నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలి
ఇంచార్జ్ హెచ్ఎం పాయం లక్ష్మీ



ప్రజాభూమిప్రతినిధి-వి.ఆర్.పురం
ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, సోములగూడెంలో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు పాయం లక్ష్మీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాయం లక్ష్మీ మాట్లాడుతూ.. చిన్నారులంతా చాచా నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాది అని, వారి అభివృద్ధి, విద్యాభివృద్ధితోనే సమాజం, దేశం ప్రగతి సాధిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, క్రీడా పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు చాక్లెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీర్రాజు, లక్ష్మయ్య, సురేష్, శివకుమార్, భద్రమ్మ, కమల, నీలవేణి తదితరులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాత్రి పగలు తేడా లేకుండా
వీడియో గేమ్స్‌లో చిన్నారులు.. పట్టించుకునేవారేరీ

మొబైల్ గేమ్స్‌కు బానిసవుతున్న బాల్యం చదువు ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం
ప్రస్తుత ఆధునిక కాలంలో చిన్నారులు వీడియో గేమ్స్‌కు బాగా ఆకర్షితులవుతున్నారు రాత్రి పగలు అనే తేడా లేకుండా మొబైల్ ఫోన్లలో స్నేహితులతో కలిసి ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు ముఖ్యంగా సాయంత్రం వేళల్లో దుకాణాల వద్ద, వీధుల్లో గుంపులుగా చేరి మొబైల్ గేమ్స్‌లో మునిగిపోతున్న చిన్నారులు మండలంలోని పలు ప్రాంతాల్లో కనిపిస్తున్నారు చిన్న వయసులోనే మొబైల్ గేమ్స్‌కు అలవాటు పడుతున్న పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎంతవరకు ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి గంటల తరబడి ఫోన్లలో గేమ్స్ ఆడటం వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గడం నిద్రకు ఆటంకం కలగడం శారీరక శ్రమ తగ్గడం వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన



వ్యక్తం చేస్తున్నారు పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు మొబైల్ వినియోగ సమయంపై నియంత్రణ విధించాలని వారు ఏం చూస్తున్నారు ఎంతసేపు ఫోన్ ఉపయోగిస్తున్నారనే విషయాలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచిస్తున్నారు మొబైల్ గేమ్స్‌కు బదులుగా మైదాన ఆటలు పుస్తక పఠనం,చదువు,సృజనాత్మక కార్యక్రమాలపై ఆసక్తి పెంచేలా ప్రోత్సహించాలని కోరుతున్నారు చిన్నారుల బాల్యం మొబైల్ తెరలకే పరిమితం కాకుండా ఆటపాటలు,విద్యతో వికసించాలి పిల్లల చేతుల్లో సెల్‌ఫోన్లకు బదులుగా పుస్తకాలు ఉండేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమాజం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు

స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన కార్యక్రమం

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలి: సీఐ గజేంద్ర కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల
మండలంలోని వేటమామిడి సెంటర్లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సీఐ గజేంద్ర కుమార్ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా సీఐ



మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎవరికి ఓటు వేశారనే విషయాన్ని ఇతరులకు బహిర్గతం చేయకూడదని తెలిపారు. ఎన్నికల సమయంలో గొడవలు, ఘర్షణలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలు సంయమనం పాటి స్తూ ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై బి వినోద్ పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

186 గ్రామ పంచాయతీలు, 1,734 వార్డులకు ఎన్నికలు

- 425 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు - పటిష్ట పోలీసు భద్రత
- జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం
జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి మాట్లాడుతూ జిల్లాలో రెండు దశల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలీసు శాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి దశలో ఐదు మైదాన ప్రాంత మండలాల్లో, రెండో దశలో మిగిలిన ఏజెన్సీ, అంతర్గత ప్రాంత మండలాల్లో ఎన్నికలు జరుగుతాయని వివరించారు. మొత్తం 12 మండలాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొదటి దశలో 31, రెండో దశలో 40 కలిపి మొత్తం 71 ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. 186 గ్రామ పంచాయతీల పరిధిలోని 489 ప్రాంతాల్లో 1,734 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.
సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించడంతో పాటు ఏరియా డామినేషన్, నిరంతర నిఘా చేపడతామని ఎస్పీ తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రాల వద్ద కూడా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను నిర్దేశిత విధానం ప్రకారం భద్రపరిచేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై కాకుండా స్వతంత్ర గుర్తులపై జరుగుతాయని, అభ్యర్థులు, ఓటర్లు ఎన్నికల గుర్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం, చీరలు తదితర వస్తువుల పంపిణీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేసే సమర్థులైన అభ్యర్థులను ఎన్నుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటర్లను లేదా అభ్యర్థులను ఎవరైనా బెదిరించినా, ప్రలోభాలకు గురిచేసినా వెంటనే పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగగా భావించి ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గంగవరం మండలంలో
గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

15 నుంచి 17వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఆరు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడతకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో గంగవరం మండలంలో ఎన్నికల అధికారులు నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు ఈ నెల15వ తేదీ నుంచి17వ తేదీ వరకు ఉదయం10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్టేజ్1రిటర్నింగ్ అధికారుల ద్వారా సర్పంచ్ వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు నామినేషన్ల స్వీకరణ కోసం మండలంలోని మోహనాపురం జడేరు,గంగవరం పిడత మామిడి,కొత్తాడ,జగ్గంపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఎంపిక చేసినట్లు తహసీల్దార్ తెలిపారు అర్హత కలిగిన అభ్యర్థులు నిర్దీత తేదీలు సమయాల్లో సంబంధిత కేంద్రాల్లో తమ నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని సూచించారు నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు ఎవరైనా ఆటంకాలు కలిగించినా,బెదిరింపులకు పాల్పడినా వెంటనే ఎంపీడీఓ,తహసీల్దార్ లేదా గంగవరం ఎస్ఐకి సమాచారం అందించాలని కోరారు అవసరమైన సందర్భాల్లో అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసేందుకు తగిన పోలీసు భద్రత కల్పిస్తామని స్పష్టం చేశారు ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అర్హులైన అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవాలని తహసీల్దార్ ప్రజలకు తెలియజేశారు.

అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనిక్ వైద్యురాలు నియామకం

-గర్భిణులకు 24 గంటల వైద్య సేవలు అందుబాటులో



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల
అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి నూతనంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్త్రీల వ్యాధులు, ప్రసూతి విభాగం)గా డాక్టర్ ఆర్. మోనిషా నియమితులయ్యారు. దీంతో గర్భిణీ స్త్రీలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.గతంలో ప్రతి నెల 10వ తేదీన గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుంచి గైనకాలజీ వైద్యులు అడ్డతీగలకు వచ్చేవారు. ప్రస్తుతం డాక్టర్ ఆర్. మోనిషా నియామకంతో గైనిక్ వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. మహేష్ రెడ్డి తెలిపారు.గర్భిణీ స్త్రీలు అత్యవసర పరిస్థితుల్లోనూ, ప్రసూతి సంబంధిత సమస్యలతోనూ 24 గంటల పాటు వైద్య సేవలను పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. స్థానికంగా గైనిక్ వైద్యురాలు అందుబాటులో ఉండటంతో గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స అందే అవకాశం ఏర్పడిందన్నారు.

గొరగుమ్మి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం
గొరగుమ్మి గ్రామంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు ఈ సందర్భంగా భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి



విద్యా కమిటీ చైర్మన్ లోత వెంకటరమణ వైస్ చైర్మన్ కోసూరి సీతారా మరెడ్డి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు విద్యార్థులు సైతం నెహ్రూ చిత్రపటానికి నమస్కరించి ఆయనకు గౌరవం తెలిపారు ఈ సందర్భంగా ఉపాధ్యా యులు మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు బాలల హక్కులు,విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ లోత వెంకటరమణ,వైస్ చైర్మన్ కోసూరిసీతారామరెడ్డి,ఉపాధ్యాయులు వెంకన్నదొర,ఉపాధ్యాయురాలు అచ్చియమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

పంచాయతీ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు విజయవంతానికి కృషి

పోలవరం జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం
పోలవరం జిల్లాలో గ్రామ పంచాయతీ రెండో సాధారణ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు.శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో గ్రామ పంచాయతీ రెండో సాధారణ ఎన్నికలు-2026 నిర్వహణకు సంబంధించి నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశానికి జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్,సూపెరడెంట్ అఫ్ పోలీస్ కె.చక్రవర్తి, జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్లు పృద్వి రాజ్ కుమార్,నరేంద్ర పడల్,డి పి ఓ జి. భాస్కర రావు సమావేశంలో పాల్గొని శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారుల బాధ్యతలు, విధులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారనీ ఆయన తెలిపారు.జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ల పర్యవేక్షణలో ఎన్నికల నిర్వహణ కొనసాగుతుందని, ప్రతి మండలానికి రిటర్నింగ్ అధికారులను నియమించి ఆయా మండలాలకు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు.
గతంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా జిల్లా స్థాయిలో నోడల్ అధికారులుగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు కూడా తమకు కేటాయించిన బాధ్యతలను కొనసాగించాలని ఆయన సూచించారు.ఎన్నికల నిర్వహణలో ముఖ్యంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన,బ్యాలెట్ పేపర్ల ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, నోడల్ అధికారుల శిక్షణ, ఎన్నికల సామగ్రి పంపిణీ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.
ఎన్నికల ప్రక్రియలో ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను సమయపాలనతో, సమర్థవంతంగా నిర్వహించి ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పోలవరం జిల్లాలో రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలు ఫస్ట్ పేజ్ లో అడ్డతీగల, దేవీపట్నం, గంగవరం, రాజమౌమ్మంగి, రంపచోడవరం అదేవిధంగా సెకండ్ పేజ్ లో గుర్తేడు, వై రామవరం, చింతూరు, మారేడుమిల్లి, కూనవరం, వి ఆర్ పురం, ఏటపాక మండలాలలో మొత్తం 186 పంచాయతీలకు 1734 పోలింగ్ స్టేషన్స్ లలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా మొత్తం 12 మండలాలలో 2 లక్షల 78 వేల 545 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు. అదేవిధంగా పోలింగ్ ఉదయం 7 గంటల



నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందని తెలిపారు. పోలింగ్ పూర్తయిన అనంతరం అదే రోజు మధ్యాహ్నం 2:00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను కూడా అదే రోజు ప్రకటించి ఉప సర్పంచ్లను కూడా అదే రోజు ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ ఎన్నికలకు సంబంధించి ప్రత్యేకంగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయకుండా, మండల కేంద్రాల్లోనే రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు రోజు పోలింగ్ సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకుని ఎన్నికల సామగ్రిని స్వీకరించి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని సూచించారు.పోలింగ్ పూర్తయిన అనంతరం బ్యాలెట్ పత్రాలు, ఎన్నికల సామగ్రిని తిరిగి మండల కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆయన సూచించారు.పోలింగ్,ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన మొత్తం ఒకే రోజులో పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రిటర్నింగ్ ఆఫీసర్ అనేది కేవలం పరిపాలనా అధికారి పదవి మాత్రమే కాదు. ఎన్నికల సమయంలో ఆయన ఒక క్వాసీ జ్యుడీషియల్ అధికారి గా కూడా విధులు నిర్వహించాలని క్వాసీ జ్యుడీషియల్ అంటే పాక్షిక న్యాయ స్వభావం కలిగిన అధికారమని ముఖ్యంగా నామినేషన్ పత్రాల పరిశీలన సమయంలో న్యాయమూర్తి తరహాలో ఎన్నికల నియమ నిబంధనల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలనీ ఆయన అన్నారు. రెండు విడతల ఎన్నికలకు నియమితులయ్యే ప్రిసైడింగ్ అధికారులు ఒకే విధమైన బాధ్యతలు నిర్వహించనున్నందున,శిక్షణలో ఎన్నికల విధులు, పోలింగ్ ప్రక్రియ, సంబంధిత రికార్డుల నిర్వహణపై పూర్తి అవగాహన కల్గివుండాలని ఆయన తెలిపారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి తమ బాధ్యతలను స్పష్టంగా తెలుసుకుని, ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఎక్కడికి అక్కడ బ్రాడ్కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించు కొనే విధంగా తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. పోలవరం జిల్లాలో ఈ 186 గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి 40 జోన్లు,92 రూట్లు, 71 మంది స్టేజ్ వన్ ఆర్వోలు, ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలవరం జిల్లాలో ఎస్ టి ఓటర్స్ 1 లక్ష 88 వేల 460, ఎస్సీ ఓటర్లు 23,730 మంది, బీసీ ఓటర్లు 47,947 మంది, ఇతర ఓటర్లు 18,408 మంది ఓటర్లు కలరని ఆయన తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డ్వా మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంప్రసాద్, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, జిల్లాస్థాయి అధికారులు, జోనల్ అధికారులు, స్టేజ్ వన్ స్టేజ్ టు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్

ఆదివారం, నవంబర్ 15, 2026

12

ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, రాతపూర్వక క్విజ్ పోటీలు

❖19న ఏడు నియోజకవర్గాల కేంద్రాల్లో పోటీలు..20న జిల్లా స్థాయి పోటీలు ❖18వ తేదీలోగా పాఠశాల స్థాయి పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వారి ఆదేశాలు, మార్గదర్శకాలు, అదేవిధంగా కృష్ణా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ సూచనల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, రాతపూర్వక క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించడం, ప్రజాస్వామ్య విలువల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించడం, ఎన్నికలకు సంబంధించిన చట్టపరమైన అంశాలను తెలియజేయడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ పోటీలను పాఠశాల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి, అనంతరం జిల్లా స్థాయి వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన కృష్ణా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కేంద్రాల్లో నియోజకవర్గ స్థాయి పోటీలు, 20వ తేదీన జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.పాఠశాల స్థాయిలో నిర్వహించే పోటీల్లో వ్యాసరచన విభాగంలో ఇద్దరు, రాతపూర్వక క్విజ్ విభాగంలో ఇద్దరు చొప్పున విజేతలను ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపించాలి. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రతి నియోజకవర్గం నుంచి వ్యాసరచనలో 10 మంది, రాతపూర్వక క్విజ్‌లో 10 మంది చొప్పున జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు.కావున జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ నెల 18వ తేదీలోగా తమ పాఠశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ద్వారా వ్యాసరచన, రాతపూర్వక క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులను ఎంపిక చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు కోరారు. ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

తాడిగడప మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ

ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

కృష్ణా జిల్లా పరిధిలో తాడిగడప, గుడివాడ మున్సిపాలిటీలతో పాటు ఆరు మండలాల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా ఎస్పీ విద్యా సాగర్ నాయుడు పరిశీలించారు.ఈ సందర్భంగా తాడిగడప మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 13 నామినేషన్ కేంద్రాలు, గుడివాడ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన రెండు నామినేషన్ కేంద్రాల్లో భద్రతా ఏర్పా ట్లను, నామినేషన్ల స్వీకరణ జరుగుతున్న తీరును పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఇటీవల నిర్వహించిన మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ/జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించామని ఎస్పీ తెలిపారు.అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న తాడిగడప, గుడివాడ మున్సిపాలిటీల ఎన్నికల నామినేషన్ ప్రక్రియతో పాటు రానున్న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను కూడా ప్రశాంతంగా నిర్వహించేందుకు కృష్ణాజిల్లా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేప ట్టిందని పేర్కొ న్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీస్ సిబ్బందిని తగిన సంఖ్యలో నియమించి, ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను బట్టి బందోబస్తు ఏర్పా ట్లు చేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ చేపడుతూ, ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రతి దశలోనూ పటిష్టమైన పోలీస్ భద్రత కల్పిస్తూ, శాంతియుత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా కృష్ణాజిల్లా పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేస్తుందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్. తెలిపారు.

సజ్జలను కలిసిన యడ్లపల్లి రామ్‌సుధీర్



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ గౌరవనీయులు సజ్జల రామకృష్ణారెడ్డిని శనివారం కృష్ణా జిల్లా యువనాయకులు యడ్లపల్లి రామ్ సుధీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి జిల్లాలోని పరిస్థితులను వివరించారు.

ఐదు రోజుల పసికందుకు ప్రపంచ రికార్డు

పుట్టినప్పటి నుంచే అసాధారణమైన కనురెప్పలు.. బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

పుట్టిన ఐదు రోజులకే ఓ పసికందు అరుదైన ఘనతను సొంతం చేసుకుని ప్రపంచ రికార్డుల్లో చోటు సంపాదించాడు. ముక్కంటి సాయి శంకర్, ఇషిత దంపతులు హైదరాబాద్‌లోని మేడ్చల్‌లో నివాసం ఉంటున్నారు. ప్రసవం నిమిత్తం ఇషిత తన పుట్టింటికి మచిలీపట్నం రాగా, జూలై నెలలో మగబిడ్డకు జన్మనిచ్చింది.ఆ చిన్నారికి కియాన్స్ అని నామకరణం చేశారు. పుట్టినప్పటి నుంచే కియాన్స్‌కు అసాధారణంగా పొడవైన, ఒత్తయిన కనురెప్పలు ఉండటంతో వైద్యులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీంతో చిన్నారి ప్రత్యేకతను ప్రపంచ రికార్డుగా నమోదు చేయించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు అతడి ఫొటోలు, ఇతర ఆధారాలను వెబ్‌సైట్ ద్వారా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (బీడబ్ల్యూఆర్) సంస్థకు పంపించారు.వాటిని పరిశీలించిన సంస్థ వెరిఫికేషన్ కమిటీ చిన్నారి ప్రత్యేకతను ధ్రువీకరించి, బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేసింది. ఈ మేరకు తల్లిదండ్రులకు ధ్రువీకరణ పత్రంతో పాటు నేషనల్ రికార్డ్ హోల్డర్ షీల్డ్‌ను పంపించింది.పసి వయసులోనే తమ చిన్నారికి అరుదైన గుర్తింపు లభించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ సంతోషాన్ని మీడియా తో పంచుకున్నారు.

నగరంలో డ్రైనేజీ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలి

❖వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీల పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి ❖విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అవసరమైన యంత్రసామగ్రి, సాంకేతిక నిపుణుల సేవలు వినియోగించుకోవాలి ❖జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ





ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టర్ మచిలీపట్నం నగరం లోని జిల్లా పరిషత్ సెంటర్, సాయిబాబా సెంటర్, బందరు బస్టాండ్ సెంటర్, కోనేరు సెంటర్, కోర్టు రోడ్డు తదితర ప్రధాన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో వర్షాలు కురిసిన అనంతరం మురుగునీరు, వర్షపు నీరు రోడ్లపై నిలిచి పోయి రెండు మూడు రోజుల వరకు కూడా బయటకు వెళ్లని పరిస్థితులను పరిశీలించారు.ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నగరంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని, పూడిక పేరుకుపోయిన డ్రైనేజీ కాలువలను యుద్ధ ప్రాతిపదికన శుభ్రపరచాలని ఆదేశించారు. వర్షపు నీరు సజావుగా ప్రవ హించేలా ప్రధాన డ్రైనేజీ మార్గాల్లో అడ్డంకులను తొలగించి, నీరు నిల్వ ఉండే సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని మున్సిపల్ కమిషనర్, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్‌లకు స్పష్టం చేశారు.డ్రైనేజీల పూడికతీత, నీటి నిల్వలను తొలగించేందుకు అవసరమైన ఆధునిక యంత్ర సామగ్రి, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సిబ్బంది కొరతను అధిగమించేందుకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సహకారం తీసుకోవాలని కలెక్టర్ నిర్ణయించారు.

ఈ మేరకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషన ర్‌తో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి, మచిలీ పట్నం నగరంలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన యంత్రసామగ్రితో పాటు సాంకేతిక నైపుణ్యం కలిగిన సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన పంపించాలని కోరారు.జిల్లా కలెక్టర్ అభ్యర్థనకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన యంత్ర సామగ్రి, సాంకేతిక నిపుణులైన సిబ్బందిని మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనులు చేపట్టేందుకు తాత్కాలికంగా పంపిస్తామని హామీ ఇచ్చారు.మచిలీపట్నం నగరంలో ప్రస్తుతం నెలకొన్న డ్రైనేజీ సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కల్పించడంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నగరంలోని డ్రైనేజీ వ్యవస్థను సమగ్రంగా సమీక్షించి, అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, మరమ్మతులు, పూడికతీత పనులకు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు.ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, నగర ప్రజల సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ డ్రైనేజీ సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్, ఇతర మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ బాధితుల రేషన్ బియ్యం తరలింపునకు యత్నం

అర్ధరాత్రి వాహనంలో ఎక్కిస్తుండగా అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం కంసలిపాలెంలో తుఫాన్ బాధితులకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అర్ధరాత్రి తరలించేందుకు డీలర్ యత్నించడం కలకలం రేపింది. శుక్రవారం అర్ధ రాత్రి సమయంలో బియ్యం బస్తాలను వాహనంలోకి ఎక్కిస్తుండగా గమనించిన గ్రామస్తులు వెంటనే అడ్డుకున్నారు.బియ్యం తరలింపు విషయాన్ని స్థానిక నాయకులకు గ్రామస్తులు సమా చారం అందించారు. అనంతరం ఈ ఘటనపై రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. తుఫాన్ బాధితులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అర్ధరాత్రి సమయంలో తరలించేందుకు ప్రయత్నించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, బియ్యం తరలింపు వెనుక ఉన్న కారణాలను వెలికితీయాలని గ్రామస్తులు కోరారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ పద్మశాలి విశ్రాంతి ఉద్యోగుల సంఘం (టిపిఆర్‌యుఎస్) నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయం అల్మాపురి, హైదరాబాద్ లో తెలంగాణ పద్మశాలి విశ్రాంతి ఉద్యోగుల సంఘం సభ్యులు శనివారం ఉదయం 11-00 గంటలకు సమావేశమై నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికలు బాసబత్తిని రాజేశం అధ్యక్షతన . ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టి.పి.యు.ఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు గారు, రాష్ట్ర సంస్థాగత కార్యదర్శి శిరందాసు యాదగిరేందర్, వరంగల్ జిల్లా అధ్యక్షులు బిట్ల వెంకటేశ్వర్లు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి నర్సింగరావు, నల్లగొండ జిల్లా అధ్యక్షులు గంజి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వర్లు, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు కుకుడపు శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి రాపోలు సోమేశ్వర్, మరియు అనేక మంది కుల బంధువులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, పెన్షన్, ఆరోగ్య సౌకర్యాలు, సంక్షేమం కోసం కృషి చేస్తామని, సంఘాన్ని జిల్లా, మండల స్థాయి వరకు విస్తరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.నూతన రాష్ట్ర కమిటీ వివరాలు :అధ్యక్షులు : బాసబత్తిని రాజేశంఉపాధ్యక్షులు : గడ్డం వెంకటేశ్వర్లుప్రధాన కార్యదర్శి : చౌటి భూమేశ్వర్కోశాధికారి : కైరంకొండ యాదగిరిజాయింట్ సెక్రటరీలు : పెండెం వెంకటేశ్వర్లు, వీపూరి శ్రీనివాస్ఆర్గనైజింగ్ సెక్రటరీలు : వడ్డేపల్లి జనార్దన్, గెంట్యాల రామచంద్రంఎగ్జిక్యూటివ్ మెంబర్లు : జి. రుక్మిణి దేవి, తుమ్మల విజయ లక్ష్మీ తదితరులునూతన కమిటీ సభ్యులకు టి.పి.యు.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర సంస్థాగత కార్యదర్శి శిరందాసు యాదగిరేందర్ అభినందనలు తెలియజేశారు.



ప్రజల భద్రతే లక్ష్యంగా నున్న పోలీసులు..



నున్న గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన ఎసిపి సత్యానందం,సీఐ ఉమర్

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

పంచాయతీ ఎన్నికల సందర్భంగా విజయవాడ గ్రామీణ ప్రాంతమైన నున్న గ్రామంలో ఏసిపి సత్యానందం,సీఐ ఉమర్ ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఎన్నికలు అంటేనే ఉత్కంఠ అలాంటి సమయంలో ప్రజల్లో ధైర్యం నింపుతూ, గ్రామ గ్రామాన తిరుగుతూ భరోసా కల్పి స్తున్న పోలీస్ శాఖ తీరుకు హ్యాట్సాఫ్. రౌడీషీటర్లు, సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెంచి, ప్రశాంత ఎన్నికలకు బాటలు వేస్తున్న తీరు నిజంగా ప్రశంసనీయం. అంతేకాకుండా శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న పోలీస్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేసిన నున్న గ్రామస్తులు.



అన్నప్రసాద వితరణ పరిశీలన చేసిన ఈఓ శీనా నాయక్

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

కార్తీక మాసం పురస్కరించుకొని శ్రీ కనకదుర్గ అమ్మ వారి అన్న ప్రసాదం స్వీకరణకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేసిన ఏర్పాట్లను ఉదయం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వికె శీనా నాయక్ పరిశీలన చేశారు. అన్నప్రసాదం క్యూ లైన్, భోజన వితరణ ప్రదేశం, భక్తులు వేచి ఉండే ప్రదేశంను ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. ఈ కార్యక్ర మంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు రాఘవ రాజు, శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. రమ పాల్గొన్నారు.





ఆపదలో అండగా నిలిచిన మైత్రి .!

❖అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన వృద్ధురాలికి రెండు నెలల నిత్యావసర సరుకుల పంపిణీ ❖మానవత్వమే మైత్రి ఫౌండేషన్ ఆశయం – సేవా స్ఫూర్తికి మరో నిదర్శనం.!

ప్రజా భూమి, రీజనల్ రిపోర్టర్ మచిలీపట్నం

ఆపదలో ఉన్న అభాగ్యులకు అండగా నిలుస్తూ, ఆర్తులకు ఆపన్నహస్తం అందిస్తూ మానవత్వమే పరమ ధ్యేయంగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మైత్రి ఫౌండేషన్ మరోసారి తన సేవా స్ఫూర్తిని చాటుకుంది. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయురాలైన ఓ వృద్ధురాలికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించి మానవతా దృక్పథాన్ని చాటుకుంది.మచిలీపట్నం సమీపంలోని సుల్తాన గరం గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ సుబ్బారావమ్మ ఇల్లు ఈ నెల 12వ తేదీన సంభవించిన అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధ మైంది. ఈ ప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన ఆమె దీనస్థితిని తెలుసుకున్న మైత్రి ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి, బాధితురాలిని పరామర్శించారు. క్షేత్రస్థాయిలో ఆమె పరిస్థితిని పరిశీలించి, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేసి అండగా నిలిచారు.భర్తను కోల్పోయి, ముగ్గురు పిల్లలకు వివాహాలు జరిపించిన అనంతరం ఒంటరిగా జీవనం సాగిస్తున్న సుబ్బారావమ్మకు ఈ అగ్నిప్రమాదం తీరని కష్టాన్ని మిగిల్చింది.

ఇప్పటికే ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్న ఆమెకు ఇల్లు దగ్ధం కావడంతో జీవనం మరింత భారంగా మారింది. ఇటువంటి విపత్కర సమయంలో మైత్రి ఫౌండే షన్ అందించిన సహాయం ఆమెకు కొంత ఊరటని వ్వడమే కాకుండా, ఆపదలో తాము న్నామనే భరోసాను కల్పించింది.ఈ సంద ర్భంగా మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణుకుమార్ మాట్లాడుతూ, మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా అగ్నిప్రమాదాలు లేదా ఇతర విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు తమ ఫౌండేషన్ తక్షణమే స్పందిస్తుందని తెలిపారు. బాధితుల వద్దకు స్వయంగా వెళ్లి వారి పరిస్థితులను పరిశీలించి, అవసరాలను గుర్తించి చేతనైన సహాయాన్ని అందించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు కొండంత ధైర్యాన్ని అందించడం, సమాజంలో సేవాభా వాన్ని పెంపొందించడం తమ ఫౌండేషన్ ఆశయమని ఆయన స్పష్టం చేశారు. దాతల సహ కారం, సభ్యుల అంకితభావం, సేవా తత్పరతతో మైత్రి ఫౌండేషన్ నిరంతరం ప్రజాసేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బందరు సుల్తాన గరం డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి వన రాజు, మైత్రి ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వరప్రసాద్, గౌరవ సభ్యులు రాజేశ్వరరావు, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం అనే సందేశాన్ని చాటుతూ మైత్రి ఫౌండేషన్ అందించిన ఈ సహాయం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. “ఆపదలో అండగా మైత్రి.. అభాగ్యురాలి జీవితంలో ఆశాకిరణం!” లా నిలిచింది.

Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

ప్రజాభూమి

జనరల్ 13

ఆదివారం 15 నవంబర్ 2026

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కమీషనర్ రాజు

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలో ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయములో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను రామచంద్రపురం మున్సిపల్ కమీషనరు కె.వి.ఆర్.ఆర్. రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంబించారు. తొలుత జవహర్ లాల్ నెహ్రూ, అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాల వేసి ప్రారంబించారు. ఈ వారోత్సవాల కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎం శ్రీ నివాస్ ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ ఎం.ఆనంద్ ప్రశాంత్, జిల్లా కోర్టు పానెల్ అడ్వకేట్ డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా ముఖ్య అతిథి మున్సిపల్ కమీషనరు కె.వి.ఆర్.ఆర్.రాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు ప్రజలందరికి ఉపయోగపడే దేవాలయమని మనకు కావలసిన పుస్తకాలను కంప్యూటర్ ద్వారా చదవడం



కన్నా గ్రంథాలయానికి వచ్చి మనకు నచ్చిన పుస్తకం నేరుగా చదవడం వల్ల ఎంతో మానసిక వికాసం వస్తుందని సూచిస్తూ, ఈసందర్భంగా బాలలందరకూ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు.ఎంఇఓ ఎం.శ్రీనివాస్, మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రంధాలయాలను ఉపయోగించుకోవాలని, విద్యార్థులు తప్పని సరిగా ఏదో ఒక సమయంలో గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకొని గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలలో కొన్ని పుస్తకాలైన చదవాలని అన్నారు. ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ ఆనంద్ ప్రశాంత్, మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రతి రోజూ కాకపోయిన వారానికి ఒక సారి అయినా గ్రంథాలయానికి రావడం ,పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని తెలియజేసారు.

జిల్లా కోర్టు పానెల్ అడ్వకేట్,డి.సత్యన్నారాయణ మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా నైతికతతో కూడిన విద్యను అలవరచుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, పాఠకులు, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం పాఠశాల విద్యార్థులకు సబ్ జూనియర్స్ విభాగంలో “మీకు నచ్చిన చిత్రం”, జూనియర్స్ విభాగంలో “చెట్లు పరిరక్షణ ”, సీనియర్స్ విభాగంలో “ మన పండుగలు” అనే అంశంపై “చిత్రలేఖనం” పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జి.వి.వి.ఎన్.త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ కార్డులపై వైద్యం పూర్తిస్థాయిలో అందజేయాలి

ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు

పెన్షనర్స్‌కు అందజేసిన హెల్త్ కార్డులపై పూర్తిస్థాయిలో వైద్యం అందేలా చూడాలని, అదేవిధంగా ఐఆర్ 30 శాతం త్వరగా ప్రకటించాలని పలువురు పెన్షనర్స్ కోరారు. ఈమేరకు కాజులూరు మండలం గొల్లపాలెంలో పెన్షనర్స్ కార్యవర్గ సమావేశం దేవు సదానందమూర్తి అధ్యతన నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ నాయకులు మేడిశెట్టి శ్రీరాములు, కోశాధికారి కెవి రామరాజు తదితరులు మాట్లాడుతూ.తమకు రావలసిన డిఆర్‌లు నిర్దిష్టంగా తెలియజేసి చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు, త్వరితగతిన పిఆర్సీ పై నిర్ణయాలు తీసుకుంటున్నదుకు ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు చిట్నీడి సత్తిరాజు, పోలిశెట్టి కనకారావు, గాది రెడ్డి నాయుడు, ప్రమోద్ కుమారి, పీతల లక్ష్మి, పుట్టి అప్పారావు, గొల్లపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, పర్యావరణం, యోగాపై విద్యార్థులకు అవగాహన



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదేవరపేట ఎలిమెంటరీ స్కూల్ మెయిన్‌లో విద్యార్థులకు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగ ప్రోటోకాల్ ఇన్‌స్ట్రక్టర్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తాళ్లపూడి శాఖ మాజీ అధ్యక్షులు వెలుగుబంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, జంక్ ఫుడ్ దుష్ప్రభావాలు, పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. చాక్లెట్లు, బిస్కెట్లకు బదులుగా ఆరోగ్యకరమైన గాంధీ శనగలను పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ శంకర్, ప్రసన్న మాస్టారు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో ఆత్రేయపురం విద్యార్థుల ప్రతిభ



- మండల స్థాయిలో ముగ్గురు విద్యార్థుల విజయం
- కొత్తపేటలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్రేయపురం మండలంలో విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి షేక్ మహబూబ్ బాషా ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పాఠశాల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ తదితర విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారులు పి.వి. ప్రసాదరావు, ఎ. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల అభివృద్ధి అధికారి పి.వి.ఆర్.కె. రాజు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి, బాధ్యతాయుత పౌరసత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.

మండల స్థాయి పోటీల్లో ర్యాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. శ్రీహర్ష రెడ్డి, బి.ఇషిత, మెర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.లక్ష్మీపతి విజయం సాధించారు. వీరు ముగ్గురూ సోమవారం కొత్తపేటలో నిర్వహించనున్న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ. స్వరూప్‌తో పాటు వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎస్.వి.వి. ఎన్.ఎస్. ప్రసాద్, ఎం. సురేష్ బాబు, కె.వి. కృష్ణమూర్తి, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, హెవెలెన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు యువకులు అరెస్ట్

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. సుమారు రూ.5 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు, రూ.80 వేల నగదు చోరీకి పాల్పడిన ముగ్గురు యువకులను కొవ్వూరు రూరల్ సీఐ కె. విజయబాబు శనివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను కొవ్వూరు మండలం సీతంపేట వద్ద అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 18వ తేదీ రాత్రి వేగేశ్వరపురం గ్రామానికి చెందిన నోరి పేరి శాస్త్రి తన భార్యతో కలిసి హైదరాబాద్ వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బెడ్‌రూమ్‌లోని ఇనుప బీరువాను తెరిచి నగదు, బంగారు, వెండి ఆభరణాలతో పాటు టీవీ, ఇతర విలువైన వస్తువులను అపహరించారు. హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన ఇంటి యజమాని తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి చోరీ



జరిగినట్లు నిర్ధారించుకుని తాళ్లపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ టి. రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా మహమ్మద్ యాకుబ్ అలీ, మహమ్మద్ మహమ్మద్, అబ్దుల్ సమద్ ఖురేషి అనే ముగ్గురు యువకులను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ విజయబాబు తెలిపారు.

నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- ఎంపీడీఓ అమ్మిరాజు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

మండలంలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎంపీడీఓ బి. అమ్మిరాజు సూచించారు. శనివారం తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో నామినేషన్ల స్వీకరణకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవులతో పాటు 134 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని వివరించారు. నామినేషన్ కేంద్రాల్లో నియమించిన స్టేజ్-1 అధికారులకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని సూచించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 18వ తేదీన నామినేషన్ల పరిశీలన, 21వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉపసంహరణ



అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించి ఎన్నికల గుర్తులను కేటాయిస్తామని తెలిపారు. బ్యాలెట్ పత్రాల్లో అభ్యర్థుల పేర్లు కాకుండా ఎన్నికల గుర్తులు మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణ వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.ఎస్. వీరన్న, రిటర్నింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్మవరం సర్పంచ్ అభ్యర్థిగా ముదునూరి సీతారామరాజుకు మద్దతు

- వైఎస్సార్ కాలనీలో సీతారామరాజుకు మద్దతుగా తరలివచ్చిన వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు

ప్రజా భూమి,ప్రత్తిపాడు

డిసెంబర్ 2న జరగనున్న స్థానిక పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ధర్మవరం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి ఎంపికపై రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ధర్మవరం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ముదునూరి సీతారామరాజుకు మద్దతు ప్రకటించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు, గ్రామ ప్రజలు, సీనియర్ నాయకుల ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణంరాజు సోదరుడు ముదునూరి సీతారామరాజుకు మద్దతు లభించింది. ఈ సందర్భంగా వైఎస్సార్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి వైసీపీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి సీతారామరాజుకు తమ మద్దతు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై స్థానికంగా చర్చలు సాగుతున్నాయి. ఈ కార్యక్రమంతో ధర్మవరం గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో స్థానికంగా రాజకీయ వాతావరణం మరింత చర్చనీయాంశంగా మారింది.

స్వర్ణభారతి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- వివిధ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



ప్రజాభూమిప్రతినిధి – తాళ్లపూడి

ధర్మవరం స్వర్ణభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలను నిర్వహించారు. పాటలు, నృత్యం, స్పెల్ బీ, చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ పేరిచర్ల పద్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ పద్మ చేతుల మీదుగా బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో పోలీసు కవాతు

- భారీగా మోహరించిన పోలీసులు



ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు

ఈనెల 29 న జరగనున్న పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, స్వేచ్ఛాయుత మరియు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు, కాకినాడ ఎస్ డి పి ఒ ఎన్ ఎస్ వి కె. దుర్గారావు , కాకినాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి చైతన్య కృష్ణ సూచనల మేరకు, గొల్లపాలెం ఎస్సై పి వి ఎస్ ఎస్ ఎన్ సురేష్ ఆధ్వర్యంలో శనివారం సుమారు 120 మంది పోలీసు సిబ్బందితో పోలీసు కవాతు నిర్వహించినారు. ఈ కవాతు సమస్యాత్మక ప్రాంతాలలో నిర్వహించినారు. గొల్లపాలెం హైస్కూల్ వద్ద ప్రారంభమై, గొల్లపాలెం గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. అనంతరం కాజులూరు, పల్లిపాలెం గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఈనెల 29 వి తేదిన జరగనున్న పంచాయితీ ఎన్నికల దృష్ట్యా ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉందనే భరోసా కల్పించడం ఈ కవాతు ముఖ్య ఉద్దేశమని ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

ఆదివారం 15 నవంబర్ 2026



కూటమి ఐక్యతతోనే
ఎన్నికల్లో అద్భుత విజయాలు

- ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ఏలూరు

కూటమి ప్రభుత్వ జవాబుదారీ పాలన, సమన్వయంతో కూడిన అభివృద్ధి కార్యాచరణ వల్లే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి,నగర మేయర్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు.ఎన్నికల ఫలితాలు కూటమి ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.ఏలూరు శేఖర్‌వీధిలోని తూర్పుకాపు కళ్యాణ మండపంలో అప్పికట్ల రాంబాబు, రాఘవ రాజు, బంకా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి,మేయర్ రెడ్డి అప్పలనాయుడులను గజమాలలు,శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ఐక్యతతోనే ఏలూరులో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, నగరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.మేయర్ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజలు కల్పించిన అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించి, ఐదేళ్లపాటు నిబద్ధతతో పనిచేస్తానని, నగరవాసులు,కూటమి నాయకులను కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కార్పొరేటర్లు కొండేటి నిర్మల కుమారి, దావాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యంలో ఆగిరిపల్లి..
వైభవంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ

- వేదమంత్రాల నడుమ ధ్వజ ప్రతిష్ఠ..
- ఆధ్యాత్మిక శోభతో అలరారిన ఆలయ ప్రాంగణం
- సుమారు 15 వేల మందికి అన్నప్రసాద వితరణ





ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

శరణుఘోషతో మారుమోగిన ఆగిరిపల్లి గ్రామం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. ఆగిరిపల్లిలోని శ్రీశ్రీశ్రీ దుగ్గిరాల బాలరావమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్త్ర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం అత్యంత వైభవంగా, ఆగమ శాస్త్ర సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. తాంత్రికాచార్యులు బ్రహ్మశ్రీ జిల్లు తిరుమణి, సునీల్ తిరుమణి, సతీష్ తిరుమణి ఆధ్వర్యంలో గణపతి హోమం, కలశ పూజలు, కలశ ఊరేగింపు తదితర వైదిక కార్యక్రమాలు భక్తిప్రపత్తులతో సాగాయి. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో పులకించిపోయాయి. స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంతో శరణుఘోష చేస్తూ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ మహోత్సవానికి ఆగిరిపల్లి మండలంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా అయ్యప్ప మాలధారులు, భక్తులు తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ దుగ్గిరాల బాలరావమ్మ తల్లి ఆలయ కమిటీ, గ్రామ పెద్దల సహకారంతో సుమారు 15 వేల మంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించడం విశేషం. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడగా, అయ్యప్ప నామస్మరణతో గ్రామమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్త్ర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామివారి విగ్రహ ప్రతిష్ఠతో అగిరిపల్లి ప్రాంతశీలో భక్తులకు మరో ఆధ్యాత్మిక కేంద్రం అందుబాటులోకి రావడంతో మండలంలోని ప్రజలందరూ ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు

పుస్తక పఠనంతో విజ్ఞాన వికాసానికి నాంది

ప్రజాభూమి ప్రతినిధి ఆగిరిపల్లి



ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమ య్యాయి.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులు వేణుగోపాల్ రావు, సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్రసంగం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ నెల 20వ తేదీ వరకు వారోత్సవాలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఈ.జి.ఎస్.వి. కుమార్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం వేడుకల్లో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి యన్.శ్రీలక్ష్మి, స్థానిక శనివారపు పేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం నందు శనివారం నిర్వహించిన జాతీయ బాలలు దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాలు ప్రకారం జాతీయ బాలలు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 10వ తేదీ నుండి న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించామని తెలిపారు. బాలలకు నిర్బంధ విద్య, ఫోక్స్ చట్టం, సురక్షితమైన స్పర్శ- భద్రత అంశా లుపైన అవగాహన కలిగించడం జరిగిందని, న్యాయసేవా ధికార సంస్థలు నిరంతరం బాలకార్మిక, బాల్యవివాహ నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిరోధించేందుకు ప్రభుత్వ రంగసంస్థలతో సమన్వయ పరచుకుని విశేష కృషి చేస్తుందని తెలిపారు. అధికారులతో పాటు పౌరులు కూడా సహకరించాలని,చట్టంతో విభేదించిన బాలలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం, కేసులు పురోగతిని సమీక్షించడం వారికి అందించే సౌకర్యాలు పట్ల ఎప్పటికప్పుడు అధికారుల ప్రమాద్ధతం చేయడం జరుగుతుందని తెలియజేశారు. దొండపాడులోని పరివర్తన విభిన్న ప్రతిభావంతులు పాఠశాల నందు నిర్వహించిన జాతీయ బాలల దినోత్సవంలో పాల్గొని తర్జుమా ఉపాధ్యాయులు ద్వారా న్యాయ సేవాధికార సంస్థ అందించి ఉచిత సేవలు పైన అవగాహన కలిగించారు. ఉచిత న్యాయ సేవలు లేదా సలహాలకు 15100 ద్వారా సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమం



లో రాష్ట్ర జువనైల్ వెల్ఫేర్ అధికారిని వసంత బాల, సిడబ్ల్యూసి చైర్మన్ పుచ్చల వెంకటేశ్వర రావు, చిల్డ్రెన్ హోమ్ పర్యవేక్షకురాలు శ్రీవల్లి, జిల్లా బాలల సంక్షేమం మరియు కరెక్షనల్ సేవలు అధికారిని మిస్ జ్యోతి పరివర్తన, విభిన్న ప్రతిభావంతుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలు అవాస్తవం

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు



మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబం ధించి అవినీతి జరిగిందంటూ వస్తున్న ఆరోప ణలను నూజివీడు మున్సిపల్ కమిషనర్ పీరయ్య తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ని ర్వహణ కోసం భారీగా ఖర్చులు చేయాల్సి ఉంటుందని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులకు అవసరమైన వస తులతో పాటు భోజన సదుపాయాలు కూడా కల్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేసిన ప్రతి ఖర్చుకు పూర్తి స్థాయిలో లెక్కలు ఉన్నాయని, అధికారుల పర్యవేక్షణలో, జిల్లా కలెక్టర్ ఆమోదంతోనే ఖర్చులు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో రూ. 26 లక్షలు భోజన ఖర్చులుగాచూపించారంటూ ప్రచారం చేస్తున్న ప్రకటనలో వాస్తవం లేదన్నారు. అసలు రూ. 26 లక్షలను భోజన ఖర్చులుగా తాము నమోదు చేయలేదని స్పష్టం చేశారు. నూజివీడు మున్సిపాలిటీపై బురదజల్లేలా కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వాటిని తీవ్రంగా ఖండిస్తు న్నామని కమిషనర్ పేర్కొన్నారు. అవసరమై తే తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఎన్నికల ఖర్చులపై ఎవరికైనా సందేహాలు ఉంటే నేరుగా మున్సిపాలిటీకి వచ్చి అధికారులను సంప్రదించాలని, మీడి యా సమక్షంలోనే వివరాలు అడిగి లెక్కలను పరిశీలించుకోవచ్చని సూచించారు. వాస్తవా లు తెలుసుకోకుండా, పూర్తి సమాచారం లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని కమిషనర్ పీరయ్య స్పష్టం చేశారు.

ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకునే
వంగడాలను రైతులు సాగు చేయాలి

- జిల్లా కలెక్టర్ కె వైట్రీ సెల్వి.

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా.



ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడే ప్ర త్యామ్నాయ వరి వంగడాలను రైతులు సాగుచేసేలా అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యవసాయాధికా రులు ఆదేశించారు. దెందులూరు మండలంలోని పోతునూరు గ్రామంలో తుఫాన్ కు దెబ్బతిన్న పొలాలను శనివారం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో అధిక దిగుబడి నిచ్చే స్వర్ణ వరి వంగడాన్ని రైతులు సాగుచేశారని, స్వర్ణ రకం అధిక దిగుబడి ఇచ్చే వరి వంగడమే కానీ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో మొక్క వాలిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఇటీవల కురిసిన తుఫాన్లు, భారీ వర్షాల కారణంగా స్వర్ణ రకాల వరి పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే 1318, 1121, పిఎల్ 1100 రకాలపై రైతులకు అవగాహన కలిగించాల ని, ఆయా విత్తనాలను రైతులకు అందుబా టులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు కలెక్టర్ ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించాలని కోరారు. ఈ సందర్భంగా రైతుల పంట పొలాలను పరిశీలించి, వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యంత్రాల ద్వారా వరి పంట కోతలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమకు అదనంగా డిఏపి మంజూ రు చేయాలనీ కోరారు. ఈ విషయంపై ప్రభుత్వానికి అనుమతులు కోరాలని వ్యవసా యాధికారులు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఖరగపూర్- విజయవాడ
రహదారికి భూసేకరణ చేపట్టాలి

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా



ఖరగపూర్‌తో విజయవాడ జాతీయ రహదారి కి సంబంధించి భూసేకరణ చర్యలు చేపట్టా లని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శనివారం జాతీయ రహదారులు, పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ కాలనీలు, తదితర ప్రా జెక్టులకు సంబంధించి భూసేకరణ, నిర్మాణ ప నులు, తదితర అంశాలపై అధికారులతో కలె క్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూసేకరణ పనులు, ఆర్ ఓ బి నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు అందించాల్సిన పరిహారాలను వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా జా యింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓలు లక్ష్మీప్రసన్న, రమణ, తహసీల్దార్లు, జాతీయ రహదారి శాఖ అధికారులు, ప్రభృతులు పాల్గొన్నారు.

భక్తుల రద్దీకి పటిష్ట పోలీసు బందోబస్తు

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి : ఆగిరిపల్లిలోని శ్రీశ్రీశ్రీ దుగ్గిరాల బాలరావమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరైన నేపథ్యంలో నూజీవీడు డీఎస్పీ ప్రసాద్ ఆదేశాల మేరకు నూజీవీడు గ్రామీణ సీఐ నాగేంద్రకుమార్, ఆగిరిపల్లి ఎస్సై వి. సురేష్ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆగిరిపల్లి పోలీస్ సిబ్బందితో పాటు నూజీవీడు సర్కిల్, నూజీవీడు పట్టణ పోలీస్ సిబ్బంది, ఏలూరు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి ప్రత్యేక బలగాలను రప్పించి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సుమారు 56 అడుగుల ఎత్తైన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.



ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

నూజివీడు మండలము అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం బాలల దినోత్సవము సంధర్భముగా మొదటగా నెహ్రూ చిత్రపటానికి సీనియర్ తెలుగు టీచర్ శ్రీ మంగలక్ష్మీ, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు దుర్గా మల్లేశ్వరరావు పూల మాలంకృతముచేశారు. పాఠశాల ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర మాట్లాడుతూ ప్రప్రదమ భారత ప్రధాని నెహ్రూ అని తెలిపారు. భారత దేశానికి నెహ్రూ చేసిన సేవలు కొనియాడారు. పిల్లలు అంటే నెహ్రూ కు చాలా ఇష్ట మని, చాచా అనే బిరుదు పొందారని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులు అని తెలిపారు. జీవశాస్త ఉపాధ్యాయులు దుర్గామల్లేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ మంచి విద్య, వారి హక్కులు దేశానికి ఎంతో ముఖ్యమైన చెప్పే వారు. మంచి ప్రవర్తనతో దేశానికి గర్వ కారణం గా ఎదగాలని నెహ్రూ ఆశించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనీఉపాధ్యాయులు నాగరాజు, ఫిలోమిన, జయకుమారి, దుర్గామల్లేశ్వరరావు, శ్రీమంగలక్ష్మి, వెంకటరమణ, రాజేంద్రప్రసాద్, భోగిప్రసాద్, కృష్ణ కుమారి పాల్గొన్నారు.

వ్యాయామంతో మధుమేహం దూరం



ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

మధుమేహాన్ని రాకుండా కొన్ని వ్యాయామాలు, ఆహారపు అలవాట్లు ద్వారా నివారించుకో వచ్చని డిఎంహెచ్వో డా. శోభ తెలియజేశారు. ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక పవర్ పేట అర్బన్ హెల్త్ సెంటర్ నందు మధుమేహం నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో డా. శోభ మాట్లాడుతూ మధుమేహం వచ్చిన తర్వాత తరచూ మూడు నెలలకు ఒకసారి లేదా ఆరు నెలలకు ఒకసారి మధుమేహ పరీక్షలు చేయించుకొని వైద్యం సలహాలు పాటిస్తూ మధుమేహాన్ని నియంత్రించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డా. లక్ష్మీనారాయణ డా. నరేంద్ర కృష్ణ మరియు యు పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ గౌతమ్ రాజు మరియు స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం
సీలింగ్ ఫ్యాన్ల వితరణ



ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

నెక్కలం గొల్లగూడెం మండల పరిషత్ నమూనా ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుడు విజయరత్నాచార్య సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి--2 కొవ్వలి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన భౌతిక వసతులు కల్పించడం ద్వారా అభ్యసన సామర్థ్యం పెరుగుతుందని, దాతల సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం. నాగమణి, పాఠశాల కమిటీ అధ్యక్షుడు ఎన్. వసంతరావు, ఉపాధ్యాయులు చౌటపల్లి సురేష్ కుమార్, షేక్ ఖమరున్నిసా, వేమన వేణుగోపాలరావు, విజయరత్నాచార్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 15

ఆదివారం 15 నవంబరు 2026

అధికారుల సమన్వయానికి అభినందనీయం:మంత్రి సుభాష్

వారియర్స్‌కు ఘన సన్మానం

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం



ఆర్నబ్ తుఫాను సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే ధ్యేయంగా భావించి, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ విధులు నిర్వహించి సేవలందించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అభినందించారు. విపత్తు సమయంలో అధికారులు చూపిన సమన్వయం, సమయస్ఫూర్తి, అంకితభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ రామచంద్రపురం అధ్యక్షుడు తిరుమలరాజు ప్రభాకర్ వర్మ అధ్యక్షతన శనివారం రామచంద్రపురం లయన్స్ క్లబ్‌లో ఆర్నబ్ తుఫాను వారియర్స్‌కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ తుఫాను సమయంలో పోలీస్, రెవెన్యూ, విద్యుత్ శాఖలు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారని తెలిపారు. భారీ గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడినప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం అభినందనీయమన్నారు. విపత్తు సమయంలో ప్రజలకు భరోసా కల్పిస్తూ సేవలందించిన ప్రతి ఒక్కరూ అభినందనలకు అర్హులని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తి, సమన్వయం భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. సత్యం మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు ఎదురైనప్పుడు ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు అండగా నిలవడం ఎంతో ముఖ్యమన్నారు. ఆర్నబ్ తుఫాను సమయంలో అధికారులు, సిబ్బంది చూపిన సేవా స్ఫూర్తి సమాజానికి ఆదర్శమని తెలిపారు. కష్టకాలంలో ప్రజల కోసం పనిచేసే వారిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, లయన్స్ క్లబ్ చేపట్టిన ఈ సన్మాన కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు.ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ తుఫాను సమయంలో అధికారులు సమయస్ఫూర్తితో స్పందించడం వల్ల ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు సకాలంలో అందాయని తెలిపారు. ప్రజా సేవలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు.

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ విపత్తు సమయంలో విధి నిర్వహణే ప్రధాన కర్తవ్యంగా భావించి రాత్రింబవళ్లు పనిచేసిన సిబ్బంది సేవలు మరువలేనివని అన్నారు. ప్రజల భద్రత కోసం తమ కుటుంబాలను సైతం పక్కనపెట్టి పనిచేసిన వారిని గౌరవించడం ఎంతో సంతోషకరమని తెలిపారు.మున్సిపల్ చైర్ పర్సన్ మేడిశెట్టి శేషారావు మాట్లాడుతూ ఆర్నబ్ తుఫాను సమయంలో మున్సిపల్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పారిశుద్ధ్యం, రహదారులపై పడిన చెట్ల తొలగింపు, ప్రజలకు అవసరమైన సహాయక చర్యల్లో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేశామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తుఫాను సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొన్న సుమారు 40 మంది వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు, డీఎస్పీ ఎం. శేషు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, సీఐ వెంకటనారాయణ, తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, ఎస్ఐ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేటమామిడి సెంటర్లో పోలీసుల వాహన తనిఖీలు

-హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరి.. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు: సీఐ గజేంద్ర కుమార్



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

పోలవరం జిల్లా అడ్డతీగల మండలం వేటమామిడి సెంటర్లో శనివారం రాత్రి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారి 516జుపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ఆపి, వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాల ను పరిశీలించారు.ఈ సందర్భంగా సీఐ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని హెచ్చరించారు. రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.తనిఖీల్లో సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించినట్లు ఎస్సై బి. వినోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి. వినోద్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధుని అంత్యక్రియలకు మేమున్నాం సేవా సంస్థ వితరణ

ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ వీణం



ప్రజాభూమి ప్రతినిధి-మచిలీపట్నం

కృష్ణాజిల్లా గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామ కాలనీలో నివాసం ఉంటున్న గుండారపు వెంకటరావు (70) కడు పేదరికం అనుభవిస్తూ, దయనీయ స్థితిలో శుక్రవారం రాత్రి కన్నుమూశారని అంత్యక్రియలకు సహాయం చేయాలని స్థానికుల ద్వార సమాచారం తెలుసుకున్న పెడన పట్టణంలోని మేమున్నాం సేవా సంస్థ చైర్మన్ శ్రీనివాస్ వీణం వారు స్పందించి దాతల సహకారంతో తక్షణ చర్యలలో భాగంగా రూ.3000/- లు నగదు కుటుంబ సభ్యులకు అందించి వారికి మనోధైర్యం కల్పించడం జరిగింది.స్థానిక ప్రజలు సంస్థ యొక్క ఔదార్యం తెలుసుకుని మేమున్నాం అనే సందేశం మాటలలో కాదు చేతలలో చూపుతున్న సంస్థ యొక్క దాతృత్వాన్ని స్థానిక ప్రజలు గుర్తించి హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్ వీణం, పవన్ కళ్యాణ్, నాగరాజు బంధువులు స్థానికులు మహిళలు మిత్రులు పాల్గొని సహాయం అందించారు.

బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

-ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల అందజేత



ప్రజాభూమి ప్రతినిధి-లింగాల

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఇప్పట్ల గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె. శివకేశవమ్మ మాట్లాడుతూ బాలల దినోత్సవ ప్రాముఖ్యత, బాలల హక్కుల గురించి వివరించారు. ప్రతి చిన్నారికి విద్య, సమాన అవకాశాలు కల్పించడంతో పాటు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, విద్యార్థులతో పాటు రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సీ.ఎస్.డబ్ల్యూ.వై. విజయలక్ష్మి, జ్యోతి, నరసింహులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిబ్బందికి శిక్షణ



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలో డిసెంబర్ 2న నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి మొదటి, రెండో దశ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల విధులపై సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ఎంఓటీల ద్వారా ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది పాటించాల్సిన వివిధవిధానాలు, బాధ్యతలు, పోలింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ సలాం, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి దుర్గారావు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర లింగార్చన, దీపాలంకరణ, ఊయల సేవ





ప్రజాభూమి ప్రతినిధి-ఇంద్రకీలాద్రి

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పవిత్ర కార్తీక మాస ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం ప్రదోష కాలంలో శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ మరియు ఊయల సేవ కార్యక్రమములు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక బృందం శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్ఛారణల నడుమ ఈ విశేష పూజా క్రతువులను నిర్వహించారు.పవిత్ర కార్తీక మాసంలో నిర్వహించే సహస్ర లింగార్చనలో పాల్గొని ఆ పరమేశ్వరుని దర్శించుకోవడం వల్ల సమస్త పాపాలు నశించి, సకల గ్రహ దోషాలు తొలగిపోతాయని ఆగమ శాస్త్రాలు పేర్కొంటున్నాయి. వేయి లింగాలకు ఏకకాలంలో జరిగే ఈ విశేష అర్చన ద్వారా భక్తులకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకస్వాములు తెలిపారు.

ఈ దివ్య పూజా కార్యక్రమాలలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణా ధికారి వి.కె. శీనా నాయక్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. సహస్ర దీపాల కాంతుల నడుమ సాగిన అర్చ న మరియు అనంతరం జరిగిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఊయల సేవ భక్తులకు కనువిందు చేశాయి. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలను అందజేశారు.ఈ విశేష కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు రాఘవరాజు, ఎ. శ్రీనివాసరావు, సరిత, పద్మావతి ఠాకూర్, ప్రత్యేక ఆహ్వానితులు వి. శంకర బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవ వేడుకలో పెద్ది రమేష్

-చిన్నపిల్లలకు చాక్లెట్లు పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి-విజయవాడ

భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 55వ డివిజన్‌లో కార్పొరేటర్ పెద్ది రమేష్ ఆధ్వర్యంలో చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు.డివిజన్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, ఉర్దూ పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్ పెద్ది రమేష్ విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు అందజేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించి వారిలో ఆనందోత్సాహాలు నింపారు.ఈ కార్యక్రమంలో 55వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెద్ది శ్యామ్ సుందర్, జనసేన పార్టీ అధ్యక్షులు రౌతు వాసు, జనసేన మహిళా నాయకురాలు షాహినా, టీడీపీ సీనియర్ నాయకులు శేషారావు, రమణ, పార్థు, శంకర్, కప్పిరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

జనగణన 2027

జనాభా లెక్కింపును అత్యంత కచ్చితత్వంతో నిర్వహించాలి

- జనగణన సమాచార సేకరణలో ఎలాంటి తప్పులకు తావుండకూడదు
- క్షేత్రస్థాయి అధికారులు విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి
- సెన్సస్ జాయింట్ డైరెక్టర్ జి. ప్రసన్న కుమార్



ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

భారత జనగణన 2027 రెండవ దశ ప్రక్రియను అత్యంత కచ్చితత్వంతో, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సెన్సస్ జాయింట్ డైరెక్టర్ జి. ప్రసన్న కుమార్ అధికారులకు సూచించారు. జనగణనలో సేకరించే ప్రతి సమాచారం కీలకమైనదని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. భారత ప్రభుత్వ జనగణన కార్యకలాపాల ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా, ఛార్జ్ స్థాయి అధికారులకు జనగణన 2027 రెండవ దశపై నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో రెండవ రోజు శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆయన పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సెన్సస్ జాయింట్ డైరెక్టర్ జి. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ జనాభా లెక్కింపు ద్వారా సేకరించే గణాంకాలు దేశ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అందువల్ల సమాచార సేకరణలో ఖచ్చితత్వం, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జనాభా లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, అధికారుల బాధ్యతలు, సాంకేతిక అంశాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. సమాచార సేకరణ సమయంలో ఎదురయ్యే సందేహాలను వెంటనే నివృత్తి చేసుకుని, నిర్దేశిత పద్ధతులను కచ్చితంగా పాటించాలన్నారు. జనగణన కార్యక్రమం విజయవంతం కావడంలో జిల్లా, ఛార్జ్ స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయం కీలకమని పేర్కొన్నారు. ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను జవాబుదారీతనంతో నిర్వహించి, జనాభా లెక్కింపు ప్రక్రియను నిర్దిష్ట మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఎ.రవీంద్రరావు, మాస్టర్ ట్రైనర్ కొల్లేటి రమేష్, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల సెన్సస్ ఇంచార్జి సి.హెచ్.వెంకటరమణ, ఇన్స్ట్రక్టర్లు వి.ఆదిలక్ష్మి, ఎం.స్వాతి, కలెక్టరేట్ మేజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.వెంకట రామయ్య, జిల్లా స్థాయి అధికారులు, ఛార్జ్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిబ్బందికి శిక్షణ

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలో డిసెంబర్ 2న నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి మొదటి, రెండో దశ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల విధులపై సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ఎంఓటీల ద్వారా ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది పాటించాల్సిన వివిధవిధానాలు, బాధ్యతలు, పోలింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ సలాం, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి దుర్గారావు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల వ్యయ నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి

- అభ్యర్థుల రోజువారీ ఎన్నికల వ్యయ రిజిస్టర్లను నిరంతరం తనిఖీ చేయాలి
- ర్యాలీలు, సభలు, ప్రచార వాహనాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి
- నగదు, మద్యం, కానుకల పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంచాలి
- రిటర్నింగ్ అధికారులకు రెండవ దశ బ్రీఫింగ్‌లో ఎన్నికల వ్యయ నిర్వహణపై దిశానిర్దేశం
- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయ్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల వ్యయ నిర్వహణకు సంబంధించిన నిబంధనలను అధికారులు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ సూచించారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్ అధికారులకు రెండవ దశ బ్రీఫింగ్ సమావేశం శనివారం విజయవాడలోని ఇరిగేషన్ శాఖ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల వ్యయ నిర్వహణ, పర్యవేక్షణ, నిఘా బృందాల విధులు తదితర అంశాలపై అధికారులకు సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన వ్యయ పరిమితికి లోబడి మాత్రమే ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. అభ్యర్థులకు వ్యయ పరిమితిపై ముందుగానే అవగాహన కల్పించడంతో పాటు, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రతి ఖర్చును నిర్దిష్ట నమూనాలో నమోదు చేసేలా చూడాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. అభ్యర్థులు తమ రోజువారీ ఎన్నికల వ్యయ రిజిస్టర్లను నిర్దిష్ట సమయాల్లో అకౌంటింగ్ బృందాలకు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థుల వ్యయ వివరాలను క్రమం తప్పకుండా పరిశీలించి, రికార్డులను సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. ప్రతి అభ్యర్థికి సంబంధించిన షాడో రిజిస్టర్లను అకౌంటింగ్ బృందాలు తప్పనిసరిగా నిర్వహించాలని, వ్యయ నివేదికలు సమర్పించని అభ్యర్థులకు నిబంధనల ప్రకారం తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, ప్రచార వాహనాల వినియోగానికి సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు పొందాలని అభ్యర్థులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. మంజూరు చేసిన అనుమతుల వివరాలను వీడియో సర్వెలెన్స్, అకౌంటింగ్ బృందాలకు అందజేసి, వాస్తవంగా జరిగిన ఖర్చులను నమోదు చేసిన వ్యయ వివరాలతో సరిపోల్చాలని సూచించారు. అనుమతులు లేకుండా నిర్వహించే కార్యక్రమాలపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.